Pubilshed from Kadapa
PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి
ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 244 Issue No : 244 | బుధవారం Wednesday | జూలై 15, 2026 15 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## ఎపిలో సర్ ప్రక్రియ గడువు పొడిగింపు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ గడువును పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారం..ఈ ప్రక్రియ నేటితో (జులై 14) ముగియాల్సి ఉండగా, రాజకీయ పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ గడువు పొడి గింపు నిర్ణయం తీసుకున్నారు.

2 లో



## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

- నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి
- అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి
- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్ ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడు తూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్థంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం.

- మిగతా 2లో..



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

### వైసీపీ అధినేత జగన్

- మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్
- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం: మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు.

2 లో..




## పశ్చిమాసియా ఉద్రిక్తతలతో షేర్ మార్కెట్లు డీలా

### 300 పాయింట్లకుపైగా పడిపోయిన సెన్సెక్స్

ముంబయి : పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్--అమెరికా మధ్య ఉద్రిక్తతలు ముదరడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.96.14కు బలహీనపడింది. మరోవైపు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మంగళవారం దేశీయ సూచీలు నష్టాలతో ట్రేడవుతున్నాయి.

2 లో..




## బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

### క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం

- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు
- ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరిం చుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయం లో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు.

దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- మిగతా 2లో..



## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూత

ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం (73) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ముద్రగడ ఇవాళ హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ముద్రగడ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

- మిగతా 2లో..

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై ఎదురుచూపులకు తెర..

- కేంద్రం కీలక హామీ!
- మామునూరు ఎయిర్‌పోర్టు పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామన్న కేంద్ర మంత్రి
- 2028 జూన్ 2 నాటికి పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడి హామీ
- 253 ఎకరాలు ఇచ్చిన రాష్ట్రానికి కేంద్రం ప్రశంస
- ఆదిలాబాద్‌లో 1,500 ఎకరాల భూసేకరణ
- కేంద్ర సహకారంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం రేవంత్

ప్రజాభూమి ప్రతినిధి, వరంగల్ : వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. మరో మూడు, నాలుగు వారాల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.



- మిగతా 2లో..

## ఇరాన్ సైన్యం ఖతం..



- సుప్రీం లీడర్ కూడా 90 శాతం క్లోజ్ అయినట్టే!'
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ఇరాన్ రక్షణ దళాలు పూర్తిగా నాశనమయ్యాయని ట్రంప్ ప్రకటన
- మొజ్తబా ఖమేనీ 90 శాతం మరణించారని వెల్లడి
- ఫిబ్రవరి దాడుల్లోనే మాజీ అధినేత అలీ ఖమేనీ మృతి
- ఇరాన్ ప్రతికార దాడులతో బహ్రెయిన్, యూఏఈల్లో ఉద్రిక్తత

అమెరికా : అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఆ దేశ సైనిక సామర్థ్యం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, అగ్ర కమాండర్లందరూ హతమయ్యారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.

2 లో

## జగన్ హయాంలో 275 మంది మత్స్యకారులు మృతి చెందారు

### మంత్రి అచ్చెన్నాయుడు

- వైసీపీ పాలనలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలను జగన్ ఎందుకు పరామర్శించలేదన్న అచ్చెన్నాయుడు
- గొడ్డలి పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టిందని ఎద్దేవా
- మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య




ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : మత్స్యకారులను పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని అన్నారు. వైసీపీ పాలనలో ప్రకృతి వైపరీత్యాల వల్ల 275 మంది మృతి చెందారని తెలిపారు. అయితే, వారిని జగనే చంపేశారని అవివేకంగా తాము మాట్లాడబోమన్నారు. నాడు మృతి చెందిన 275 మంది కుటుంబాలను జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. గొడ్డలి పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టిందని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. సీదిరి అప్పలరాజు కుమారుడు ఓ వ్యక్తిని తన వాహనంతో ఢీకొట్టి చంపినా వైద్యం చేయించకపోవడం దారుణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

వివరాలు లోపల పేజీలో

## ఏపీలో రెండో విడత జాబ్ క్యాలెండర్..

### 3,168 పోస్టుల భర్తీకి కసరత్తు

- ఏపీలో రెండో విడత జాబ్ క్యాలెండర్‌కు ప్రభుత్వ కసరత్తు
- సుమారు 3,168 పోస్టులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం
- వీటిలో 91 గ్రూప్-1 పోస్టులు ఉన్నట్లు సమాచారం
- ఆగస్టు 15న నోటిఫికేషన్లు జారీ చేసే అవకాశం
- ఉద్యోగ నియామకాలపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఏపీలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మరో శుభవార్త అందించేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో రెండో విడత ఉద్యోగ నియామకాలకు సంబంధించిన జాబ్ క్యాలెండర్ రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్, సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు హాజరయ్యారు. త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.సమీక్షా సమావేశంలో సీఎస్ పలు కీలక అంశాలపై చర్చించారు.

2 పేజీలో..

ప్రజాభూమి
బుధవారం, జులై 15, 2026


# డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

మొదటి పేజీ తరువాయి

మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన**

'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది,
గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు అర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నాను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలుగు గోడలు దాటి వెళ్లాలి**

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. తొలిసారి ట్రూ డౌన్‌ను కూడా అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయి. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పనిచేయాలి. ముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం. ప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని ముందుకు వెళ్తాం. రాష్ట్రాభివృద్ధిలో సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌ఓడీలు హాజరయ్యారు.

## సంపాదకీయం

### ప్రహసనంగా మారిన సర్ ప్రక్రియ !

ఆధార్ సక్రమంగానే ఉంటోంది. పాన్ కార్డు సక్రమంగానే ఉంటోంది. గ్యాస్ కనెక్షన్ కూడా పక్కాగా ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ కూడా పక్కాగానే ఉంటోంది. ఇంటినంబర్లు, చెల్లింపులు ఇలా చెప్పకుంటూ పోతే అన్నీ పక్కాగా ఉంటున్నా..ఓటు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఎఐని అడిగితే ఎలా పక్కాగా చేయవచ్చో చెబుతుంది. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తే పక్కాగా ఓటరు కార్డు వస్తుంది. కానీ ఎన్నికల సంఘం, కేంద్రానికి ఇవేమీ పట్టడం లేదు. పర్మినెంట్ ఓటరు కార్డు నంబర్ ఉంటే ఓటు కోసం గందరగోళం పడాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఓటును పక్కాగా ఉంచుకుంటారు. ఎవరైనా అడ్రస్ మారితే మార్చకుంటారు. ఆధార్ విషయంలో ఇదే జరుగుతోంది. కానీ ఘనత వహించిన ఎన్నికల సంఘం మాత్ర దీనిని ఓ మాయగా తయారు చేసింది. చదువుకున్న వారికి సైతం అర్థం కాని ప్రక్రియగా చేశారు. టెక్నాలజీ ఇంతగా పెరిగినా ఉపయోగించుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పాలి. తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్రస్థాయిలో ఘోరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫామ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెకలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదురొంటున్న వాస్తవ పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాంతాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరైతే వారెలా ఉంటారో కూడా చూసి ఉండలేదంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99.98 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ పూర్తయింది. 26 జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశామని అధికారులు కాగితాల్లో లెకలు చూపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమీక్షల్లో శభాష్ అనిపించుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపించిన ఈ అంకెల గారడీ ఇప్పుడు ఓటర్ల పాలిట శాపంగా మారింది. అధికారులు వంద శాతం పంపిణీ అని చెప్తుంటే.. నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం 'మా కాలనీ, మా ఇండ్లకు అసలు బీఎల్‌వోలు వచ్చిన దాఖలాలే లేవు. మాకు అందాల్సిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఎటు పోయాయని ప్రశ్నిస్తున్నారు. దీని బదులు ఏ మీసేవా సెంటర్‌లో పెట్టినా హాయిగా వెళ్లి సవరణలు చేసుకునే వారమని అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపకల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫామ్‌లు అందనే లేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే, ఆఫీసుల్లో కూర్చొని ఫామ్‌ల పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత గడువులోగా పక్రియ పూర్తి చేయాలనే పైఅధికారుల ఒత్తిడికి భయపడి క్షేత్రస్థాయి సిబ్బంది తూతూమంత్రంగా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్ నిబంధనల ప్రకారం బీఎల్‌ఓలు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలన్న నియమం ఉన్నా కనీసం ఒక్కసారి కూడా క నిపించకుండానే పోతున్నారు. నగరాలు, పట్టణాల్లో ని అనేక కాలనీల్లో బిఎల్‌వోలు సందర్శించిన ప్రాంతాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెప్పకుంటోది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇపూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్‌ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ పక్రియ దరిద్రంగా సాగుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. గతంలో బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రజలు గగ్గోలు పెడుతుంటే ..ఇక్కడ ఉన్నవారికి అదో వింతగా అనిపించింది. కానీ ఇప్పుడు మనకు అనుభం కావడంతో అసలు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే సాగితే తెలుగు రాష్ట్రాల్లో కనీసం 50 శాతం ఓట్లు గల్లంతు కావడం ఖాయం. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదు. అలాగే తొలగించడం కూడా సరికాదు. ఆధార్ కార్డును ఓటరుగా గుర్తించేందుకు ఉపయోగ పడదని ఇప్పటికే ఇసి తేల్చి చెప్పింది. ఆధార్ కార్డు ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో అర్థం చేసుకోవాలి. నిజానికి ఓటు నమోదు, తొలగింపే ఓ ప్రహసనంగా మారడం విడ్డూరంగా ఉంది. పక్కాగా ఓటరు కార్డును తయారు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఎన్నికల సంఘం ఉంది. సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందివుంటే ..దానిని గుర్తించి ఏరివేయాలి. ఓటరు జాబితాలోచనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయంటే అందుకు ఎన్నికల సంఘం సక్రమ నిర్వహా లోపమే కారణం. సరైన టెక్నాలజీని వాడడం లేదు. ఎన్నో ఐటి కంపెనీలు ఉన్నాయి. వారికి అప్పగిస్తే ఎలా ఓటు నమోదు చేయాలో, దానికి ఎలా పర్మినెంట్ నంబర్ ఉండాలో చెబుతారు. బిఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు. ఇలాంటి తలనొప్పలను అధికారులు గుర్తించడం లేదు. అది ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం.

### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

### ఎపిలో సర్ ప్రక్రియ గడువు పొడిగింపు

పలు ప్రాంతాల్లో ఓటర్లకు ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందక పోవడం, కొన్ని చోట్ల ఓటర్లు ఫారాలు పూర్తి చేసి సిద్ధంగా ఉంచినా, బూత్ లెవెల్ అధికారులు వాటిని తిరిగి సేకరించడంలో ఆలస్యం చేయడం, ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసే (డిజిటలైజేషన్) ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడం, ఈ సాంకేతిక, పరిపాలనాపరమైన ఇబ్బందుల వల్ల అర్హులైన అనేకమంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే స్పందించి ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. పార్టీలు విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ఈసీ, ఓటర్ల నమోదు, సవరణలు సజావుగా సాగేందుకు వీలుగా మరో పది రోజుల పాటు సమయాన్నీ పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, ఓటర్లు జులై 24వ తేదీ లోపు తమ వివరాల సవరణలు, కొత్త నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

### మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూత

1953 జనవరి 22న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ జన్మించారు. 1978లో తొలిసారిగా పత్తిపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం 1983, 1985లో తెలుగుదేశం పార్టీ తరఫున విజయం సాధించి, ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో కూడా మంత్రిగా పనిచేశారు. మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి కాకినాడ లోక్‌సభ సభ్యుడిగా (1999) ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవలందించారు. తన సుదీర్ఘ ప్రస్థానంలో తెలుగుదేశం పార్టీ , కాంగ్రెస్, మరియు భారతీయ జనతా పార్టీలలో క్రియాశీలకంగా పనిచేశారు. 2014 తర్వాత కొంతకాలం తటస్థంగా ఉండి, 2024 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై ఎదురుచూపులకు తెర..

2028 జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన సందర్భంగా ఈ హామీ ఇచ్చారు.సమావేశంలో రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 253 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించిందని చెప్పారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తన హయాంలో తెలంగాణకు ఎయిర్‌పోర్టులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపైనా కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం 1,500 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు వెల్లడించారు. రక్షణ శాఖకు కూడా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అవసరమని తెలిపారు. దేశవ్యాప్తంగా మరో 100 కొత్త విమానాశ్రయాలను నిర్మించే లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధికి



కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడి సహకారం మరువలేనిదని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కూడా భాగస్వామి కావాలని కోరుకుంటోందని తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ ఐదు శాతం వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

## బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలు

రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని. . సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.


**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం :** క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'ఇరాన్ సైన్యం ఖతం..

ప్రముఖ అంతర్జాతీయ ఛానల్ 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కూడా "90 శాతం ప్రాణాలు కోల్పోయినట్లే" అని పేర్కొనడం అంతర్జాతీయంగా పెను సంచలనం రేపుతోంది.

**వారి వద్ద ఏమీ మిగల్లేదు :** ఇరాన్ సైనిక పరిస్థితిపై ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. "ఇప్పుడు ఇరాన్ వద్ద నావికాదళం లేదు, వైమానిక దళం లేదు.. అంతా శూన్యం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ నిఘా వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వారి అగ్రనాయకులు, అత్యంత ప్రతిభావంతులైన కమాండర్లు అందరూ హతమయ్యారు" అని ట్రంప్ వివరించారు. ఈ క్రమంలో ఆయన 1989లో మరణించిన ఇరాన్ విప్లవ నేత ఖొమేనీ పేరును ప్రస్తావించినప్పటికీ.. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరు దేశాల (అమెరికా, ఇజ్రాయెల్) దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశించే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. అలాగే, తండ్రి మరణించిన అదే దాడుల్లో తీవ్రంగా గాయపడి, గత వారం జరిగిన అంత్యక్రియలకు కూడా హాజరుకాని ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ 90 శాతం మరణ శయ్యపై ఉన్నారంటూ ట్రంప్ సంచలన విషయాలు బయటపెట్టారు.

**వందల ఏళ్ల అమెరికా పాలసీకి బ్రేక్! :** కొన్ని నెలల తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత, గత వారం నుండి అమెరికా తిరిగి ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఈ మిలిటరీ యాక్షన్‌పై ట్రంప్ అధికారికంగా యూఎస్ కాంగ్రెస్‌కు కూడా నోటిఫికేషన్ పంపారు. అయితే, ఇదే సమయంలో అంతర్జాతీయ నౌకల రాకపోకల విషయంలో వందల సంవత్సరాలుగా వస్తున్న అమెరికా స్వేచ్ఛా నౌకాయాన విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు. హర్మూజ్ జలసంధి గుండా



ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ ఇకపై అమెరికా సురక్షిత ప్రయాణ రుసుము వసూలు చేస్తుందని స్పష్టం చేశారు.

**రగిలిపోతున్న గల్ఫ్ దేశాలు :** అమెరికా చర్యలను ఇరాన్ కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తోంది. బహ్రెయిన్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన రెండు చమురు రవాణా నౌకలపై ఇరాన్ క్షిపణి దాడులు చేయడంతో, ఒక భారతీయ పౌరుడు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఘటనతో అబుదాబి, దుబాయ్ వంటి సంపన్న నగరాలు కలిగిన యూఏఈ సైతం ఇరాన్‌పై ప్రతీకార చర్యలకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచ ముడిచమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు అమెరికా-ఇరాన్ పట్టుబడుతుండటంతో పశ్చిమాసియా ఇప్పుడు ఒక పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా మారింది.

### పశ్చిమాసియా ఉద్రిక్తతలతో షేర్ మార్కెట్లు డీలా

గత ట్రేడింగ్ సెషన్‌లో 77,616 వద్ద ముగిసిన సెన్సెక్స్ మంగళవారం ప్రారంభంలోనే దాదాపు 400 పాయింట్లు కోల్పోయింది.
అనంతరం కొంత కోలుకున్నప్పటికీ ఉదయం 9.30 గంటల సమయానికి 329 పాయింట్ల నష్టంతో 77,287 వద్ద కొనసాగింది. నిఫ్టీ కూడా 71 పాయింట్లు తగ్గి 24,139 వద్ద ట్రేడవుతోంది. బయోకాన్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎంసీఎక్స్ ఇండియా, నాల్కో, ఆస్ట్రాల్ ఇండియా షేర్లు స్వల్ప లాభాల్లో ఉండగా.. ఎల్ అండ్ టీ ఫైనాన్స్, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, అశోక్ లేలాండ్, లోధా డెవలపర్స్, చోళా ఇన్వెస్ట్‌మెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. బ్యాంక్ నిఫ్టీ 429 పాయింట్లు, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 186 పాయింట్లు నష్టంతో కొనసాగుతున్నాయి.

### జగన్ హయాంలో 275 మంది మత్స్యకారులు మృతి చెందారు

ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుందని, ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి మత్స్యకారుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జగన్ చేసే చౌకబారు వ్యాఖ్యలను ప్రజలు నమ్మరని అన్నారు.

### ఏపీలో రెండో విడత జాబ్ క్యాలెండర్..

ముఖ్యంగా కొత్త లోకల్ క్యాడర్ విధానానికి అనుగుణంగా పోస్టుల కేటాయింపు, రిజర్వేషన్ రోస్టర్ ఖరారు, ఖాళీల వివరాలను ఏపీపీఎస్సీతో పాటు ఇతర నియామక ఏజెన్సీలకు వెంటనే పంపడం వంటి ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రెండో విడత జాబ్ క్యాలెండర్ నోటిఫికేషన్లు జారీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండో విడతలో భాగంగా సుమారు 3,168 పోస్టులను భర్తీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి తొలుత 3,979 పోస్టులతో క్యాలెండర్ విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతానికి 3,168 పోస్టులకు పరిమితం చేసినట్లు తెలుస్తోంది. వీటిలో అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 91 గ్రూప్-1 పోస్టులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ నియామకాలపై త్వరలోనే అధికారికంగా పూర్తి స్పష్టత రానుంది. ఈ ఏడాది మార్చిలో ఉగాది కానుకగా మంత్రి నారా లోకేశ్ 10,060 పోస్టులతో తొలి విడత జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ క్యాలెండర్‌లోని యూనివర్సిటీ పోస్టులకు ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన పోస్టులకు కూడా షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. ఇకపై ప్రతీ ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది.
ఈ నేపథ్యంలో రెండో విడత క్యాలెండర్‌పై ప్రభుత్వం దృష్టి సారించడం నిరుద్యోగుల్లో కొత్త ఆశలు రేపుతోంది. ఇదే సమావేశంలో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల విషయంలో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ చర్యల కేసులను ఆరు నెలల్లో పరిష్కరించాలని కూడా సీఎస్ అధికారులకు సూచించారు.

## డెంగ్యూ నియంత్రణ కు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

### –ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

జగ్గయ్యపేట, ప్రజాభూమి

డెంగ్యూ నియంత్రణలో ప్రతి ఒక్కరు బాధ్యత వ్యవహరించాలని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగో పాల్ సూచించారు.డెంగ్యూ వ్యతిరేక మాసో త్సవాల సందర్భంగా మంగళవారం జగ్గయ్య పేట పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు._ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాత య్య) , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘ వేంద్ర , మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు హాజర య్యారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో నిర్వహించిన డెంగ్యూ అవగాహన ర్యాలీలో పాల్గొన్న అతిథులు ప్రజలు, ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి డెంగ్యూ నివారణ పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ సంద ర్భంగా నేతలు మాట్లా డుతూ, డెంగ్యూ వ్యాధికి కారణమయ్యే దోమలు నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో అధికంగా వృద్ధి చెందుతాయని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు._ప్రతి శుక్రవారం "ఫ్రైడే – డ్రైడే" కార్య క్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ పాత్రలు, కూలర్లు, ట్యాం కులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటి ప్రదేశా లను తరచూ పరిశీలించి శుభ్రం చేయా లని తెలిపారు. ఇంటిం టా లార్వా (హాచ్‌రీలు) తనిఖీ లు నిర్వ హించి ప్రజలకు పరిశుభ్రత, దోమల నివారణపై అవగా హన కల్పించాలని ఆరోగ్య శాఖ సిబ్బం దికి సూచించారు.ఈ కార్యక్ర మంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, సూర్యదేవర రాంప్రసాద్, పేరం సైదేశ్వ రరావు,దువ్వల రామకృష్ణ,మిట్టగూడెం పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శైల , కొల్లా కాంప్లెక్స్ వైద్యాధి కారి డాక్టర్ రాహుల్ , స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ , జగ్గయ్యపేట సబ్ యూనిట్ అధికారి ఎం. శ్రీనివాసరావు , బూచవరం హెల్త్ సూపర్వైజర్ బి. వెంకటరావు , జానకి , హెల్త్ అసిస్టెంట్లు రమేష్, బ్రహ్మ, ఏఎన్ ఎంలు, ఆశా కార్య కర్తలు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందస్తు ప్రణాళికతో చదివితేనే విజయాలు సాధ్యం



### –జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో, ముందస్తు ప్రణాళికతో చదివితేనే ఆశించిన విజయాలు సాధించగలరని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఉద్బోధిం చారు. మంగళ వారం ఉదయం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం నగరంలోని చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాల, రుస్తుంబాద పార్క్ నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాల, అలాగే పెడన మండలంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పాఠశా లల్లో విద్యా బోధన, ఉత్తీర్ణత శాతం, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతు లు, పాఠశాలల్లో ఉన్న సమస్యలపై ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీ యంగా మాట్లాడిన కలెక్టర్ వారి దినచర్య, ఉదయం ఎంత సమయంలో నిద్రలేస్తున్నారు, రోజువారీ చదువుకు ఎంత సమయం కేటాయి స్తున్నారు, ఏ విధంగా పరీక్షలకు సిద్ధమవుతు న్నారు, చదివిన పాఠాలను ఎలా పునశ్చరణ చేసుకుంటున్నారు వంటి అంశాలపై ఆరా తీశారు.చదివిన పాఠాలను ఎప్పటికప్పుడు ఒకటి లేదా రెండుసార్లు పునశ్చరణ చేసుకుంటే అవి మెదడులో ఎక్కువకాలం నిలిచిపోతాయని తెలిపారు. తాను కూడా విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక అధ్యాయాన్ని వరుసగా రెండు, మూడు సార్లు పూర్తిగా చదివిన తర్వాతే తదుపరి అధ్యాయానికి వెళ్లేవాడినని పేర్కొన్నారు. ఈ విధానం విద్యార్థులకు మంచి ఫలితాలను అందిస్తుందని సూచించారు.రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని చివరి సమయంలో కాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబ ద్ధంగా చదువు ప్రారంభించాలని సూచించారు. అదనపు తరగతులను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాం క్షించారు.



విద్యార్థులను యోగా సాధన గురించి అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువులో ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. యోగా తరగతుల్లో ప్రాణాయామం వంటి వ్యాయామాలను క్రమం తప్పకుండా అభ్యసిం చాలని సూచించారు.అనంతరం చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాల, పెడన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆర్టిజం (Autism) ప్రత్యేక శిక్షణ కేంద్రాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న (భవిత) పిల్లలకు నాణ్యమైన శిక్షణ, సౌకర్యాలు అందించేలా నిర్మాణ పనులు ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.ఈ తనిఖీల సంద ర్భంగా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ వేణుగోపాల్, రీజినల్ ఇంజినీర్ ప్రసాద్ తదితరులు జిల్లా కలెక్టర్‌కు నిర్మాణ పనుల వివరాలను వివరించారు.కలెక్టర్ వెంట మచిలీపట్నం డివిజన్ డిప్యూటీ డిఈఓ శేఖర్ సింగ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## మానవసేవే మాధవసేవ

## విజయవంతంగా 2వ వసంతంలోకి అడుగుపెడుతున్న “స్ఫూర్తి ఫౌండేషన్”

### ఒక్క ఏడాదిలోనే 119 సేవా కార్యక్రమాలతో సరికొత్త రికార్డు

### బుధవారం మచిలీపట్నంలో ఘనంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

### పాల్గొననున్న పలువురు ప్రముఖులు, అధికారులు, వైద్య నిపుణులు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మీ చేతుల్లో సేవ – మన హృదయాల్లో సేవ అనే ఉన్నతమైన ఆశయంతో, నిరుపేదలకు అండగా నిలుస్తూ అప్రతిహతంగా సేవాలందిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ స్ఫూర్తి ఫౌండేషన్ ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకుని, నేడు గర్వంగా రెండవ వసంతంలోకి అడుగుపె డుతోంది.స్థాపించిన స్వల్ప కాలంలోనే ఫౌండేష న్ సభ్యులు మరియు దాతల అయాచిత సహకా రంతో రికార్డు స్థాయిలో 119 సేవా కార్యక్రమా లను పూర్తి చేయడం విశేషం. ఈ అద్భుతమైన మైలురాయిని పురస్కరించుకుని సంస్థ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ మొదటి వార్షికోత్సవ ఆహ్వాన శుభపత్రికను నిర్వాహకులు విడుదల చేశారు.ఘనంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు – కార్యక్రమ వివరాలు: మచిలీపట్నంలోని భాస్కరపురంలో ఉన్న ప్రము ఖ క్యాంపస్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సభకు నగరంలోని ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు మరియు వైద్య నిపుణులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేయనున్నారు.తేదీ:




15.07.2026 (బుధవారం)సమయం: సాయం త్రం 6:30 గంటలకువేదిక: ది ఎవిలిన్... హోమ్ ఫర్ గర్ల్స్ హాస్టల్ (SHARKEY HOSTEL) క్యాంపస్, భాస్కరపురం, మచిలీపట్నం.హాజరు కానున్న ముఖ్య అతిథులు (Chief Guests):ఈ వార్షికోత్సవ సభలో మచిలీపట్నానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించను న్నారుడా. తోట ప్రేమ్ కుమార్ (ప్రముఖ గుండె వైద్య నిపుణులు, మచిలీపట్నం)డా. జి. భాను మూర్తి (కంటి వైద్య నిపుణులు, RMO గవర్న మెంట్ హాస్పిటల్, మచిలీపట్నం)లంకిశెట్టి బాలాజీ (ప్రముఖ న్యాయవాది, మచిలీపట్నం) పి. శ్రీరామ్ (Msc.ED ప్రముఖ విద్యావేత్త, స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్, మచిలీపట్నం)వేమూరి ఈశ్వర్ సుహాస్ (V.V.S. సంస్థల అధినేత, మచిలీపట్నం) ASN రాధిక (తహసిల్దార్/అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్, కలెక్టరేట్, కృష్ణాజిల్లా, మచిలీపట్నం)షేక్ అబ్దుల్ నబీ (సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మచిలీపట్నం)అందరికీ హృదయ పూర్వక ఆహ్వానం:ఈ పుణ్య కార్యక్రమానికి స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు, దాతలు మరియు శ్రేయోభిలాషులందరికీ మా హృదయపూర్వక ఆహ్వానం. సమాజ సేవలో భాగస్వాములవుతూ నిర్వహిస్తున్న ఈ వేడుకకు అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని అన్నారు.

## వియత్నాం బోటు ప్రమాద బాధితురాలు జయలక్ష్మి పార్థివదేహం మచిలీపట్నం రాక





### మృతదేహానికి నివాళులర్పించిన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డి.కె. బాలాజీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేర్ని కిట్టు

### ప్రభుత్వ సహకారంతోనే త్వరగా స్వగ్రామానికి చేరిన మృతదేహం .. కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

ప్రజాభూమి బ్యూరో కృష్ణ జిల్లా

వియత్నాం దేశంలో జరిగిన ఘోర బోటు ప్రమాదంలో మృతి చెందిన మచిలీపట్నానికి చెందిన గెల్లి జయలక్ష్మి పార్థివదేహం ఎట్టకేలకు స్వగ్రామానికి చేరుకుంది. మంగళవారం ఉద యం ఆమె భౌతికకాయం మచిలీపట్నం చేరుకో వడంతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. జయలక్ష్మి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.ప్రముఖుల నివాళు లు.. అండగా ఉంటామని భరోసాజయలక్ష్మి భౌతికకాయానికి రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కిట్టు (కృష్ణమూర్తి) మరియు పలువురు పట్టణ ప్రముఖులు విడివిడిగా సంద ర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ: "జయల క్ష్మి మృతి చెందడం అత్యంత బాధాకరం. విదేశాల్లో ఉన్న మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో, దౌత్య విభాగాల సహాయంతో అత్యంత వేగంగా మచిలీపట్నం తీసుకురాగలిగాం. బాధిత కుటుంబానికి ప్రభు త్వం అన్ని విధాలా అండగా ఉంటుంది," అని హామీ ఇచ్చారు.కలె క్టర్ డి.కె. బాలాజీ మాట్లా డుతూ: జిల్లా యంత్రాంగం తరపున కుటుంబ సభ్యులను పరామ ర్శించి, వారికి అందా ల్సిన ప్రభుత్వ పరమైన సాయం త్వరగా అందేలా చూస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేర్ని కిట్టు మాట్లాడుతూ: కుటుంబానికి ఇదొక తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరు కుంటూ, తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. శోకసంద్రంలో బంధుమిత్రులుసంతో షంగా విహారయాత్రకు వెళ్లి, ఇలా శవమై తిరిగిరావడాన్ని జయలక్ష్మి కుటుంబ సభ్యులు, స్థానికులు జీర్ణించుకోలేకపో తున్నారు. మృతదేహం స్వగృహానికి చేరుకున్న ప్పటి నుండి పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంతిమ సంస్కారాలు స్థానికంగా ముగిశాయి.





## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జోడుగుడుల ఆలయంలో ప్రత్యేక పూజలు

### ఆగమ శాస్త్రోక్తంగా కాలభైరవునికి అభిషేకం.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న జనసైనికులు, నేతలు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పరిపూర్ణ ఆరోగ్యంతో, శీఘ్రంగా కోలుకోవాలని కాంక్షిస్తూ మచిలీపట్నంలోని ఈడేపల్లి ప్రసిద్ధ జోడుగుడుల దేవస్థానంలో ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డం రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నా రు. శాస్త్రోక్తంగా కాలభైరవునికి మహా అభిషేకంహైందవ సంస్కృతి, సనాతన ధర్మ ఆగమ శాస్త్రాల ప్రకారం ఆలయ వేద పండితులు పవన్ కళ్యాణ్ నామగోత్రాలతో ప్రత్యేక అర్చనలు చేశారు.గోత్రం: జనకుల గోత్రంరాశి: మకర రాశినక్షత్రం: ఉత్తరాషాడ నక్షత్రంవేద మంత్రోచ్ఛారణల నడుమ, సుగంధ పరిమళ ద్రవ్యాలతో జనసేన శ్రేణుల చేత కాలభైరవ స్వామికి శాస్త్రోక్తంగా మహా అభిషేకం చేయించారు. పవన్ కళ్యాణ్ సుదీర్ఘ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షిస్తూ పండితులు ఆశీర్వచనాలు పలికారు.మార్మోగిన ‘కాలభైరవాష్టకం’అభి షేకం అనంతరం జనసేన నాయకులు, కార్యకర్తలు, భక్తులతో కలిసి ఏకకంఠంతో కాలభైరవాష్ట కాన్ని పఠించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తిభావంతో మారుమ్రోగింది. పూజా కార్యక్ర మాల అనంతరం భక్తులకు, జనసైనికులకు వేద పండి తులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. దాతల సహకారంతో ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.ఈ కార్యక్రమ పర్యవేక్షణను జోడుగుడుల ఆలయ చైర్మన్ దేవనూరి వీరబాబు, డైరెక్టర్ తోట పవన్ దగ్గరుండి చూసు కున్నారు. ఈ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమంలో పలువురు కీలక నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు:గంపల భవాని (జగన్నాథ స్వామి దేవాలయ చైర్మన్)కూనపురెడ్డి ప్రసాద్ (జనసేన పార్టీ యూత్ ప్రెసిడెంట్) పినిశెట్టి వేణు, తోట రాజేష్, ఉచ చంటి (జనసేన నాయకులు)జన్ను నాగరాజు, తిరుమలశెట్టి నాగరాజు, జొన్నల ప్రసాద్‌మంత్రి పృథ్వీ, గంపల కృష్ణ, నరహరశెట్టి సాయివీరితో పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు, పెద్ద సంఖ్యలో భక్తులు, జనసేన శ్రేణులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## పేదరికం నుండి విముక్తికి విద్య ఒక్కటే సాధనం

### జి. కిషోర్ కుమార్

### మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

### నవీన్ మెట్ల కాలనీలో ఘనంగా జరిగిన కార్యక్రమం



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

పేదరికం అనే చీకటిని తరిమికొట్టి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్య ఒక్కటే అత్యుత్తమ మైన సాధనమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ జి. కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైనప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.మచిలీపట్నంలోని నవీన్ మెట్ల కాలనీలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యా ర్థులకు ఉచిత నోటు పుస్తకాలు, బాక్సులు, పెన్నులు, మరియు వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది.కార్యక్రమ విశేషాలు:అధ్యక్షత: ఈ కార్యక్రమానికి మానవతా సంస్థ అధ్యక్షుడు బి. అయ్యప్ప స్వామి అధ్యక్షత వహించారు.వ్యక్తిత్వ వికాస సదస్సు: విద్యార్థులలో ఆత్మవి శ్వాసాన్ని నింపేలా సంస్థ కో-కన్వీనర్ ముదిగొండ శాస్త్రి వ్యక్తిత్వ వికాసం (Personality Development) పై ప్రత్యేక ప్రసంగం చేశారు.కార్మికుల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కార్మికులు నివసించే ఈ కాలనీలో... తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపైన, వారి భవిష్య త్తుపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని వక్తలు కోరారు.పాల్గొన్న ప్రముఖులు: ఈ సేవా కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు శరశ్చంద్రతో పాటు పలువురు సంస్థ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు."కంప్యూటర్ యుగంలో చదువే నిజమైన ఆస్తి. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న తల్లిదండ్రుల కలలను నిజం చేసేలా విద్యార్థులు కష్టపడి చదవాలి."అని జి. కిషోర్ కుమార్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అన్నారు.

## మచిలీపట్నం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో మహాధర్నా

### ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఇన్చార్జి డిఆర్ఓ పి పోతురాజు కు వినతిపత్రం



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (FAPTO) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన 11వ పీఆర్సీ కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వెంటనే 12వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి (IR) ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే నూతన పెన్షన్ విధానం (NPS)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (OPS)ను పునరుద్ధరించాలని, ఉపాధ్యా యులకు టెట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ తదితర అదనపు విధుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు. పాఠశాలల విలీనాలను పునఃసమీక్షించి ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అదేవిధంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ స్యలను పరిష్కరించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈహెచ్‌ఎస్ సేవలను మెరుగుపరచాలని, ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించాలని కోరుతూ జిల్లా యంత్రాంగానికి వినతిపత్రం సమర్పించారు.ధర్నాలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ ఎస్. చిరంజీవి, కో–చైర్మన్ కే. నరహరి, చిట్టేటి రమేష్, చందోలు వెంకటేశ్వర్లు, కే. ప్రకాశ్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్. వెంకటేశ్వర్లు, కే. బసవలింగరావు, గుత్తా శ్రీనివాసరావు, కోశాధికారి చింతల సుబ్బారావు, కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, డి. మధుసూదన్‌రావు, ఎం. ప్రవీణ్ కిరణ్‌తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాభూమి
ఏలూరు, పశ్చిమగోదావరి 4
బుధవారం 15 జూలై 2026

## వన సంరక్షణ సమితుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**-సీపీఐ, బీకేఎంయూ**



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని వన సంరక్షణ సమితుల (వీఎస్ఎస్) అభివృద్ధికి అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా నాయకులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు డీఎఫ్ఓను కోరారు. మంగళవారం డీఎఫ్ఓను కలిసి పాత చింతలపూడి, కొమ్ముగూడెం, కమలాపురం, రేచర్ల వీఎస్ఎస్‌ల సమస్యలను వివరించారు.కొత్త సభ్యుల చేర్పు, మొక్కల పెంపకం, బంజరు భూముల కేటాయింపు, కటింగ్ చేసిన జామాయిల్ బకాయిల చెల్లింపు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు.వీఎస్ఎస్‌ల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, కటింగ్ బకాయిలను ఆగస్టు చివరి నాటికి చెల్లించేలా చర్యలు చేపడతామని డీఎఫ్ఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఇస్తరాకుల వెంకటేశ్వరరావు, బొక్క లక్ష్మణ్ పాల్గొన్నారు.

## నాణ్యమైన సాగుతో అధిక దిగుబడులు

**పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన**




**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అడవినెక్కలం, కనసానపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జె. భవాని రైతులకు నారుమడుల నిర్వహణ, సస్యరక్షణ చర్యలు, నూతన సాగు విధానాలపై అవగాహన కల్పించారు. వరి, మినుము సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని సూచిస్తూ, వరికి ఆగస్టు 15లోపు, మినుముకు జూలై 31లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారిణి జ్యోతి ప్రియాంక, గ్రామ ఉద్యాన సహాయకులు షేక్ మున్నిసా జయలక్ష్మి మరియు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## చలో భీమవరం కోసం వైసీపీ శ్రేణులు సమయత్తం



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వైసీపీ శ్రేణులు చలో భీమవరం కోసం మంగళవారం సమయతమయ్యారు. ఈ నెల 15వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆక్వా రైతులకు అండగా ఉండడానికి, జరిగే పర్యటన విజయవంతం చేయడానికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం విచ్చేస్తున్నందున పాలకొల్లు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో భీమవరం తరలి వెళ్లాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో గుడాల గోపి,ఎడ్ల తాతాజీ, గున్నం నాగబాబు,మేక శేషుబాబు, నడపన గోవిందరాజుల నాయుడు, సిహెచ్ ఆనంద ప్రకాష్, కోరాడ శ్రీనివాస్, కర్ర జై చరిత, మద్దా చంద్రకళ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## జాతీయ వాటర్ పోలో పోటీల్లో శ్రీ ఆదిత్య విద్యార్థి ప్రతిభ

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**




చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జూలై 7 నుంచి 12 వరకు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ సీనియర్ నేషనల్ వాటర్ పోలో ఛాంపియన్‌షిప్-2026లో శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల (ఏలూరు-అగ్రహారం) ద్వితీయ సంవత్సరం బీఎస్సీ (ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్) విద్యార్థి ఎస్.కె.హకీల్ పాల్గొని ప్రతిభ కనబరిచారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో కలిసి జాతీయ స్థాయిలో పోటీపడడం ద్వారా కళాశాలకు గుర్తింపు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.చంద్రరావు,వైస్ ప్రిన్సిపల్ వి.సుభాష్ రావు, అధ్యాపకులు,విద్యార్థులు హకీల్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ,అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల కట్టుబడి ఉందని యాజమాన్యం పేర్కొంది.

## చనిపోయిన పేషంట్ బిల్లులను ఏపీలోనూ రద్దు చేయాలి

**-తమిళనాడు సీఎం విజయ్ ఉత్తర్వుల అమలు కోసం డిమాండ్**

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



తమిళనాడు రాష్ట్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులు చికిత్స పొందుతూ మృతి చెందిన పక్షంలో ఆ రోగుల తాలూకు కుటుంబాలు అప్పటివరకు అయిన ఎలాంటి బిల్లులు చెల్లించనక్కర్లేదని ఆ రాష్ట్ర సీఎం విజయ్ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం. అదే ఉత్తర్వులు ఏపీ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా వైరల్ అవుతుంది. ఈ మేరకు ప్రజలు కూడా స్పందిస్తూ మంచి నిర్ణయం తీసుకున్నారని ఆ నిర్ణయం ఏపీలో కూడా తక్షణమే అమలు చేయాలని కామెంట్లు కూడా పెడుతున్నారు. దీనికోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, లోకేష్ మంత్రివర్గం అందరూ కూడా చర్యలు తీసుకోవాలని ప్రజల కోరు తున్నారు. చనిపోయిన వారికి కూడా ట్రీట్మెంట్ చేసి అక్రమంగా బిల్లులు వసూలు చేసే వారికి ఈ రకమైన ఉత్తర్వులు చెక్ పెడతాయని ఈ ఉత్తర్వులు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని కోరుతున్నారు.

## నకిం కుటుంబాన్ని పరామర్శించిన బొరగం

- మోత్కూరి నరసింహారావు కుటుంబానికి సీఎం రిలీఫ్ చెక్కు అందజేత.
- మండల తెలుగుదేశం ఆధ్వర్యంలో నకిమ్ కుటుంబానికి 50వేల ఆర్థిక సహాయం.



**ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు**

ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన ఐ టీడీపీ మండల కోఆర్డినేటర్ ఎస్.కె నకిం కుటుంబ సభ్యులను మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పరామర్శించారు. అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమని ఈ నష్టం ఎవరూ పూడ్చలేనిదని, ప్రభుత్వపరంగా ఆదుకునే ప్రయత్నం చేస్తానన్నారు.

**బాధితుని కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేత.**

వేలేరుపాడు గ్రామానికి చెందిన మోతుకూరి నరసింహారావు అనే వ్యక్తికి ప్రభుత్వం నుంచి మంజూరైన70000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు మంగళవారం బోరగం అందజేశారు.

**నాకీమ్ కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం..**

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన ఐటీడీపీ కోఆర్డినేటర్ ఎస్ కె నకిం కుటుంబానికి మండల తెలుగుదేశం ఆధ్వర్యంలో 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కట్టం రాంబాబు, కొమ్మన వెంకటేశ్వరరావు, కోటిపల్లి ముత్యాలరావు, కరటూరి రాధాకృష్ణ, అమరవరపు వెంకన్న, గోపు పెంటరావు బేతి శ్రీను, తాళ్లపూడి హరిబాబు, కుక్కునూరు సత్యనారాయణ, ఎస్ కే సలీం తదితరులంతా ఉన్నారు.

## పాలకొల్లులో ఘనంగా చేనేత జెండా ఆవిష్కరణ

**చేనేత వస్త్రాలు ప్రదర్శన, భారీ బైక్ ర్యాలీ**



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లో సోమవారం స్థానిక వీవర్స్ కాలనీలోని వట్టంకోటి మల్లికార్జునరావు-సుందరమ్మ వీవర్స్ కమ్యూనిటీ హాల్ నందు జరిగిన చేనేత కులాల సమైక్య సమావేశం సంఘ అధ్యక్షులు వట్టం గణేష్ అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వీవర్స్ కమ్యూనిటీ హాల్ నందు చేనేత జండా ఆవిష్కరణ, చేనేత వస్త్రాలు ప్రదర్శన అమ్మకం. మరియు 500 మందితో చేనేత జండాలతో పూలపల్లి వై జంక్షన్ నుండి టౌన్ లో భారీ బైక్ ర్యాలీ, తదుపరి లాకులు వద్ద చేనేత ముద్దుబిడ్డ దివంగత జాన నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం, తదుపరి కమ్యూనిటీ హాల్ వద్ద భారీ బహిరంగ సభ జరుగునని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర జల వనరుల శాఖ మాత్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు మరియు రాష్ట్ర చేనేత నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఈ కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నామని గోడ పత్రికను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నీలంశెట్టి సత్యప్రసాద్, ట్రెజరర్ బాసిన సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, శాగా రాంబాబు,యర్రా శివాజీ, ఏలూరి శ్రీనివాసరావు, బాసిన గున్నేశ్వరరావు, కుడకా సోమేశ్వరరావు, బొండపల్లి చంద్రశేఖర్,కుర్మా గణేష్, సూదా కాంతారావు, మానెం గణేష్ మాస్టారు, వంగల శ్రీనివాసరావు, సిద్ధాన్ని మల్లేశ్వర అప్పారావు,శలా సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత కోసం అనేక చట్టాలు అమలులో ఉన్నాయి



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

భారతదేశంలో మహిళల భద్రత, సమానత్వం, సాధికారత కోసం రాజ్యాంగ హక్కులతో పాటు అనేక ప్రధాన చట్టాలు అమలులో ఉన్నాయనీ, వాటిని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఎస్ఐ సాదిక్ అన్నారు. స్థానిక కేజీబీవీ స్కూల్ రేఖపల్లి నందు మహిళా చట్టాలు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఉండే విద్యా అవకాశాల గురించి ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ నాగుల్ మీర రేఖపల్లి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ నీలోఫర్, ఎస్ఐ సాదిక్ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నీలోఫర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణం వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం. కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు.

## ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణం పనులు తక్షణం ప్రారంభించాలి

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మాణం ఆపిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు తక్షణం ప్రారంభించాలని సిపిఎం పశ్చిమ గోదావరి జిల్లాకమిటీ సభ్యులు ఏ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారంనాడు వైద్యకళాశాల నిర్మాణ ప్రదేశాన్ని సిపిఎం బృందం పర్యటించింది అసంపూర్తిగా ఆగిపోయిన పనులుచూసి ఆవేదన వ్యక్తం చేశారు ఫలితంగా పశ్చిమగోదావరి జిల్లావాసుల వైద్య కళాశాల ఆశలు అడియాసలయ్యాయన్నారు నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజానీకానికి మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందుతాయని ప్రజలంతా ఆశించారని రవి గుర్తుచేశారు నిధులు లేవనే సాకుతో ప్రైవేటీకరణ చేయాలనుకుని ఈమెడికల్ కళాశాల నిర్మాణాన్ని ఆపేయడం కూటమి ప్రభుత్వవైఖరినీ ఆయన ఖండించారు ఈ ప్రభుత్వహయాంలో పనులు మొత్తం పనులు స్తంభించిపోయాయన్నారు ఇందువల్ల ప్రజాధనం దుర్వినియోగం అయిపోతుందని ప్రజల సొమ్మును ఇలా దుర్వినియోగపరిచే హక్కు కూటమీ ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు 60 ఎకరాల్లో భూములు కొనుగోలు చేసి పునాదిస్థాయిలోనే పనులు నిర్మాణం అయ్యాయని వాటిని ఆపేయడం రాజకీయ దురుద్దేశంతో కూడినదిగా ప్రజలు భావిస్తున్నారన్నారు మరోపక్క రాష్ట్రానికి నిధులుకొరత ఉందని



చెబుతూనే ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు వందల కోట్ల రాయితీలు ఎట్లా ఇవ్వగలుగుతున్నారని ప్రశ్నించారు? కూటమినేతలు చేసుకునే ఆర్భాటపు ప్రచారాన్ని కొద్దిమేరకు ఆపిన ఆ మొత్తం డబ్బుతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయొచ్చన్నారు నిర్మాణం ఆగిపోవడంతో పరిసరాల్లో ఉన్న ఇసుక కంకర ఐరన్ ట్రాన్స్ఫార్మర్ ఆఖరికి అక్కడ వేసిన తాత్కాలిక షెడ్లకు సంబంధించిన రేకులతో సహా రక్షణ లేకుండా పోయాయని అన్నారు ఇందువల్ల ప్రజల ధనం దుర్వినియోగం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణం కూటమి ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రానున్న కాలంలో ప్రజలను సమీకరించి ఉద్యమం సాగిసామని హెచ్చరించారు ఈపర్యటనలో సిపిఎం మండల కన్వీనర్ బాతిరెడ్డి జార్జి మండల కమిటీ సభ్యులు తిరుమాని శ్రీనివాస్ సభ్యులు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ - 2026 సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ.**

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) -2026, కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ కోరారు. మంగళవారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026పై సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు అడిగిన ప్రశ్నలకు, సందేహాలకు జిల్లా జాయింటు కలెక్టరు నివృత్తి చేశారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వేని విజయవంతంగా నిర్వహించారన్నారు. ఏలూరు జిల్లాలో ప్రత్యేక విస్తృత పునశ్చ-2026 సంతృప్తికరంగా జరిగి, మొదటి స్థానంలో నిలిచామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో 16,44,193 మంది ఓటర్లను పర్యవేక్షించేందుకు 1,744 మంది బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ వో లు) ఉన్నారని అన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో



గణన పత్రాలపంపిణీ 100% పూర్తయిందని, మొత్తం 15,54,463 గణన పత్రాలు డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. దీనితో మొత్తం 94.54% డిజిటలైజేషన్ సాధించబడిది అని అన్నారు. నియోజకవర్గాలు వారీగా (ఈ ఎఫ్ ) డిజిటలీకరణ ఈ క్రింది విధంగా ఉందని తెలిపారు. నం. 63 దెందులూరు: 95.64%, నం. 64 ఉంగుటూరు: 95.36%, నం. 65 ఏలూరు: 95.18%, నం. 70 నూజివీడు: 95.00%, నం. 67 పోలవరం: 93.87% నం. 68 చింతలపూడి : 93.70%, నం. 73 కైకలూరు: 93.22% పూర్తి చేశామని తెలిపారు.ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి యల్.దేవకీదేవి, పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వి.వి.యస్.శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు పి.వి.వి.యస్. ప్రసాదు టిడిపి, నెరుసు నెలరాజ బిజెపి, ఏ.రతన్ కాంత్ బిఎస్పీ, ఆర్.లింగరాజు, కె.శ్రీనివాసు సిపిఐ(యం), ఎల్.వి.సుభాష్, వి.స్టాన్లీ బాబు, వైఎస్ఆర్సిపి, ఆర్.రామమోహన రావు ఐయన్ సి, తదితర ప్రతినిధులు, జిల్లా కలెక్టరేటు సూపరింటెంట్లు పాల్గొన్నారు.

## ఎం.ఎం.ఈ బ్రాంచ్ విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం

**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

ఆర్జీయుకేటి, నూజివీడులోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ (ఎం.ఎం.ఈ) విభాగంలో ఐఐటీ రూర్కీ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. సాయి రాముడు ఎం. విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యత గురించి వివరించి, దేశ అభివృద్ధి, ఆధునిక సాంకేతికతలు మరియు ఇంధన భద్రతలో వాటి పాత్రను వివరించారు. అనంతరం మెటీరియల్స్ క్యారెక్టరైజేషన్ అంశంపై మాట్లాడుతూ, ముఖ్యంగా ఎక్స్-రే డిఫ్రాక్షన్ (క్సర్డ్ ) సాంకేతికత ద్వారా పదార్థాల నిర్మాణం, లక్షణాలు, దశలను ఎలా గుర్తిస్తారో సులభంగా వివరించారు. అలాగే గ్రామీణ నేపథ్యం నుంచి ఐఐటీ రూర్కీ ప్రొఫెసర్‌గా ఎదిగిన తన జీవిత ప్రయాణాన్ని పంచుకుని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. ఉన్నత విద్య, పరిశోధన అవకాశాల గురించి తెలియజేస్తూ, మెటీరియల్స్ సైన్స్‌లో పరిశోధన చేయాలని విద్యార్థులనుప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విభాగాధిపతి ఎ.వి. వీర శ్రీను, డా. బి. వెంకటేశ్వర్లు మరియు ఎంఎంఈ విభాగ అధ్యాపకులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు విలువైన జ్ఞానం, మార్గదర్శనం అందించిన డా. సాయి రాముడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి మరియు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య మద్దారి లక్ష్మీనారాయణ రావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



## మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుని మర్యాదపూర్వక కలిసిన డా. ఘంటా ప్రసాద్ రావు



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జోనల్ కోఆర్డినేటర్ ,మాజీ మంత్రి,చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుని మర్యాదపూర్వకంగా కలిసిన డా. ఘంటా ప్రసాద రావు. ప్రత్తిపాటి పుల్లా రావుని వారి క్యాంపు కార్యాలయంలో ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు డా. ఘంటా ప్రసాద రావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతం, అలాగే ప్రజా సమస్యలు, జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారు పరస్పరం చర్చించారు. జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు తదితర అంశాల గురించి ప్రస్తావించడం జరిగింది డా. ఘంటా ప్రసాద రావు వివరించారు.

# సాగునీటి సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

## జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

కాలువల్లో పూడిక తొలగించి దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించాలని రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ హెచ్చరించారు.మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి పంపిణీకి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన, ఉప కాలువల్లో నీటి ప్రవాహం, నీటి ఒత్తిడి, దిగువ ప్రాంతాలకు సాగునీటి సరఫరా పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి తగ్గడం, లోతట్టు ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరకపోవడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.కాలువల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా నీటి ప్రవాహం కొనసాగేందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, పొలాలకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా కాలువల నిర్వహణను మెరుగుపరచాలని తెలిపా



రు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.దిగువ ప్రాంత రైతులకు కూడా సమానంగా సాగునీరు అందేలా నీటి పంపిణీ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని, రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో కాలువల్లో పూడిక పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే జిల్లాలో నూతనంగా నిర్మించిన వంతెనల వద్ద పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు వ్యవసాయ, నీటిపారుదల, జాతీయ రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గోదావరి డెల్టా దిగువ ప్రాంతాలైన కె. గంగవరం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు పలువురు వినతులు అందజేశారని కలెక్టర్ తెలిపారు. ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన కుర్రపు డెక్కలు, తూములు తదితర అవరోధాలను తొలగిస్తే నీటి ప్రవాహం వేగవంతమై లోతట్టు ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ఏఈలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాలకు మహర్దశ

### పైడిమెట్ట ఎత్తిపోతల అభివృద్ధికి భారీ నిధులు
### త్వరలో పనులు ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని తాళ్లపూడి మండలంలోని ఎత్తిపోతల పథకాలకు కూటమి ప్రభుత్వ హయాంలో కొత్త ఊపిరి లభించనుంది. రైతులకు సాగునీరు సక్రమంగా అందించేందుకు అవసరమైన కాలువలు, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పైపులైన్ల ఆధునికీకరణ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపినట్లు పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.సోమవారం పోలవరం ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా ముఖ్యమంత్రిని ఎత్తిపోతల సంఘం ప్రతినిధులు కలిసి సమస్యలను వివరించగా, వెంటనే నీటిపారుదల శాఖ అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.అనంతరం ఐడీసీ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, ఐడీసీ ఎండీ తిరుమలరావు, ఐడీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు పైడిమెట్ట ఎత్తిపోతల ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి ద్వారా పథకం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.ఎత్తిపోతల పథకం పరిధిలో కాలువల అభివృద్ధి, మోటార్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, పైపులైన్ల ఆధునికీకరణ వంటి పనులకు భారీ మొత్తంలో నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. పూర్తి బడ్జెట్ వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. నిధులు మంజూరు విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు చాలా ఆనందంగా ఉన్నారని అధ్యక్షులు రామచంద్ర తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఈ గురవయ్య, ఏఈ సురేంద్ర, గన్నిన సత్తిబాబు, కాకర్ల శ్రీను, గూటాల, కుమారదేవం ఎత్తిపోతల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## గౌరవ వేతనాలు బకాయిల విడుదల కోరుతూ ఎంపీటీసీ సభ్యుల ఆందోళన

### పరిష్కారం లేకుంటే ప్రత్యక్ష పోరాటానికి హెచ్చరిక.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

మండల పరిషత్ ప్రాదేశిక కౌన్సిల్ (ఎంపీటీసీ) సభ్యులకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆలమూరు మండల ఎంపీటీసీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. మంగళవారం ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీ సభ్యుల సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. గౌరవ వేతనాలు సంవత్సరాలుగా విడుదల కాకపోవడం పట్ల సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం తగదన్నారు. ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి సుమారు రూ.1.06 లక్షల మేర గౌరవ వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. మండలంలోని 22 మంది ఎంపీటీసీ సభ్యులకు కలిపి సుమారు రూ.23 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ న్యాయబద్ధమైన డిమాండ్‌ను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఎ. రాజుకు అందజేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు వాసంశెట్టి దుర్గాభవాని, నేలపూడి రత్నకుమారి, నెక్కంటి ప్రమీలతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### మట్టి, ఇసుక అక్రమాలకు

## కేరాఫ్ చిర్ల - అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు: టీడీపీ

- జగన్ మెప్పుకోసమే చంద్రబాబు గారిపై దుర్భాషలు.
- అభివృద్ధి కోసం బండారు చేస్తున్న కృషిని చూసి ఓర్వలేకే ఆరోపణలు.
- అభివృద్ధికి బండారు చిరునామా.. అవినీతికి చిరునామా చిర్ల.




ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.

కొత్తపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేస్తున్న విమర్శలు నిరాధారమని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి కోసం జరుగుతున్న కృషిని ప్రజలు ఆదరిస్తుండటాన్ని ఓర్వలేకే అసత్య ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి చిర్ల జగ్గిరెడ్డి చెప్పుకోదగ్గ కృషి చేయలేదని ఆరోపించారు. మట్టి, ఇసుక అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన వారు ఇప్పుడు అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చిరునామాగా నిలిస్తే, అవినీతికి చిర్ల జగ్గిరెడ్డి చిరునామాగా మారారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు. జగన్ మెప్పు పొందాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రిపై దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. వ్యక్తిగత విమర్శలు, కించపరిచే వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. చిర్ల జగ్గిరెడ్డి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు గతంలోనూ చేశారని, అందుకే వరుసగా అవకాశాలు వచ్చినా భారీ ప్రజాభిమానం పొందలేకపోయారని పేర్కొన్నారు. చివరకు ప్రజలు ఆయన నిజ స్వరూపాన్ని గుర్తించి భారీ మెజారిటీతో ఓడించి గుణపాఠం చెప్పారని అన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు, చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజా ప్రయోజనాల కోసం నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని టీడీపీ నాయకులు సూచించారు.

## బూరుగువాడ బీట్‌లో డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీడ్ బాల్స్ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం చింతూరు అటవీ డివిజన్ పరిధిలోని వి.ఆర్.పురం రేంజ్, బూరుగువాడ సెక్షన్‌లోని బూరుగువాడ బీట్‌లో డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా డి. రవీంద్రనాథ్ రెడ్డి ఐఎఫ్ఎస్, డివిజనల్ అటవీ శాఖాధికారి, చింతూరు, కె. రాఘవరావు, ఎస్ ఎఫ్ ఎస్, సబ్-డివిజినల్ అటవీ శాఖాధికారి, కూనవరం, ఎస్. రామకృష్ణ, అటవీ క్షేత్రాధికారి, వి.ఆర్.పురం పాల్గొని డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. బూరుగువాడ బీట్‌లో 18,000 సీడ్ బాల్స్ మరియు దారపల్లి బీట్‌లో 18,000 సీడ్ బాల్స్, మొత్తం 36,000 సీడ్ బాల్స్ డ్రోన్ ద్వారా



వెదజల్లారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించి చేరుకోలేని కొండ ప్రాంతాల్లో సీడ్ బాల్స్‌ను వెదజల్లడం ద్వారా, సహజ వృక్ష సంపదను పెంపొందించడం, పచ్చదనాన్ని విస్తరించడం, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని, స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వివిధ జాతుల విత్తనాలతో, తయారు చేసిన సీడ్ బాల్స్‌ను విస్తృత స్థాయిలో వెదజల్లడం ద్వారా, భవిష్యత్తులో అటవీ విస్తీర్ణం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం రేంజ్‌కు చెందిన ఎమ్.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, జీడిగుప్ప సెక్షన్, ఎమ్.రాధ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, బూరుగువాడ సెక్షన్, ఆర్. హరీష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, బూరుగువాడ బీట్, పి.భాస్కర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ , దారపల్లి బీట్, బేస్ క్యాంప్ హెల్పర్లు పాల్గొన్నారు.

## సూరయ్యపేటలో సారా తయారీ స్థావరంపై పోలీసుల దాడి

### - 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి


తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట గ్రామపంచాయతీ పరిధిలోని సూరయ్యపేట గ్రామ శివారులో అక్రమంగా సారా తయారీ జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమా చారం మేరకు తాళ్లపూడి పోలీసులు దాడి నిర్వహించారు.తాళ్లపూడి ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సూరయ్యపేట గ్రామ శివారులోని కాలువ కింది భాగంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టగా, అక్కడ సారా తయారీ కోసం సిద్ధం చేసిన సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటతో పాటు సారా తయారీకి ఉపయోగిస్తున్న సామగ్రి గుర్తించారు. వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.అక్రమ సారా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసా గుతాయని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని పోలీసులు హెచ్చరించారు.

# మద్యం ఫుల్- త్రాగునీరు నిల్...!

- మంత్రి సుభాష్ ఇలాకాలో కాజులూరు మండల ప్రజలు త్రాగునీరు అందక గగ్గోలు.
- చేపలు పట్టే నెపంతో ఎండగట్టిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్.
- నిర్వీర్యం మౌతోన్న రక్షిత మంచినీటి పథకం.
- ప్రత్యేక అధికారుల పాలనపై ప్రజలు అసహనం.
- కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులకు 9 నెలలుగా జీతాలు లేవు.
- త్రాగునీరుని అధిక ధరలు వసూలు చేస్తూ సొమ్ములు చేసుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు.
- జలజీవన్ పనులతో స్తంభించిన త్రాగునీరు సరఫరా.
- త్రాగునీరు సరఫరా పై అధికారుల స్పందన కరువు.

ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో మద్యం ఏరులై పారుతూ మద్యం ప్రియులకు ఏకొరత లేకపోగా మండల పరిధిలోని ప్రజలు తాగటానికి గుక్కెడు నీళ్లు లేక గగ్గోలు పెడుతున్న పరిస్థితి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇలాకాలో స్పష్టంగా కనిపిస్తోంది.దీంతో ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదంటూ ఆయా గ్రామాల ప్రజలు త్రాగునీరు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అప్పటి ప్రభుత్వంలో నాటి నేతలు దూరదృష్టితో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న సంకల్పంతో (సిపిడబ్ల్యూఎస్ స్కీం) కోట్లాది రూపాయలతో గొల్లపాలెంలో బారీ రక్షిత మంచినీటి పథకం పూర్తి చేసి కరప, కాజులూరు మండలాల పరిధిలో 21 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేవారు. నాటి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ స్కీన్ ద్వారా కొన్నాళ్లపాటు ఆయా గ్రామాలకు సక్రమంగా త్రాగునీరు అందేది అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్త బాధ్యతతో ఈ ఏ స్కీన్ ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేవారు.రానురాను గొల్లపాలెం కేంద్రంగా ఉన్న సిపిడబ్ల్యూఎస్ స్కీము ప్రస్తుతం చేపల పెంపకం కేంద్రంగా మారిందా? అనే అనుమానాలు ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కాలువలకు నీరు వదిలి నెలరోజులు పైబడినప్పటికి త్రాగునీరు కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నింపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఇక్కడ ఈ స్టోరేజ్ ట్యాంకులో గత సంవత్సరం క్రితం అజ్ఞాత వ్యక్తులు రాత్రి వేళల్లో అనధికారికంగా చేపల వదిలి వేయడం వాటిని గుట్టు చప్పుడు కాకుండా పెంచడం జరుగుతోందని ఎవరికీ తెలియకుండా చేపలకు మేత వేస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. కొద్ది రోజులుగా రక్షిత నీటి పథకం ద్వారా రంగు మారిన నీరుని శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారని తాగునీటి నాణ్యతపై ప్రజల్లో ఆందోళన నెలకొని బాహాటంగానే చెప్పారు. ఆనీటి ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేసినప్పటికీ సంబంధిత శాఖ అధికారుల్లో మాత్రం స్పందన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రక్షిత నీటి పథకంలో గల స్టోరేజ్




టేంక్లో సహజసిద్ధంగా పెరిగిన చేపలు కారణంగా సమస్య ఉందనీ అధికారులు చెబుతూ ఆచేపలు పట్టేందుకు బహిరంగ వేలం పేరుతో జిల్లా పరిషత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు .దీంతో అధికారులు చేపలు పట్టేందుకు అదికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. గత శుక్రవారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయం నందు బహిరంగ వేలం ద్వారా పాట పాడేందుకు ఎనిమిది మంది డిపాజిట్లు చెల్లించి సాల్వెన్సీ సర్టిఫికెట్లు అందజేశారు. అయితే వేలం నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఫిర్యాదు అందిదంటూ వేలాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో డిపాజిట్ చెల్లించిన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం అసంతృప్తి వ్యక్తంచేసి ప్రజా ఫిర్యాదుల వేదికలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో అధికార, రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ప్రచారం స్థానికంగా ప్రచారం సాగుతోంది. ఈ ఆరోపణలపై



సంబంధిత అధికారులు ఇప్పటివరకు అధికారికంగా ఏవిధమైన ప్రకటన చేయలేదు. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా గొల్లపాలెం గ్రామానికి ప్రత్యేక అధికారిగా కాజులూరు ఎంపీడీవో జె. రాంబాబు వ్యవహరిస్తున్న తరుణంలో వాస్తవ పరిస్థితులపై ఆయన సైతం ఈ చేపల చెరువుపై తనకు ఏ విధమైన అధికారం లేదంటూ జిల్లా పరిషత్ అధికారులదే తుది నిర్ణయం అంటూ పేర్కొన్నారు.దీంతో సంబంధించిన అధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే రక్షిత నీటి పథకంలో చేపల పెంపకం, చేపల వేలం వంటి అంశాల కంటే ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఇక్కడ పనిచేసేవారికి 9 నెలలుగా జీతాలు లేవు.**

గొల్లపాలెంలో గల సీపీడబ్ల్యూఎస్ స్కీములో కాంట్రాక్ట్ బేసిక్ పై పనిచేస్తున్న సుమారు పదిమందికి 9 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక భారంతో ఆయా కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాయి. దీంతో వీరు గత్యంతరం లేక అప్పులుచేస్తూ వడ్డీలు కడుతూ మరింతగా ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి నెలకొందని ఇక్కడ కాంట్రాక్ట్ బేసిక్ పై పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఇప్పటికైనా వీరి దీనస్థితి అర్థం చేసుకుని సంబంధిత ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ నుండి వీరికి రావలసిన బకాయిలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

**అధిక ధరలు వసూలు చేస్తూ సొమ్ములు చేసుకుంటున్న ప్రైవేట్ వ్యాపారస్తులు.**

ఇదిలా ఉండగా ఇదే అదునుగా మండల పరిధిలో పలుచోట్ల ప్రైవేటు వ్యక్తులు త్రాగునీరు ప్లాంట్లు ఏర్పాటు చేసి నచ్చిన రేట్లును ప్రకటించుకుని ప్రజల అవసరాన్ని గుర్తించి వీరు సొమ్ములు చేసుకుంటున్నారు. ఇలా విచ్చలవిడిగా రేట్లు పెంచుకుంటున్నా ప్రజలు సైతం తప్పని పరిస్థితుల్లో చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే గొల్లపాలెంలో ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా ఉన్న ప్లాంట్ ద్వారా కూడా అధిక రేట్లు వసూలు చేస్తూ ప్రజల్ని దోచుకుంటున్న పరిస్థితి ఇటీవల వెలుగు చూసింది. అధికారులు చెప్పినప్పటికీ అదేవిధంగా తీరు మారలేదని ప్రజలు వాపోతున్నారు. అయితే ఇక్కడ ప్లాంట్ ను గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకుని ఇప్పుడున్న పరిస్థితుల్లో పంచాయతీ ద్వారా అమ్మకాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**జలజీవన్ పనులతో స్తంభించింది త్రాగునీరు సరఫరా.**

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన పథకం ద్వారా మండల పరిధిలో ఇబ్బడి ముప్పడిగా పనులు ప్రారంభించి ఎక్కడ కక్కడ అసంపూర్తిగా వదిలి వేయడంతో ఆయా చోట్ల అస్తవ్యస్తంగా తయారై మండలానికి ప్రధానమైన గొల్లపాలెం రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా మరింత అధ్వానా స్థితికి చేరుకుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అలాగే ఇక్కడ సిపిడబ్ల్యూఎస్ స్కీం వద్ద ఫిల్టర్ బెడ్లు సక్రమంగా లేకపోవడంతో నీరు సక్రంగా ఫిల్టర్ కాకపోవడం ప్రజలకు సరైన శుద్ధి చేసిన త్రాగునీరు అందించలేక పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ప్రజారోగ్యంలో ప్రధానమైన త్రాగునీరుకి అధికారులు, నేతలు స్పందించి ఇప్పటికైనా ఈ గొల్లపాలెం సిపిడబ్ల్యూ స్కీముని ఒక ఉన్నతమైన స్థితికి తీసుకువచ్చి అన్ని విధాల శుద్ధి చేసిన త్రాగరుని ఆయా గ్రామాల ప్రజలకు అందించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాషుని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
బుధవారం 15 జూలై 2026

## జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం సుజలాన్ అసోసియేట్స్ వారు రూ. 2 లక్షల సిఎస్ఆర్ విరాళాన్ని అందించడం అభినందనీయం

### -: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ – 2026 కోసం సిఎస్ఆర్ కింద సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు 2 లక్షల రూపాయల విరాళాన్ని అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ – 2026 కోసం సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు రూ. 2 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్ ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ ప్రతినిధులు, డిఎస్డీఓ మంజుల అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ – 2026 కోసం సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు 2 లక్షల రూపాయల విరాళం అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా డిఎస్డీఓ మంజుల మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం సిఎస్ఆర్ కింద సుజలాన్ అసోసియేట్స్ కంపెనీ వారు 2 లక్షల రూపాయల విరాళాన్ని అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## 16, 17వ తేదీలలో జిల్లాకు ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మిరెడ్డి జిల్లాకు రాక: జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



ఈనెల 16,17వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఇ.లక్ష్మిరెడ్డి అనంతపురం జిల్లాలో పర్యటించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మిరెడ్డి జిల్లాలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, ఎఫ్ పి షాప్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మరియు బాలింతలకు, గర్భవతులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా తదితర అంశాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని వసతి గృహాల సంక్షేమ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుల కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

## సంకల్పం బలంతో చెడు వ్యసనాలు దూరం

**-యువతకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పిలుపు**

**-బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, ప్రచార కార్యక్రమం**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



సంకల్పం బలంగా ఉండి జీవిత లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరిస్తే చెడు వ్యసనాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలు, మద్యం, పొగాకు వంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో యువత మేలుకో.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండు అనే నినాదంతో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో యువత వివిధ రకాల వ్యసనాలకు బానిసలవుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యసనాలు కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, ఆత్మనిగ్రహం, విలువలు పెంపొందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి రహమత్‌పురం సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్, బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొని ప్రజలకు వ్యసనాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ర్యాలీ మార్గమంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నినాదాలు చేశారు. రహమత్‌పురం సర్కిల్‌లో జరిగిన సభలో కమిషనర్ మాట్లాడుతూ, యువత తమ సమయాన్ని విద్య, ఉపాధి, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచి మంచి మార్గంలో నడిపించాలని కోరారు. సమాజంలో వ్యసన నిర్మూలన కోసం ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అవగాహన కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, సర్కిళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో తిరుగుతూ చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నుంచి దూరంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేసే వీడియో సందేశాలను ప్రదర్శించింది. ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఈ ప్రచార కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలలో యన్.యస్.పి.ఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ, విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గత ఏప్రిల్ లో సికింద్రాబాద్ లో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డు పోటీలలో ఎన్.ఎస్.పి.ఆర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశులు పేర్కొన్నారు. విజేతలకు కరాటే సంస్థ పంపిన సర్టిఫికెట్లను మంగళవారం పంపిణీ చేశారు. యన్.సి.సి విభాగం నుండి బిఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న సీఎం ఐశ్వర్య, ద్వితీయ సంవత్సరం చదువుతున్న నిఖిత , ఎన్ఎస్ఎస్ విభాగం నుండి బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెన్నెల అద్భుత ప్రదర్శన కనపరిచి నిర్వాహకుల నుండి ప్రశంసలందుకున్నారన్నారు. దాదాపు 1212 మంది విద్యార్థులు పాల్గొన్న అతిపెద్ద కరాటే ప్రదర్శనలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల మాజీ ప్రిన్సిపల్ డా. యం.ప్రగతి, ఐ క్యుఎసి కోఆర్డినేటర్ డా.శ్రీ లక్ష్మి, అధ్యాపకులు సరస్వతి, భోజప్ప, ప్రకాష్ రావ్, యశోదా రాణి, రవి నాయక్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు అభినందించారు.



## మూడవ శనివారం "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహణ..

### - : జులై నెల "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర" థీమ్ తో కార్యక్రమం నిర్వహించాలి డిపిఓ నాగరాజునాయుడు..

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'' కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డిపిఓ నాగరాజు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జులై నెల "వరదలు - సిద్ధంగా ఉన్న ఆంధ్ర" థీమ్ తో కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. చేపట్టవలసిన కార్యక్రమాలు గ్రామసభ, ప్రతిజ్ఞ, ర్యాలీ మానవహారం. రుతుపవనాలకు ముందు వర్షపునీటి కాలువలు, నాలాలు, కాలువలలో పూడికతీత శుభ్రపరచడం. వరద ముప్పు ఉన్న చెత్తాచెదారం పేరుకుపోయే ప్రదేశాలను గుర్తించి, తొలగించడం. ఘన వ్యర్థాలు ప్రవేశించకుండా నిరోధించడానికి కీలకమైన డ్రెయిన్ ప్రవేశ ద్వారాల వద్ద తెరలు/గ్రేట్లను ఏర్పాటు చేయడం. డ్రైన్లు మరియు నీటి ప్రవాహాలలో వ్యర్థాలను పారవేయడాన్ని నివారించడానికి సామూహిక ప్రచారాలు. వార్డు/గ్రామ-స్థాయి రుతుపవనాల సన్నద్ధత తనిఖీలు నివేదించడం. ''డ్రైన్లలో వ్యర్థాలను పారవేయవద్దు" మరియు వరద భద్రతా పద్ధతులపై ఐఈసి ప్రచారాలు పౌరులు, వార్డు/గ్రామ వాలంటీర్లు, ఆర్ డబ్ల్యు ఎలు, యువజన బృందాలు, ఎస్హెచ్‌ఐలు, పారిశుధ్య కార్మికులు, యుఎల్బిలు/జిపిలు, ఎంపిడ యుడి, పిఆర్డి ఆర్డి, నీటిపారుదల శాఖ, రెవెన్యూ డ విపత్తు నిర్వహణ శాఖ, ఆరోగ్య శాఖ, ఎన్జిఓలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, మీడియా వారు మూడవ శనివారం నిర్వహించే "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'' కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమం



చేపట్టడం వల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వరద సంఘటనలు తగ్గడం, ఘన వ్యర్థాల వల్ల మురుగు కాలువలు మూసుకుపోకుండా నివారించడం, వర్షాకాల సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గడం, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం మరియు విపత్తుల పట్ల సంసిద్ధత మెరుగుపడటం, వరద నివారణలో సమాజ భాగస్వామ్యం పెరగడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎస్ఏఎస్ఏ వెబ్సైటులో ఫోటోలు, వీడియోలు, రీల్స్ మరియు విజయగాథలను డాక్యుమెంటేషన్ రూపంలో సమర్పించాలన్నారు. ఎస్ఏఎస్ఏ యాప్ లో ఏఏ యాక్టివిటీలను చేపట్టారు, క్యాటగిరీ వారిగా ఎంతమంది ఇందులో పాల్గొన్నారు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, సంస్థలకు, అధికారులకు, మీడియాకు ముందుగానే సమాచారం అందించాలని, ఇందులో చేపట్టే పనులన్నీ వారి జీవన విధానంలో భాగం అయ్యేలా అవగాహన కల్పించి, ఒక పండుగ వాతావరణంలో "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించి, విజయవంతం చేయాలని డిపిఓ కోరారు.

## నాన్నా... ఒక్కసారి లేచి మాట్లాడండి..

### -మృతదేహంపై పడి కుమార్తెల ఆర్తనాదం -వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన రవితేజకు కన్నీటి వీడ్కోలు

ప్రజాభూమి,హిందూపురం టౌన్





నాన్నా... మమ్మల్ని వదిలేసి ఎలా వెళ్లిపోయావ్....ఒక్కసారి కళ్లు తెరచి మాతో మాట్లాడండి నాన్నా...అంటూ ఇద్దరు చిన్నారులు శవపేటికపై పడి గుండెలవిసేలా విలపించిన దృశ్యాలు అక్కడున్న ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించాయి. కన్నీటి కళ్లతో తండ్రి ముఖాన్ని తడుముతూ, ఆయన లేస్తారేమో అన్న ఆశతో చిన్నారులు చేసిన ప్రయత్నాలు చూసినవారంతా భావోద్వేగానికి లోనయ్యారు. భార్య భర్తను కౌగిలించుకుని స్పృహ తప్పేలా రోదిస్తుండగా... వృద్ధ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించారు. విదేశీ విహారయాత్రకు ఆనందంగా వెళ్లిన యువకుడు... నాలుగు రోజులకే శవపేటికలో తిరిగి రావడంతో హిందూపురం పట్టణం శోకసంద్రంగా మారింది. వియత్నాంలో జరిగిన ఘోర బోటు ప్రమాదంలో మృతి చెందిన హిందూపురం పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన నల్లపేట రవితేజ మృత దేహం మంగళవారం ఆయన స్వగృహానికి చేరుకుంది. అంబులెన్స్ ఇంటి ముందు ఆగగానే భార్య, ఇద్దరు కుమార్తెలు, తల్లిదండ్రులు, సోదరులు, బంధువులు ఒక్కసారిగా బోరున విలపించారు. ఇంటి ఆవరణ అంతా కన్నీటి ప్రవాహంగా మారిపోయింది. కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు వచ్చిన వారే మాటలు రాక నిశ్శబ్దంగా కన్నీళ్లు తుడుచుకున్నారు. లావా మొబైల్ కంపెనీలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్న రవితేజ, కంపెనీ నిర్వహించిన విదేశీ విహారయాత్రలో భాగంగా వియత్నాం వెళ్లారు. నాలుగు రోజుల క్రితం సముద్రంలో బోటులో ప్రయాణిస్తుండగా ప్రతికూల వాతావరణం కారణంగా పడవ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోగా, రవితేజ కూడా సముద్రంలో మునిగి మృతి చెందారు. ప్రమాద వార్త అందిన నాటి నుంచి కుటుంబ సభ్యులు ఆశతో ఎదురు చూసినా... చివరకు శవపేటికలో పార్థివదేహం ఇంటికి చేరుకోవడంతో వారి దుఃఖానికి అవధులు లేకుండా పోయాయి. మృత దేహాన్ని స్వదేశానికి తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. భారత రాయబార కార్యాలయం వియత్నాం అధికారులతో సమన్వయం చేసి ప్రత్యేక విమానంలో ముంబైకి తరలించింది. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకువచ్చి, అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో హిందూపురానికి తరలించారు. రెవెన్యూ శాఖ అధికారి రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పార్థివదేహాన్ని వారికి అప్పగించారు. మధ్యాహ్నం మృతదేహం ఇంటికి చేరుకున్న వెంటనే ఇద్దరు చిన్నారులు తండ్రి శవపేటికపై పడి గుండెలవిసేలా రోదించారు. నాన్నా... మమ్మల్ని ఎందుకు వదిలేసి వెళ్లిపోయావ్... అంటూ ఏడుస్తూ చేసిన ఆర్తనాదాలు అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించాయి. భార్యాభర్త ముఖాన్ని తడుముకుంటూ స్పృహ తప్పిపోగా, వృద్ధ తల్లిదండ్రులు మా కొడుకే... అంటూ గుండెలు బాదుకుంటూ విలపించారు. ఆ దృశ్యాలు చూసి అక్కడున్న ప్రజలు, బంధువులు, స్నేహితులు సైతం కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. రవితేజకు తుది వీడ్కోలు పలికేందుకు హిందూపురం పట్టణ ప్రజలు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నవ్వుతూ విదేశాలకు వెళ్లిన యువకుడు... నిశ్శబ్దంగా శవపేటికలో తిరిగి రావడం విధి ఎంత క్రూరమో చెప్పింది అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. చివరి దర్శనాల అనంతరం సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజల సమక్షంలో రవితేజ అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతితో టీచర్స్ కాలనీ మాత్రమే కాదు... హిందూపురం పట్టణమంతా విషాదంలో మునిగిపోయింది.

**రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన లావా కంపెనీ**

రవితేజ పనిచేస్తున్న లావా మొబైల్ కంపెనీ ప్రతినిధులు హిందూపురానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంపెనీ తరఫున కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని కంపెనీ ప్రతినిధి సౌరభ్ రఘువంశీ ప్రకటించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నవ్వుతూ వెళ్లాడు... నిశ్శబ్దంగా తిరిగొచ్చాడు... విదేశీ విహారయాత్రకు ఉత్సాహంగా వెళ్లిన యువకుడు... భార్య, ఇద్దరు చిన్నారులతో సంతోషంగా గడపాల్సిన జీవితాన్ని మధ్యలోనే ముగించుకుని శవపేటికలో తిరిగి రావడం హిందూపురాన్ని విషాదంలో ముంచెత్తింది. తండ్రి కోసం అమాయకంగా ఎదురుచూసిన చిన్నారులకు చివరకు కనిపించింది మాత్రం నిశ్చలమైన పార్థివదేహమే. ఆ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని బరువెక్కించింది. ఇది ఒక ప్రమాదం మాత్రమే కాదు... ఒక కుటుంబం జీవితాన్ని ఒక్క క్షణంలో తలకిందులు చేసిన విషాద గాథ.

## కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలే మార్గం

- కనీస వేతనాల అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం
- కార్మిక చట్టాల నిర్వీర్యంతో శ్రమ దోపిడీ పెరిగింది
- జూలై 30, 31 ధర్నాలను ఐక్యంగా కలిసి విజయవంతం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబుల్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని, కార్మికుల రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలను బలహీనపరచడం వల్ల శ్రమ దోపిడీ మరింత పెరిగిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబుల్ విమర్శించారు. కార్మికుల హక్కులు, ఉపాధి భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని, ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెరుగుతున్న ధరల ప్రభావం, కనీస వేతనాల అమలు, కార్మిక చట్టాల పరిరక్షణ వంటి అంశాలపై మంగళవారం హిందూపురంలోని చౌడేశ్వరి కాలనీ సమీపంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడీ హిందూపురం ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ అధ్యక్షతన కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. ఓబుల్ మాట్లాడుతూ, గత పదిహేనేళ్లుగా కనీస వేతనాల చట్టం ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాల్సి ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం కూడా కనీస వేతనాల బోర్డు కమిటీని నియమించలేదని ఆరోపించారు. దీని కారణంగా కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన వేతనాలు అందడం లేదని, పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుంటే ప్రస్తుతం ప్రతి కార్మికుడికి నెలకు కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే అసంఘటిత రంగాలతో పాటు అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు అత్యల్ప వేతనాలతోనే కుటుంబాలను పోషించాల్సిన దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక ఉద్యమాలు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను బలహీన పరిచిందని ఆయన విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకొస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత, పని గంటలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలు, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, కార్మిక చట్టాల నిర్వీర్యం వంటి సమస్యలపై కార్మిక వర్గం సంఘటిత శక్తిని ప్రదర్శించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలను అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల హక్కుల సాధనకు ఐక్యతే బలమని, ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సత్యసాయి జిల్లా సీఐటీయూ అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి వి.ఆర్. రాము, ఆర్ఎల్ఎఫ్‌సీ మెడిసిన్ ఫ్యాక్టరీ కార్యదర్శి చంద్ర, అంగన్వాడీ హిందూపురం ప్రాజెక్టు కార్యదర్శి శోభమ్మ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజి, గురు, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకురాలు రంగమ్మ, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు నరసింహమూర్తి, కార్యదర్శి మురళి, క్లాప్ ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు మారుతి, అనిల్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ ల పంపిణీ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం నియోజకవర్గంలోని 330 అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, సిడిపిఓ సుధా వరలక్ష్మి లు స్టవ్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆధునిక వంట సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన కార్యక్రమం హిందూపురం అభివృద్ధికి మరో మైలురాయిగా నిలిచిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇబ్బందులకు గురి కాకూడదన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్టవ్ లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెంకటేష్ , రూరల్ మండల అధ్యక్షులు హెచ్.ఎం. రాము, లేపాక్షి మండల అధ్యక్షులు అభిలాష్, మండల అధ్యక్షులు ఎగివేంటి శ్రీనివాసులు, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు తలుపుల భార్గవ్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శి దుర్గా నవీన్, అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి వెంకటలక్ష్మి , తెలుగుదేశం పార్టీ నాయకులు, సూపర్ వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రెండు రోజులు పాటు విజయవాడలో జరిగిన సాహితీ సమ్మేళనంలో పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వివిధ సామాజిక అంశాలపై స్వీయ కవితలను వినిపించి అద్భుత ప్రతిభ కనబరిచి సభికులు, నిర్వాహకుల నుండి ప్రశంసలందుకున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశులు తెలిపారు. యం.బీ. విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహించిన ఈ సమ్మేళనానికి రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 400 మంది యువ కవులు, రచయితలు, సాహితీ మేధావులు పాల్గొనగా , తమ కళాశాల నుండి నలుగురు యన్.యస్.యస్ వాలంటీర్స్ పాల్గొని అద్భుత ప్రసంగం చేయడం అభినందనీయమన్నారు . కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీ.కాం చదువుతున్న దేవిక, ఫిర్దోజ్, సురేఖ, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుచున్న గౌతమి లు ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా గుర్తింపు తెచ్చుకొని, సాహితీ సమ్మేళనశీలో పాల్గొనడం గర్వకారణమన్నారు. విజేతలను కళాశాల మాజీ ప్రిన్సిపల్ డా. యం.ప్రగతి, ఐ క్యుఏసి కోఆర్డినేటర్ డా. శ్రీలక్ష్మి, అధ్యాపకులు యల్. ఆర్. రమేష్, నాగమణి , సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ రంగనాయకులు అభినందించారు.



ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

బుధవారం 15 జూలై 2026

# ఇరుగు పొరుగు భూముల సర్వే నెంబర్లు వేసేయ్ - ప్రభుత్వభూమిని కాజేసేయ్

- పులివెందులలో భూ భకాసురులు ప్రభుత్వ భూముల అక్రమ విక్రయాలు
- ప్రభుత్వ భూములకు రక్షణ లేదా?





ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలో భూ ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వ భూములపై కన్నేసిన భూ బకాసురులు పులివెందులలో రెచ్చిపోతున్నారు. ప్రభుత్వానికి చెందిన భూమిని అక్రమంగా కాజేసి, అమ్మకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. దీనికి తోడు ఈ మధ్యకాలంలో పులివెందులలో భూ సమస్యలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. భూమి తమదని కొందరు, తమదని మరికొందరు అని చివరకు ఘర్షణలకు పాల్పడుతున్న సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. మృతి చెందిన వారితో కూడా రిజిస్ట్రర్లు చేయించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. భూమిని కాపాడుకునేందుకు బాధితులు అధికారులు, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా బాధితులకు న్యాయం జరగడం లేదని, డబ్బు, బలం , పలుకుబడి ఉన్నవారికి న్యాయం జరుగుతుందని బాధితులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో కొందరు భూ బకాసురులు ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు వేసేయ్ పాగా అమ్మేయ్ జాగా అని ప్రభుత్వ భూమిని విక్రయించి కోట్లు కొల్లగొడుతున్నారు. గతంలో దాదాపు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో వందల ఎకరాల స్కాం బయటపడడంతో అప్పటి సర్వేయర్, వీఆర్వో, తాసిల్దార్ పై కూడా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అప్పట్లోనే రంగనాథ స్వామి ఆలయ సమీపంలో నీటి కాలువలు కూడా ఆక్రమించుకొని ప్లాట్లు వేసి గృహాలు నిర్మించి కోట్ల రూపాయలు దండుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే భూ ఆక్రమణలు ఓ కొల్లలుగా జరిగాయి. పులివెందులలో ప్రభుత్వ భూమి కనుమరుగైపోయింది. పులివెందులలో గతంలో ప్రభుత్వ భూమి ఎన్ని ఎకరాలు, ఇప్పుడు ప్రభుత్వం భూమి ఎన్ని ఎకరాలు ఉందో అని రికార్డులను పరిశీలిస్తే అర్థమవుతుంది. ప్రభుత్వ భూమి ఆక్రమణకు కావడానికి రెవెన్యూ అధికారులు, రిజిస్టర్ కార్యాలయ అధికారులు పాత్ర పై చాలామందికి అనుమానాలు ఉన్నాయి. భూ బకాసురులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నప్పుడు అధికారులు చర్యలు చేపడితే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకోవచ్చు. ప్రభుత్వ భూముల బాధ్యత వహించాల్సిన కాపాడాల్సిన అదికారులు మౌనం వహించడంతో ఈ అక్రమాలు మరింత పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**వేసేయ్ పాగా.. అమ్మేయ్ జాగా**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ప్రభుత్వ స్థలాలను కొందరు ప్రభావితులు ఆక్రమించి, పట్టాలు లేకుండానే విక్రయాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసేయ్ పాగా.. అమ్మేయ్ జాగా అన్నట్లుగా అక్రమ లావాదేవీలు సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుడు పల్లె పొలం 29/1 సర్వేనెంబర్ లోని 1: 37 సెంట్లు ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు మరొక సర్వేనెంబర్ చూపి ప్రభుత్వ భూమి ప్లాట్లుగా వేసి కొంతమందికి కోట్ల రూపాయలకు విక్రయించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కొందరు తహసిల్దార్ ఫిర్యాదు చేయడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు కూడా జారీ చేశారు . మరికొందరు ప్రభుత్వ స్థలాన్ని సర్వేనెంబర్ మార్పు చేసి తమకు విక్రయించారని డి. ఎస్. పి మురళి నాయక్ కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**కదిరి రోడ్డు.. ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కదిరి రోడ్డు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఒక వ్యక్తి తన భూమి పక్కన ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని జెసిబిల సహాయంతో చదును చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వెలమవారిపల్లె గ్రామస్తులు ఆరోపించారు. భూమిలేని నిరుపేదలకు, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే భూములను కబ్జా చేసి విక్రయిస్తున్న అధికారుల మౌనం ఎందుకని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**భూ బకాసురుల భరతం పడతాం**

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారి భరతం పడతామని తాసిల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు.. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో భూ ఆక్రమణలపై ఆయనను వివరణ కోరగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోని ప్లాట్లు వేసి విక్రయించారని తమకు ఫిర్యాదులు అందడంతో సర్వేయర్ తో సర్వే చేయించి ప్రభుత్వ భూమి అని తేలడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు అందించామని ఆయన తెలిపారు. రెండు రోజులలో జెసిబి తో చదును చేసి నోటీస్ బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. పులివెందుల మండల పరిధిలో ఒక సెంటు భూమి కూడా అక్రమార్కుల చేతిలోకి పోకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# ఆగస్టు మొదటి వారంలోగా జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

## జల్ జీవన్ మిషన్ పనులపై సమీక్ష సమావేశం

## నిర్వహించిన బీటెక్ రవి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల నియోజకవర్గంలో కొనసాగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి చేయాలని టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అధికారులను ఆదేశించారు.ఈరోజు పులివెందుల ఆర్ అండ్ బి అతిథి గృహంలో బీటెక్ రవి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత తూగుట్ల మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. చక్రాయపేట మండలంలోని గడ్డంవారిపల్లె, సురభి, కల్లూరిపల్లె గ్రామ పంచాయ తీల్లో జరుగుతున్న పనులను ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. చక్రాయపేట మండలంలో పనులు పూర్తయితే నియోజకవర్గం మొత్తం జల్ జీవన్ మిషన్ పనులు పూర్తయినట్లేనని తెలిపారు. ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు, మెగా కంపెనీ ప్రతినిధులు పనుల అమలులో ఎదురైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులు, రైతులు, పోలీసులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు.జల్ జీవన్ మిషన్ పనులు పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలిసి ఈ పథకాన్ని పులివెందుల నియోజకవర్గ ప్రజలకు అంకితం చేస్తామని బీటెక్ రవి ప్రకటించారు.

# కుల వివక్ష లేని సమాజ సాకారం కోసం యువత ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా అన్వేష్, కమిటీ సభ్యులు ఎంబడి పోలయ్య పిలుపునిచ్చారు



ప్రజాభూమి పోరుమామిళ్ల :

నరసాపురం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ జిల్లా కమిటీ సభ్యులు ఎంబడి పోలయ్య మాట్లాడుతూ కులాంతర వివాహల బారిన పడిన యువతను తుద ముట్టిస్తున్న ఘటనలు అనేకం చూస్తూ ఉన్నామని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నుంచి నేటి కమ్యూనిస్టుల వరకు కులాంతర వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. అంతిమయాత్రలోనూ దళితులకు అవహేళనే ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల స్మశానాలను పెత్తందారుల ఆక్రమణలో ఉన్నాయని చెప్పారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ డ్రగ్స్ కేసులో దొరికాడని, అటువంటివారిని వదిలేశారని పేర్కొన్నారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం దళితులు తప్పు చేస్తే శిక్ష, పెత్తందారులు చేస్తే సత్కారమా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం హాజరు కాదని, సుప్రీంకోర్టు జడ్జిపై ఓ మత దురహంకార న్యాయవాది బూటు విసిరేసే ధైర్యం మనుధర్మ శాస్త్రం నుంచే వచ్చిందని తెలిపారు. ఉద్యమాలతో పాటు సామాజిక ఉద్యమాలు చేపట్టడంలో భాగంగా కుల వివక్ష లేని సమాజం కోసం సామాజిక శంఖారావం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్న ప్రకృతి వనరుల దోపిడీ కొనసాగుతూ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్మాదం పెరగడానికి కూటమి సర్కార్ దోహదం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం కులాల పేరిట కార్పోరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా కుల వివక్షను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. కూటమి సర్కార్ దళితవాడలలో పాఠశాలలను రద్దు చేస్తుందని తెలిపారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్స్ పై సుప్రీంకోర్టు తీర్పు చర్చనీయాంశంగా ఉందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను రాష్ట్రపతి సవరించి ఇవ్వాలని కోరారు. 1956లో సిక్కు దళితులు పోరాడి రిజర్వేషన్స్ సాధించుకున్నారని తెలిపారు. 1999లో వీపీ సింగ్ రిజర్వేషన్స్ ఇచ్చారని గుర్తు చేశారు. దళితులు మారితే రిజర్వేషన్స్ పోతాయని, బిసిలు ఓసీలు మారితే రిజర్వేషన్స్ పోవని పేర్కొన్నారు. దళితులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జి.చంద్రశేఖర్,సిఐటియు జిల్లా ఈ నెల 15 లోపు మండల, పట్టణ కమిటీల సమావేశం ముగించాలి. 16 నుంచి 26 వరకు అధ్యయన యాత్రలు. 27 నుంచి 30 వరకు సచివాలయాల్లో వినతి పత్రాల అందజేత. ఆగస్టు 3,4 మండల కార్యాలయాల వద్ద ధర్నాలు. 15న సమైక్యత దినోత్సవం నిర్వహణ. 16 నుంచి 21 వరకు ప్రచార యాత్రలు. నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వరికుంట్ల బాబు, గుండ్లకుంట కిరణ్, బాల ఓబయ్య, జీవన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య సందర్భంగా మానసాదేవి ఆలయంలో విశేష పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కడప--చెన్నై జాతీయ రహదారిపై కనుమ లోపలి సమీపంలో వెలసిన శ్రీ మానసాదేవి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, అగ్నిహోమం తదితర ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి శర్మ మాట్లాడుతూ కడప, ఒంటిమిట్ట, నందలూరు, చిన్నచౌకు తదితర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. అనంతరం ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

# హిందూ స్మశాన వాటికలో చెత్త డంపింగ్ నిలిపివేయాలి: కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ హిందూ స్మశాన వాటికలో చెత్త డంపింగ్ చేయడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర వుతున్నాయని గ్రామస్థులు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 902లో ఉన్న స్మశాన వాటికను గ్రామ ప్రజలందరూ వినియోగిస్తున్నారని, గ్రామపంచాయతీ చెత్తను అక్కడే వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. స్మశాన వాటిక హద్దులు, సమీప చెరువు విస్తీర్ణాన్ని సర్వే చేసి హద్దులు నిర్ధారించడంతో పాటు అక్కడ చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రకారం గౌరవప్రదమైన జీవన హక్కులో భాగంగా అంత్యక్రియలకు తగిన ప్రజా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గ్రామస్థులు పేర్కొన్నారు. స్మశాన వాటికను పరిరక్షించి పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# గొంటు వారి పల్లెలో గ్రంధాలయం ప్రారంభించిన హరిత ఫౌండేషన్





ప్రజా భూమి పోరుమామిళ్ల :

కడపజిల్లా కాశినాయన మండలంలోని గొంటు వారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హరిత ఫౌండేషన్ సహకారంతో మంగళవారం హెచ్ఎం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. హరిత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణి రాజకుమార్ సమకూర్చిన 50 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన గ్రంధాలయాన్ని ఎంఈఓ లు మహమ్మద్ షఫీ, నిర్మల, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలో నివాసం ఉంటున్న హరిత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణి రాజకుమార్ పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కాశి నాయన మండలంలోని గొంటు వారి పల్లెలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. మండలంలోని రెడ్డి కొట్టాల, వంకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో కూడా గ్రంధాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి కృషి చేశారన్నారు. విద్యార్థులు బాల్యం నుండే పుస్తక పఠనం అలవర్చుకుంటే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా, ట్రబుల్ షూటర్స్ గా, మేధావులుగా రాణిస్తారని మారుమూల ప్రాంతాలలో సైతం గ్రంథాలయాలను హరిత ఫౌండేషన్ ఏర్పాటు చేస్తుంద న్నారు. పేద విద్యార్థుల చదువు కోసం పరితపించే ఫణి రాజకుమార్ లాంటి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారం టూ వారు కొనియాడారు. హరిత ఫౌండేషన్ ద్వారా గొంటువారి పల్లెలో గ్రంధాలయం ఏర్పాటుకు సహకరించిన దాదాపీర్ ను హెచ్ఎం నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అమెరికా నుండి డాక్టర్ ఫణి రాజకుమార్ సందేశం ఇస్తూ పేదవాడి బ్రహ్మాస్త్రం చదువేన న్నారు. ప్రతి పేదింటి బిడ్డ చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న లక్ష్యం కోసం హరిత ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద, జవహర్లాల్ నెహ్రూ తదితర మహానుభావులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువులో ముందుకు సాగి పోవాలని డాక్టర్ ఫణి రాజకుమార్ ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చడం ప్రతి విద్యార్థి తన బాధ్యతగా భావించి చదవాల న్నారు. హరిత ఫౌండేషన్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పేద విద్యార్థుల విజ్ఞానాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్ హరిత ఫౌండేషన్ ద్వారా గ్రంధాలయాల ఏర్పాట్లు చక్కగా కృషి చేస్తున్నారంటూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూల రవీంద్రబాబు, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, ప్రదీప్, చౌడేశ్వరి దేవి, ప్రసాదరావు, దండు సుబ్బారెడ్డి, సురేష్ బాబు, కిరణ్, షఫీ, వెంకటస్వామి,ఎస్ఎంసి చైర్మన్ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి లీకేజీ, వీధిదీపాల సమస్యతో ప్రజల ఇబ్బందులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలం వెలుగువల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ, వీధిదీపాలు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. గత పది రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న కాలనీలోకి విషపురుగులు, వన్యప్రాణులు సంచరిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అలాగే తాగునీటి పైపు పగిలిపోవడంతో నీరు వృథాగా పోవడమే కాకుండా, ట్యాంకు సమీపంలో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రత నెలకొని దోమలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. దుర్వాసన వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని విమర్శించారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, సమస్యలను పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

# ఫ్యాప్టో కలెక్టరేట్ ముట్టడికి తరలి వెళ్ళిన ఎస్టీయూ నాయకులు



ప్రజాభూమి పోరుమామిళ్ల :

ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్ తో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ దగ్గర జరుగు ర్యాలీ, పికెటింగ్ కార్యక్రమాలకు పోరుమామిళ్ల రీజియన్ నుండి ఎస్టీయూ నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో చేపట్టిన దశలవారీ పోరాట కార్యక్రమాలలో భాగంగా కడప కలెక్టరేట్ దగ్గర ర్యాలీ మరియు టికెటింగ్ చేపట్టడమైనది. ఈ కార్యక్రమానికి రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలు వాహనాలలో ఎస్టీయూ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్టియు అనుబంధ జాతీయ స్థాయి ఉపాధ్యాయ సంఘం ఏఐఎఫ్ఇటిఓ జాతీయకార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ, పన్నెండవ పిఆర్సీని వెంటనే ఏర్పాటు చేసి,30 శాతం మధ్యంతరభృతి(ఐఆర్) ప్రకటించడంతో పాటు,పెండింగ్ లో ఉన్న 5డిఎ లు,ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు, పెండింగ్ బకాయిలన్నింటినీ తక్షణమే చెల్లించాలనే డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. 20 నుండి 30 సంవత్సరాలు సుదీర్ఘ అనుభవం కలిగిన ఇన్ సర్వీస్ టీచర్లందరికీ టెట్ తప్పనిసరి అనే నిబంధనపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి విద్యాహక్కు చట్ట సవరణ చేసి గందరగోళంలో ఉన్న ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించాలన్నారు. 2023 జూలై నుంచి అమలులోకి రావాల్సిన పిఆర్సీపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.పదవీ విరమణ చేసిన మరుసటి రోజే అన్ని పెన్షన్ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చంద్రహాస రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్ బాబు,వెంకటరెడ్డి, కె.వి సత్యనారాయణ, రీజనల్ కో కన్వీనర్ ఆర్.రమణ,ఆఫీస్ ఇంచార్జి కె.శ్రీనివాసులు, మండలశాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్.వి. సత్యనారాయణ,ఏ.జయరామిరెడ్డి,సిద్ధారెడ్డి,అబ్దుల్ హుస్సేన్, ఎం.బాలరాజునాయక్,సీనియర్ నాయకులు బి.సుబ్బారెడ్డి, జనార్ధన్ శెట్టి,ఆర్థిక కార్యదర్శి గురు ప్రసాద్, శ్రీనివాసులు,మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పంటల బీమా రైతులకు ధీమా: వ్యవసాయాధికారి చెన్నారెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంటల బీమా పథకం రైతులకు ధీమా అని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. 2026 ఖరీఫ్ సీజన్‌కు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. నల్లపురెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సంక్షేమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద వరి, జొన్న, కంది, మినుము, పసుపు, ఉల్లి పంటలకు జులై 31లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం వివరాలు:వరి ఎకరానికి రూ. 85,జొన్న: ఎకరానికి రూ. 38,కంది ఎకరానికి రూ. 36 మినుము ఎకరానికి రూ. 38,ఉల్లి ఎకరానికి రూ. 91,పసుపు ఎకరానికి రూ. 182 ఈ ప్రీమియంను ఫ్యూచర్ జనరల్, సెంట్రల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరుపై చెల్లించాలన్నారు. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద వేరుశనగ, పత్తి, అరటి, టమోటా, చీని, నిమ్మ పంటలకు జూలై 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రీమియం వేరుశనగ ఎకరానికి రూ.562,పత్తిఎకరానికి రూ.2023,అరటి ఎకరానికి రూ. 3061,చీని, నిమ్మ ఎకరానికి రూ. 2782 ఈ ప్రీమియంను ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరుపై చెల్లించాలన్నారు.బ్యాంకు రుణం తీసుకున్న రైతుల ప్రీమియంను బ్యాంకే కంపెనీకి జమ చేస్తుందన్నారు. రుణం లేని రైతులు రైతు సేవా కేంద్రం నుంచి పంట ధ్రువీకరణ పత్రం, భూమి పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ తో మీసేవ లేదా గ్రామ సచివాలయంలో ప్రీమియం చెల్లించాలని,పంట నమోదు లేకుంటే బీమా వర్తించదని గుర్తుచేశారు. కంది పంట సాగు చేసే రైతులకు 50% సబ్సిడీతో, పూర్తి ఉచితంగా కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

ప్రజాభూమి,పులివెందుల

నేడు మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునుందని విద్యుత్ రూరల్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రోడ్డు విస్తరణ పనులు ఉన్నందువలనఆర్ తుమ్మలపల్లి, రాయలపురం, రచ్చుమారి పల్లె,గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం అంతరాయం కలగనుశీదని.కావున దయచేసి విద్యుత్తు వినియోగ దారులు రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## కోయిలార్వార్ తిరుమంజనంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి తిరుమల



తిరుమల శ్రీవారి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించిన సాంప్రదాయ శుద్ధి కార్యక్రమం కోయిలార్వార్ తిరుమంజనంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి వరకు, ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయాలు, గోడలు, పైకప్పులను పరిమళభరిత సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో శుద్ధి చేసే ఈ పవిత్ర కైంకర్యంలో పాల్గొనడం ఆనందంగా ఉందని డా. డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన సారధి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక పూజలుబిబి,మండలాధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి, శివాలయంలో పూజలు నిర్వహించిన జనసేన నాయకులు. ప్రజా నాయకుడికి ఎల్లవేళలా ప్రజల ఆశీస్సులు. ఉంటాయని,పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి ప్రదాత ప్రజా నాయకుడు జనసేన పార్టీ అధినేత రథసారథి రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు, పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి జన సైనికులతో కలిసి, సోమవారం పరమశివుడికి అత్యంత పవిత్రమైన రోజు కావడంతో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్న తోటి నాగరాజు, పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీకాళహస్తి రోడ్డు నందు గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నతోటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల గుండెచప్పుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన శ్రామికుడు అని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసం నిరంతరం పోరాడే రాజకీయ, యోధుడని పవన్ కళ్యాణ్ ని అన్నారు. భగవంతుని ఆశీస్సులతో ముంబైలో జరిగిన శస్త్ర విజయవంతమైందని ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశీస్సులు ఉన్నంతకాలం అధినాయకుడుకి ఏమి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి,మండల ఉప అధ్యక్షులు దేవలం జగదీష్,పార్థ సారధి , ఉ కో ఆర్డినేటర్ దీన దయాల్, సీనియర్ నాయకులు త్యాగరాజు, వార్డ్ మెంబెర్ సీనియర్ న్యాయవాది మహబూబ్ బాషా, రమేష్ రెడ్డి ,మునికృష్ణ ,సలీం ,రమేష్ ,శేఖర్ ,నాగప్ప ,సతీష్ ,వీరామహిళలు గంగ,సాయి పూర్ణిమ, అదేమ్మ ,సుజాత మరియు జనసైనికులు, వీరామహిళలు పాల్గొన్నారు.



## టీటీడీ ఉద్యోగి షణ్ముగం మృతి అత్యంత బాధాకరం - కుటుంబ సభ్యులను పరామర్శించిన ఏపీఎంఎఫ్ తిరుపతి ఈసీ సభ్యులు సాయికుమార్

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రాపురం



రామచంద్రాపురం (ఆర్సీ పురం) మండలం బదూరు గ్రామానికి చెందిన టీటీడీ ఉద్యోగి షణ్ముగం ఇటీవల స్వర్గస్థులయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న ఏపీఎంఎఫ్ తిరుపతి ఈసీ సభ్యులు సాయికుమార్ మంగళవారం బదూరు గ్రామానికి చేరుకున్నారు.మరణించిన షణ్ముగం పార్థివదేహానికి పూలమాలలు వేసి సాయికుమార్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తీవ్ర దుఃఖంలో మునిగిపోయిన మృతుని కుమారుడిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని, షణ్ముగం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబానికి భగవంతుడు గుండె నిబ్బరాన్ని, మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

## అమ్మపాలెం వద్ద రెండు మోటార్ సైకిళ్లు డి : ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి మండలం అమ్మపాలెం సమీపంలో మంగళవారం ఓ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానికులు స్పందించి, తక్షణమే 108 అత్యవసర అంబులెన్స్ సర్వీసుకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు,బాధితుల గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉంది

## గూడూరు శ్రీ గాయత్రి లో మాక్ ఎలక్షన్స్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు... మాక్ పోలింగ్ మరియు కెప్టెన్ , వైస్ కెప్టెన్ ఎంపికకి మాక్ ఎలక్షన్ నిర్వహించినట్లు కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి తెలిపారు. కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ గాయత్రి స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు లీడర్షిప్ అనే కాన్సెప్ట్ లో భాగంగా... మాక్ పోలింగ్ నిర్వహించడం ... తద్వారా సమర్థవంతమైన పాలన, సమర్థవంతమైన నాయకత్వం ,అభివృద్ధి వైపు పరుగులు తీసే భవిష్యత్తు.... నాయకుల లీడర్షిప్ పైనే ఉంటుంది అని తెలియ చేయాలనే ఉద్దేశంతో... విద్యార్థులలో చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందింప చేయాలనే దృక్పథంతో ఈ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో , ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకొని, ఉపాధ్యాయులు ఓటు మరియు ఓటు హక్కు యొక్క విశిష్టతని విద్యార్థులకు వివరించారు.



## పారిశుద్ధ్య కార్మికులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నామ్‌స్టే' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత -జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ , కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న 'నామ్‌స్టే' కార్యక్రమాన్ని పారిశుద్ధ్య కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక పిజిఆర్ఎస్ హాల్ నందు నిర్వహించిన నామ్‌స్టే దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని పాస్ జ కార్మికులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుద్ధ్య కార్మికులు, రాగ్ పికర్లు, డోర్-టు-డోర్ వ్యర్థాల సేకరణ సిబ్బంది, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, ద్రవ వ్యర్థాల నిర్వహణలో పనిచేసే సిబ్బంది అందిస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వారి శ్రమను గుర్తించి, గౌరవప్రదమైన జీవనం కల్పించడంతో పాటు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నామ్‌స్టే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పారిశుద్ధ్య కార్మికులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయడం, ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించడం, ఆరోగ్య భద్రత కల్పించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వ్యర్థాల సేకరణకు అవసరమైన ఆటోలు, ఇతర వాహనాల కొనుగోలుకు రూ.5 లక్షల వరకు వడ్డీ రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా డ్రై వేస్ట్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు గ్లోవ్స్, బూట్లు, మాస్కులు, శానిటైజర్లు, క్యాప్‌లు వంటి వ్యక్తిగత రక్షణ పరికరాలను (పి పి ఈ కిట్లు) ప్రభుత్వం అందిస్తోందన్నారు. భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆసుపత్రి చికిత్స కోసం రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అలాగే వారి పిల్లలకు పదో తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోందని తెలిపారు. నామ్‌స్టే పథకం ద్వారా లభించే ప్రయోజనాలను పొందేందుకు అర్హులైన పారిశుద్ధ్య కార్మికులు తమ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ వివరాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు లేదా సంబంధిత అధికారులకు అందజేసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. అదేవిధంగా తిరుచానూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు రూ.5 లక్షల విలువైన ప్రమాద బీమా సదుపాయం కల్పించినందుకు సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవితో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, డెటాల్ లిక్విడ్, సబ్బులు, గ్లోవ్స్, మాస్కులు మరియు ఇతర వ్యక్తిగత పరిశుభ్రత, భద్రతకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. విధుల నిర్వహణలో వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, జిల్లా స్థాయి పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) సురేష్ నాయుడు, సంబంధిత శాఖల అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## తిరుపతి కోనేటి కట్ట.. దేశ రాజకీయ చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ప్రజా వేదిక

### జవహర్‌లాల్ నెహ్రూ నుంచి అటల్ బిహారీ వాజపేయి వరకు ఎందరో మహానేతల సందేశాలకు వేదికైన గోవిందరాజస్వామి కొలను

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి నగర హృదయంలో వెలసిన శ్రీ గోవిందరాజస్వామి కోనేరు కేవలం ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పవిత్ర క్షేత్రం మాత్రమే కాదు, దేశ రాజకీయ, సామాజిక, ప్రజా ఉద్యమ చరిత్రలో కూడా ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. దశాబ్దాలుగా ఈ కోనేటి కట్ట ప్రజా వేదికగా రూపుదిద్దుకుని దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలకు సాక్ష్యంగా నిలిచింది. బలమైన వాస్తుకు అనువైన సభా వేదిక తిరుపతిలోని గోవిందరాజస్వామి కోనేరులో నైరుతి మూలలో ప్రత్యేక సభా వేదికను ఏర్పాటు చేసి, ఈశాన్య దిశకు తిరిగి దేశ నాయకులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం ఒక ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగింది. వేలాది మంది ప్రజలు ఒకేచోట చేరే వీలున్న ఈ విశాల ప్రాంగణం ఎన్నో చారిత్రక సభలకు వేదికైంది.భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ప్రారంభమై, మాజీ ప్రధానులు శ్రీమతి ఇందిరా గాంధీ, పీ.వి. నరసింహారావు, వీ.పీ. సింగ్, అటల్ బిహారీ వాజపేయి, చంద్రశేఖర్ వంటి జాతీయ నాయకులు ఇక్కడి నుంచే ప్రజలకు తమ సందేశాలను అందించారు. వారి ప్రసంగాలు కేవలం రాజకీయ కార్యక్రమాలుగానే కాకుండా దేశ నిర్మాణం, ప్రజాస్వామ్య విలువలు, అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన దిశానిర్దేశాలుగా నిలిచాయి.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రులైన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, జలగం వెంగలరావు, కోట్ల విజయభాస్కరరెడ్డి, డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి తదితరులు కూడా ఈ వేదికపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వివిధ రాజకీయ పార్టీలు, ముఖ్యంగా వామపక్ష ఉద్యమాలు, సామాజిక సంస్కరణ ఉద్యమాలకు సంబంధించిన నాయకులు కూడా ఈ ప్రాంగణాన్ని తమ ప్రజా చైతన్య కార్యక్రమాలకు వినియోగించుకున్నారు. తిరుపతి కోనేటి కట్టపై జరిగిన అనేక సభలు రాజకీయ చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయి. ఎన్నో ఉద్యమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టబడింది. ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం, సామాజిక మార్పుకు పిలుపునివ్వడం, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఈ వేదిక దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.ప్రజా ఉద్యమాలు, రాజకీయ చైతన్యం, సామాజిక సంస్కరణలకు ప్రతీకగా నిలిచిన ఈ కోనేటి కట్ట, తిరుపతి నగరానికి ఒక చారిత్రక వారసత్వంగా చెప్పవచ్చు. దేశానికి, రాష్ట్రానికి నాయకత్వం వహించిన అనేక మంది మహానేతలు ఇక్కడి నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడటం వల్ల ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. నేటి తరం ఈ చారిత్రక ప్రదేశం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని చరిత్రకారులు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. తిరుపతి గోవిందరాజస్వామి కోనేటి కట్ట కేవలం ఒక కోనేరు మాత్రమే కాదు, దేశ రాజకీయ చరిత్రను మలిచిన మహా ప్రజా వేదికగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.



## టీటీడీ ట్రస్టుల దాతల ప్రివిలేజెస్‌లో మార్పులు - బోర్డు కీలక నిర్ణయాలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

టీటీడీలోని వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు అందించే దాతలకు కల్పిస్తున్న ప్రివిలేజెస్‌లో పలు మార్పులు చేస్తూ టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం జరిగిన టీటీడీ బోర్డు సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరీతి తీసుకురావడమే లక్ష్యంగా ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో మార్పులు చేస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. కొత్త నిబంధనలు నేటి అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయని, ఇప్పటికే విరాళాలు అందించిన దాతలకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రివిలేజెస్ యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. బోర్డు సమావేశంలో రూ.6.31 కోట్లతో తిరుమలలో ఎస్ఎస్‌డీ టోకెన్లు కలిగిన భక్తుల కోసం ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి టెండర్లను ఆమోదించారు. కుమారధార, పసుపుధార డ్యామ్‌ల వద్ద డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ.2.77 కోట్లు మంజూరు చేశారు. గ్రీన్ ఎనర్జీ అభివృద్ధిలో భాగంగా జీఎన్‌సీ సమీపంలో 800 కిలోవాట్ల విండ్ టర్బైన్ జనరేటర్‌ను విరాళంగా ఏర్పాటు చేసి 25 సంవత్సరాల పాటు విద్యుత్ సరఫరాకు అనుమతి ఇచ్చారు. తిరుమల ఎస్వీ మ్యూజియంలో 12 ఏళ్లు పైబడిన సందర్శకులకు జీఎస్‌టితో కలిపి రూ.50 ప్రవేశ రుసుము నిర్ణయించడంతో పాటు మ్యూజియం నిర్వహణను టాటా సంస్థకు అప్పగించాలని తీర్మానించారు. కాకులమానుతిప్ప సమీపంలోని పాత ఘన వ్యర్థాలను బయో-రిమీడియేషన్, బయో-మైనింగ్ ద్వారా శుద్ధి చేసేందుకు రూ.5 కోట్లు, తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణకు రూ.2.35 కోట్లు మంజూరు చేశారు. టిబీసీ, ఏటీసీ విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి దాతల సహకారంతో కొత్త భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. 2027 సంవత్సరానికి 10 లక్షల డైరీలు, 13.50 లక్షల 12 పేజీల క్యాలెండర్లు, 75 వేల 6 పేజీల క్యాలెండర్ల ముద్రణకు ఆమోదం తెలిపారు. ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో మౌలిక సదుపాయాల కోసం రూ.2.91 కోట్లు మంజూరు చేశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ మూలవిరాట్టుకు బంగారు కవచాల తయారీ కోసం టీటీడీ ట్రెజరీలోని వెయ్యి గ్రాముల బంగారాన్ని వినియోగించేందుకు, రూ.17.84 కోట్లతో 100 గదుల విశ్రాంతి గృహ నిర్మాణానికి టెండర్లకు ఆమోదం తెలిపారు. అలాగే ఆలయం ఈశాన్య మాడవీధి విస్తరణ కోసం భూసేకరణ నిమిత్తం రూ.2.11 కోట్ల చెల్లింపుకు ఆమోదం ఇచ్చారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ముఖ మండపంపై సాలహారం, ప్రాకార గోడ నిర్మాణానికి రూ.2.50 కోట్ల టెండర్‌కు ఆమోదం తెలిపారు. వేద పారాయణ స్కీం ద్వారా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో నిత్య వేద పారాయణం నిర్వహించేందుకు 791 మంది సంభావన వేద పండితులను నియమించాలని నిర్ణయించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల తదితర విభాగాల్లో సేవలందిస్తున్న కళాకారుల పారితోషికాలను వారి నైపుణ్యానికి అనుగుణంగా పెంచాలని నిర్ణయించారు. అలాగే టీటీడీ క్యాంటీన్లలోని 65 సర్వర్ల పోస్టులను క్యాటరింగ్ సూపర్‌వైజర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని బోర్డు తీర్మానించింది. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ. శరత్, సీవీఎస్‌వో మురళీకృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




## విద్యా ప్రమాణాలపై ఎంఈఓ

### ముని సుబ్రహ్మణ్యం ప్రత్యేక దృష్టి


### పాఠశాలలో విద్యార్థుల ప్రతిభ పరిశీలన

### మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండల విద్యాశాఖ అధికారి ఎ. మునిసుబ్రహ్మణ్యం మంగళవారం మండలంలోని వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాల మరియు నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యా, సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించారు. ముందుగా వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు, చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యా పురోగతిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మెనూ అమలు, వంటశాల పరిశుభ్రత, ఆహార నిల్వలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను స్వయంగా పరీక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పోషకాహారం అందించడంలో కూడా పాఠశాలలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పాఠశాల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.



## తిరుపతి బర్డ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగంలో వైద్యుల కొరత

### - గంటల తరబడి వేచి చూస్తున్న రోగులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతిలోని బర్డ్స్ ఆసుపత్రి అత్యవసర (ఎమర్జెన్సీ) విభాగంలో వైద్యుల కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం ఉదయం ఆసుపత్రికి చేరుకున్న రోగులు కూడా మూడు నుంచి నాలుగు గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఎమర్జెన్సీ వార్డుకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు, చికిత్స అందకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో విలువైనదైనా, వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల రోగుల ఆరోగ్య పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని బంధువులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల కారణంగా బర్డ్స్ ఆసుపత్రికి రావాలంటేనే రోగులు భయపడే పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ వైద్య సంస్థల్లో ఒకటైన ఈ ఆసుపత్రిలో అత్యవసర సేవలు సమర్థవంతంగా అందకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర విభాగంలో తగిన సంఖ్యలో వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బందిని వెంటనే నియమించి, రోగులకు ఆలస్యం లేకుండా నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, ఆసుపత్రి యాజమాన్యాన్ని ప్రజలు మరియు బాధితుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అలాగే బర్డ్స్ ఆసుపత్రి గతంలో సంపాదించుకున్న మంచి పేరును, ప్రజల విశ్వాసాన్ని కాపాడేలా అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గ్రామ ముంగిట్లోకి కార్పొరేట్ వైద్యం అరిగెలవారిపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన!

## అమర హాస్పిటల్ చే ఉచితంగా వైద్య పరీక్షలు,మందులు పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా అరిగెలవారిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్ అయిన అమర హాస్పిటల్ చే ఉచిత అత్యుత్తమ వైద్య శిబిరానికి ప్రజల నుండి భారీ స్పందన లభించింది. తిరుపతికి చెందిన ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రి 'అమర హాస్పిటల్' ఆధ్వర్యంలో,మంగళవారం జూ పార్క్ మాజీ డైరెక్టర్ దళవాయి మణి యాదవ్, పానేటి చెంగల్రాయులు సహకారంతో మంగళవారం అరిగిలవారిపల్లెలో భజన మందిరం( శ్రీకృష్ణ టెంపుల్) వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో అమర హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ జనరల్ మెడిసిన్ డాక్టర్ మేగణ, ఆర్థోపెడిక్స్ (కీళ్ల నొప్పుల) వైద్య నిపుణులు డాక్టర్ బాలాజీ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు.ల్యాబ్ పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే ఉచితంగా బీపీ, షుగర్ (జీఆర్‌బీఎస్) ఈసీజీ పరీక్షలు చేసి తక్షణ రిపోర్టులను






అందించారు. అంతేకాకుండా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పోటెత్తిన జనం – హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు

ఈ శిబిరానికి అరిగెలవారిపల్లి, పరిసర ప్రాంతాల నుండి వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రూపాయి ఖర్చు లేకుండా, తమ గ్రామ ముంగిట్లోనే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలు,మందులు అందించడం పట్ల గ్రామస్థులు అమర హాస్పిటల్ యాజమాన్యానికి, సహకరించిన మణి యాదవ్, పానేటి చెంగల్రాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "అమర హాస్పిటల్ సిబిఒ వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు.. ధనమే ప్రధానం కాకుండా సేవే పరమావధిగా సాగిన అమరహాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం ఎందరో నిరుపేదలకు కొండంత అండగా నిలిచిందన్నారు. అతితక్కువ ఫీజులతో వైద్యం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కూడా చికిత్స అందిస్తున్నా మన్నారు. జూపార్క్ మాజీ డైరెక్టర్ దళవాయి మణియాదవ్, మనప్రజలం దూ ఆరోగ్యం గా ఉండాలనే ఉద్దేశంతో కార్పొరే ట్ స్థాయి హాస్పిటల్ అయిన అమరహాస్పి టల్ చే ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు, ఉచిత మందులు,పంపిణీ చేశామన్నారు. గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు.ఇలాగే గ్రామంలో ప్రతి మూడు నెలలకు వైద్య శిబిరం నిర్వహించామన్నారు.తన వంతుగా గ్రామ అభివృద్ధిలోను,గ్రామ ప్రజలు ఆరోగ్య విషయం లోను కృషిచేస్తానని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో,పానేటిచెంగల్రాయులు, అరిగిల రామ చంద్రయ్య,బొజ్జా వెంకటరత్నం,కసా గోపాల్, అమర హాస్పిటల్ చెందిన,హేమ కుమార్, నరసింహా, లోకేష్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీని అరికట్టి -ఫీజుల నియంత్రణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి..!

## -వై సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు చెంగల్ రెడ్డి డిమాండ్..

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి: రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి డిమాండ్ చేసారు. నియోజకవర్గ పరిధిలోని తుమ్మలగుంటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగినవిలేఖరుల సమావేశంలో చెంగల్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకేసారి పూర్తి ఫీజు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారాలను విద్యాసంస్థల నుంచే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నాయన్నారు. విద్యను వ్యాపారంగా



మార్చుతున్నారని విమర్శించారు. చంద్రగిరి మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు వినోద్ కుమార్, చిన్నగొట్టిగల్లు మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు నక్క హరినాథ్ మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ)-2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద, బలహీన వర్గాల పిల్లలకు కేటాయించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ విద్యాసంస్థలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించకపోవడం, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయడం వంటి ఉల్లంఘనలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజుల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యాసంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తల్లిదండ్రుల కష్టార్జితాన్ని దోచు కుంటున్నాయన్నారు. యర్రవారిపాలెం మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు శేషరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని, విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి 25 శాతం ఉచిత ప్రవేశాలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. పుస్తకాలు, యూనిఫారాల బలవంతపు విక్రయాలను నిలిపివేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీలు నరేష్ బాబు, భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు గూడూరు రఫీ, రామచంద్రపురం మండల అధ్యక్షుడు యశ్వత్ రెడ్డి, విద్యార్థి నాయకులు ధనుష్, ఇంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి గండి కొట్టవద్దు - డాక్యుమెంట్ రైటర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, జీవో నెంబర్ 386, తేదీ 30-06-2025 ప్రజలకు రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ వారి నుండి మెరుగైన సేవలు అందించాలి అని నూతన పబ్లిక్ ప్రైవేట్ భాగ స్వామ్యం అనే విధానాన్ని తీసుకొని వచ్చి ప్రైవేట్ భాగస్వామ్యంలో రిజిస్ట్రేషన్ సేవల ఏర్పాటు కొరకు టెండర్లు పిలవాలి అని గవర్నమెంట్ తీసుకునే విధానం వల్ల ఎంతో మంది డాక్యుమెంట్ రైటర్స్ వారి సహాయకులు, స్టాంప్ వెండర్స్ జీవనోపాధి కోల్పోయే అవకాశం ఉందని గూడూరు డాక్యుమెంట్ రైటర్ల సంఘం అభిప్రాయబడింది ఈ సందర్భంగా న్యాయవాది డాక్యుమెంట్ రైటర్ రాయసం సుబ్బారావు మాట్లాడుతూ. ప్రభుత్వం నుండి ఫీజులు ఏమి తీసుకోకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండి, ప్రజలకు వారికి అవసరమైన సమయంలో అగ్రిమెంట్లు మొదలు ఇతర అన్ని డాక్యుమెంట్లు ప్రజల కోరిక మేరకు డాక్యుమెంట్ రైటర్స్ తయారు చేసి మంచి సర్వీసు ఇస్తూ ప్రస్తుతం నడుచు విధానం కంటిన్యూ చేసి ప్రైవేటు భాగస్వామ్యంతో డాక్యుమెంట్ తయారు చేయడం దరిమిలా జరిగే రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ను మరియు రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ను ప్రైవేటు భాగస్వామ్యంలోనికి తీసుకొని వెళ్ళడం వలన ప్రజల ఆస్థుల వివరాలు పబ్లిక్ లోకి పోయి ప్రజలకు నష్టం జరిగే అవకాశం వున్నందున ఆ జీవోను ప్రభుత్వం రద్దు పరచవలం నదిగా కోరుచూ డాక్యుమెంట్ రైటర్స్ జీవనోపాధికి ప్రస్తుతం ఉన్న విధానంలోనే నడపాలని కోరుచూ,



తే.20-07-2026ది నుండి తే.31-07-2026 ది వరకు డాక్యుమెంట్ రైటర్స్ రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ ప్రకటించినారు. సదరు జీవో అమలులోనికి వస్తే డాక్యుమెంట్ రైటర్స్ జీవనోపాదికి విఘాతం ఏర్పడి వారి కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉన్నందున పెన్ డౌన్ కు ప్రజలు సహకరించవలశినదిగా కోరడమైనది. యీ విషయమై ప్రభుత్వం వారు మంచి నిర్ణయం తీసుకొని పై జీవోను రద్దు పరచవలశినదిగా మరియు రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును విరమించుకోవలశినదిగా కోరుచున్నారు. కార్యక్రమంలో సీనియర్ డాక్యుమెంట్ రైటర్, న్యాయవాది రాయసం సుబ్బారావు, షేక్ మహబూబ్ బాషా (రఫీ), బూడిదవాక వెంకటరత్నం (ఆచారి), ముంగర ప్రసాద్, కె.పి. కుమార్, దూబగుంట వెంకటచలమయ్య, దొంతిరెడ్డి నరేంద్ర, బ్రహ్మయ్య, మురళి, విష్ణు, పంగులూరు సురేంద్ర అనువారితోటి ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం, నెల్లూరు అధ్యక్షులు శ్రీ పట్నం దుర్గేష్ బాబు, మస్తాన్ కుమార్, యం.డి.మజహరుద్దీన్, భర్త తదితరులు పాల్గొన్నారు.

# క్వారీ గుంటలో గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత

## - సహాయక బృందాల సేవలకు ఎమ్మెల్యే ఆదిమూలం సెల్యూట్

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్య పాలెం తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని మరదవాడ క్వారీ గుంటలో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని రెండు రోజుల పాటు సాగిన తీవ్ర గాలింపు చర్యల అనంతరం పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ దళాలు, అగ్నిమాపక శాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా వెలికితీశారు. ఈ సందర్భంగా వారి సేవలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రత్యేకంగా అభినందిస్తూ సెల్యూట్ చేశారు. రెండు రోజులుగా రాత్రింబవళ్లు కష్టపడి గాలింపు చర్యలు చేపట్టిన పుత్తూరు డీఎస్పీ రవి, ఇద్దరు సీఐలు, మండలాల ఎస్సైలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు నిరంతరం సంఘటన స్థలంలో ఉండి పర్యవేక్షణ నిర్వహించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్వారీ గుంటలోని నీటిని బయటకు





తొలగిస్తూ, నిద్రాహారాలు మాని ప్రాణాలకు తెగించి పనిచేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని కొనియాడారు. మృతుడి తల్లిదండ్రులకు చివరిసారిగా తమ కుమారుడిని చూసే అవకాశం కల్పించేందుకు సహకరించిన జిల్లా అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. వెలికితీసిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం త్వరితగతిన కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. అలాగే ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, బుచ్చినాయుడు కండ్రిగ టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు మావిళ్లపల్లి సుధాకర్ నాయుడు, తుమ్మల కన్నయ్య నాయుడు, రామనాథ్, రవి యాదవ్, సుధాకర్, దాము రెడ్డి, తలారివెట్టు రవి, విజయ్, వరదయ్యపాలెం సింగిల్ విండో చైర్మన్ నందకిషోర్ రెడ్డి, కరుణాకర్ నాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు అంబూరు బాల, సుబ్రహ్మణ్యం, యువరాజ్, కోటి, బీజేపీ మండల అధ్యక్షుడు దిల్లీప్ రాయల్, సిద్దలయ్య, జనసేన నాయకుడు శ్రీధర్, పిచ్చాటూరు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఇలంగోవన్ రెడ్డి, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల దర్శనం పేరుతో రూ.3.20 లక్షల మోసం.. టీటీడీ మాజీ ఉద్యోగి అరెస్ట్

## నిందితుడి ఖాతాల్లో రూ.85 లక్షల అనుమానాస్పద లావాదేవీలు.. మధ్యవర్తులను నమ్మొద్దని భక్తులకు పోలీసుల హెచ్చరిక

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి తిరుమల శ్రీవారి దర్శనం, సేవా టికెట్లు, వీఐపీ దర్శనాలు, వసతి గదులు కల్పిస్తానని భక్తులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్న టీటీడీ మాజీ ఉద్యోగి టి. అరుణ్ కుమార్ (26)ను తిరుపతి టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు, తిరుపతి జిల్లా పోలీసుల సంయుక్త చర్యల్లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గతంలో టీటీడీ ఉద్యోగం నుంచి తొలగించబడిన అరుణ్ కుమార్, 2023లోనూ ఇదే తరహా మోసం కేసులో అరెస్టైనట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల బెంగళూరుకు చెందిన రెండు కుటుంబాలకు దర్శనం,



సేవా టికెట్లు, వసతి కల్పిస్తానని నమ్మించి రూ. 3.20 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుడి బ్యాంకు ఖాతాల్లో గత ఏడాది కాలంలో సుమారు రూ. 85 లక్షల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, రూ. 99,000 నగదు, మూడు బ్యాంకు పాస్‌బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎల్. సుబ్బరాయుడు, టీటీడీ ముఖ్య నిఘా మరియు భద్రతాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ, భక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. దర్శనం, సేవా టికెట్లు, వసతి బుకింగ్‌ల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. మోసగాళ్లు ఇతరుల బ్యాంకు ఖాతాలను మ్యూల్ అకౌంట్లుగా వినియోగిస్తున్నందున, అపరిచితుల లావాదేవీల కోసం తమ బ్యాంకు ఖాతాలను ఇవ్వవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా మోసాల గురించి సమాచారం తెలిసినా వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని భక్తులను కోరారు.

# శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణా రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు :దండి నరేంద్ర

## - ప్రజా సమస్యలు, మున్సిపల్ సేవలు, నగరాభివృద్ధి, నిర్మాణాత్మక చర్చ

ప్రజా భూమి ప్రతి నిది :శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ కె.వి. కృష్ణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత, వీధి దీపాలు, ప్రజా మరుగుదొడ్లు, శ్రీకాళహస్తీశ్వర ఆలయ పరిసరాల పారిశుధ్యం, అక్రమ బ్యానర్లు, సార్ పురోగతి, పన్నుల నిర్వహణ, ఆదాయ వనరులు తదితర అంశాలపై సంక్షిప్తంగా చర్చించాము.ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు



అందించడంలో పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని కమిషనర్ పేర్కొనగా, ఆయన సానుకూల స్పందన, ఆత్మీయత అభినందనీయంగా అనిపించింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నవీన్, చంద్ర, దివాకర్ పాల్గొని కమిషనర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులకు మత్తు పదార్థం వలన కలిగే అనర్థాలపైన అవగాహన సదస్సు : సీఐ వెంకటేష్

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి పట్టణంలోని బాబు అగ్రహారం ఉన్నత పాఠశాలలో ఈరోజు మత్తు పదార్థం వలన కలిగే అనర్థాలపైన అవగాహన సదస్సు ఆధ్యాత్మిక అవధూత మాసపత్రిక 11 వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వన్ టౌన్



సిఐ వెంకటేష్ పాల్గొని వారు మాట్లాడుతూ జీవితంలో అత్యంత కీలకమైన దశ పదో తరగతి అని ఆ సమయంలో మంచి అలవాటుతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అదోహించగలరని అన్నారు. కానీ ఈ పాఠశాల వాతావరణంలో హాన్స్ వాడుతున్నట్టు మాకు సమాచారం అందిందని అలాంటి అలవాటులు ఎవరైనా చేసుకుని ఉంటే వెంటనే మానేయండి లేదంటే కోర్టు మెట్లు ఎక్కి ఖైదీలలో ఉండే పాఠశాలలకు వెళ్ళవలసి వస్తుందని హెచ్చరించారు. మీ బాగు కోసం ఒకటి రెండు ఛాన్సులు ఇస్తానని అప్పటికి మారని ఎడల శిక్ష తప్పదని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడైన ఆనంద రెడ్డి మాట్లాడుతూ డైరీలు వలన ఎంతో ప్రాధాన్యత ఉందని ఆ డైరీలు లోని నాలుగు పేజీలలో ఉన్న అత్యంత విలువైన మేటర్ ని ప్రతిరోజు చదువుకుని ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి మాట్లాడుతూ ఈ పాఠశాలలో గత ఏడాది అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని అందులో పూజిత అని అమ్మాయి నారా ద్వారా మెమొంటో అందుకు ఉండదని అదేవిధంగా అదేవిధంగా ఇవి ఆడది కూడా మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

# ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులను ఉచిత వైద్య పరీక్షలు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా, గూడూరు ఆర్టీసీ బస్టాండ్ లో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది... ఈ శిబిరంలో ఆర్టీసీ అధికారులు, ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, యూనియన్ సభ్యులు,స్థానిక ప్రయాణికులు,పేద ప్రజలు అందరూ పాల్గొనడం జరిగింది.....అన్ని రకాల వైద్య పరీక్షలకు సంబంధించిన డాక్టర్లు, ఉచితంగా



పరీక్షలు నిర్వహించి మందులు అందించడం చేశారు... సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఆర్టీసీ చైర్మన్ గా ఎన్నికైన తరువాత నుంచి మన ఆర్టీసీ బస్టాండులలో ప్రయాణికుల సౌకర్యార్థం ఎన్నో రకాల కార్యక్రమాలు, అభివృద్ధి పనులు ఎప్పుడు లేని విధంగా ఆర్టీసీ బస్టాండుల నిర్వహణలో కొత్త కొత్త మార్పులు చేపట్టి, ఆర్టీసీ విభాగంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నందుకు సురేష్ రెడ్డికి ఆర్టీసీ సిబ్బంది అందరూ ప్రశంసలు కురిపించడం చేశారు..... ఈ కార్యక్రమంలో గూడూరు టౌన్ బిజెపి అధ్యక్షుడు దయాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరికట్ల బాలకృష్ణ నాయుడు, మహిళా మోర్చ నాయకురాలు బిందు రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ గాలి ప్రకాష్ నాయుడు, టౌన్ మాజీ అధ్యక్షులు చెంచు రెడ్డి, బిజెపి టౌన్ కమిటీ సభ్యులు కటికాల సురేష్ ఐ సురేష్ బాబు గుమ్మడి శ్రీనివాసులు శివ... తదితరులు పాల్గొన్నారు .

# గూడూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

## -ఎమ్మెల్యే సునీల్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు, గూడూరు అసెంబ్లీ లోని కమిటీ హాల్ నందు జరుగుతున్న ఎస్టిమేషన్ కమిటీ సమావేశంలో పాల్గొని నియోజకవర్గం అభివృద్ధి కొరకు పలు సమస్యలను కమిటీ ద్వారా సంబంధిత శాఖ వాళ్ళకి తెలపలని కమిటీలో తెలుపుతున్న....డాక్టర్ పాశిం సునీల్ కుమార్ శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ....గూడూరు పట్టణం నందున్న శ్రీ అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రాంగణం ను దాదాపుగా 60 లక్షలకు పైగా నిధులు పెట్టి అభివృద్ధి చేసామని, ప్రాంగణంలో ఉన్నటువంటి ఆఫీస్ భవనం శిద్ధిలావస్థలో ఉన్నదని నూతన భవనం నిర్మాణం కొరకు గతంలో ~~~ చైర్మెన్ విజిట్ చేసినపుడు కూడా వారి దృష్టికి తీసుకెళ్లామని వారు త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు, కావున కమిటీ ద్వారా ~~~ దృష్టికి తెలపాలని కోరారు. కోట మండలం నందు 2 కోట్ల 31 లక్షలతో క్రీడా వికాశ కేంద్రం నిర్మాణం చేపట్టారని కొంత నిధులతో 35% పూర్తి చేసున్నారని మిగిలిన నిధులు మంజూరు చేసి పూర్తి చేసే లా కమిటీ ద్వారా ~~~ వారికి సిఫారస్సు చేయాలనీ కోరారు. వాకాడు మండలం తూపిలిపాలెం గ్రామం ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనీ గతంలో పర్యాటక శాఖ మినిస్టర్ గా ఉన్నటువంటి అఖిల ప్రియా రెడ్డి కి తెలుపున్నామని, ఈ ప్రాంతానికి దగ్గరలో మల్లాం సుబ్రహ్మణ్యం స్వామి వారి దేవాలయం, తూర్పు కనుపూరు గ్రామం నందు శ్రీ ముత్యాలమ్మ వారి దేవాలయం లు ఉన్నాయని నిరంతరం భక్తులు వస్తుంటారని, ఇక్కడ ఉన్నటువంటి బీచ్ దగ్గరకు నిత్యం ప్రతి రోజు 1000 మంది వస్తుంటారని, సెలవు దినాలలో 5000 మంది వరకు పర్యాటకులు వస్తుంటారని, బోట్ షికారు కెళ్తుంటారని, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే చుట్టూ ఎంతో అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వం లేదా ప్రైవేట్ భాగస్వామ్యంతో రిసార్ట్స్ ఏర్పాటు చేస్తే ఇంకా అభివృద్ధి చెందుతుందని కావున కమిటీ ద్వారా ఈ విషయాన్నీ కూడా సిఫారస్సు చేయాలనీ కోరారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

బుధవారం 15 జూలై 2026

# తిరుపతిలో ఈశా గ్రామోత్సవం-2026 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలోని శాప్ చైర్మన్ రవి నాయుడు కార్యాలయంలో మంగళవారం ఈశా గ్రామోత్సవం-2026 పోస్టర్‌ను రవి నాయుడు ఆవిష్కరించారు. ఈశా గ్రామోత్సవం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామోత్సవం నిర్వహణ, పోటీల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ, గ్రామీణ భారతదేశంలో క్రీడా స్ఫూర్తి, ఐక్యత, ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించేందుకు ఈశా గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, యువతతో పాటు మహిళలను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈశా గ్రామోత్సవం--2026 దేశంలోని అతిపెద్ద గ్రామీణ క్రీడా ఉత్సవాల్లో



ఒకటిగా నిలుస్తోందని, 18వ సారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 10 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 40 వేలకుపైగా గ్రామాల నుంచి 80 వేలకుపైగా క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. ఖేలో ఇండియా గుర్తింపు పొందిన ఈ టోర్నమెంట్‌లో 7 వేలకుపైగా జట్లు, సుమారు 15 వేల మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. విజేత జట్లకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు అందించనున్నట్లు, టోర్నమెంట్ వివిధ దశల్లో మొత్తం రూ.1 కోటి నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టులోని ఆటగాళ్ల ఒకే గ్రామానికి చెందినవారై ఉండటం ఈశా గ్రామోత్సవం ప్రత్యేకత అని, ఇది ప్రొఫెషనల్ క్రీడాకారుల కోసం కాకుండా గ్రామీణ ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమమని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో జూలై 26న జిల్లా స్థాయి పోటీలు, ఆగస్టు 16న రాష్ట్ర స్థాయి పోటీలు ఎస్వీ క్యాంపస్ స్కూల్, బాలాజీ కాలనీ, తిరుపతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శాప్, యువజన సంక్షేమ శాఖల సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు ఇప్పటికే 40కు పైగా వాలీబాల్ జట్లు, 12కు పైగా త్రోబాల్ జట్లు నమోదు అయినట్లు వెల్లడించారు. అర్హులైన గ్రామీణ క్రీడాకారులు ఈశా గ్రామోత్సవం--2026లో ఉచితంగా పాల్గొనవచ్చని, ఆసక్తి గల వారు అంష్టుు.ఏశీ/స్త్రతీఘువిశీయిఋుఎ ద్వారా నమోదు చేసుకోవాలని రవి నాయుడు కోరారు.ఈ కార్యక్రమంలో సంకల్ప ఎండీ డా. సోమేశ్వర్, ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ హిందీ పండిట్ ఆర్. మల్లీశ్వరి, ఈశా గ్రామోత్సవం తిరుపతి కోఆర్డినేటర్ సాయికృష్ణ సూర్యదేవర, గ్రామోత్సవ వాలంటీర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల విఫలం

## -: పేపర్ లీకేజీలు స్కాములతో దేశంలో ఆర్థిక విధ్వంసం

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట



2029లో కేంద్ర రాష్ట్రాల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఎర్రకోట పై రాహుల్ గాంధీ జండా ఎగరవేయడం ఖాయం సూళ్లూరుపేట లో మీడియా సమావేశంలో నేతల భీమా తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలగురువం బాబు ఘాటు విమర్శలు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమయ్యాయని తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలగురువం బాబు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ మావుదూరు వెంకటాచలపతి మండిపడ్డారు. సూళ్లూరుపేట ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ దేశాలు అభివృద్ధి దిశగా వెళ్తుంటే భారత్‌లో మాత్రం నీట్ పేపర్ లీకులు స్కామ్ లతో ఆర్థిక విధ్వంసం జరుగుతోందని ఆరోపించారు. ఎన్డీఏ అధికారంలో లేని రాష్ట్రాలపై కేంద్రం కక్షసాధింపు చేస్తోందని రాహుల్ గాంధీ ప్రజాక్షేత్రంలో గట్టిగా ఎండగడుతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత చట్టాల వల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా పతనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రాథమిక పాఠశాలలు జడ్పీ హైస్కూల్ లు నిర్వీర్యమయ్యాయని విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన ఓటర్ల డిజిటలైజేషన్ వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని హెచ్చరించారు. 2029 ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగరవేయడం ఖాయమని మావుదూరు వెంకటాచలపతి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయి ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఎగరవేస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ మండల అధ్యక్షులు టౌన్ ప్రెసిడెంట్లు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడి చేసిన వారిని ఉపేక్షించం

## -: తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు

### ఒక నిందితుడి అరెస్ట్.. మరికొందరి ప్రమేయం తేలితే కఠిన చర్యలు - ఎస్పీకి వినతిపత్రం అందజేసిన ఏపీజేఎఫ్ ప్రతినిధులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటనలో బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మీడియా ప్రతినిధులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు స్పష్టం చేశారు. జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ ఫోరం (ఏపీజేఎఫ్) ప్రతినిధులు జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా జర్నలిస్టుల భద్రతకు పోలీసు శాఖ పూర్తి ప్రాధాన్యత ఇస్తుందని, నిందితులను చట్టం ముందు నిలబెడతామని ఎస్పీ హామీ ఇచ్చారు. దాడి ఘటనపై పోలీసులు వేగంగా స్పందించి ఇప్పటివరకు ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. మరో నిందితుడిని ఇప్పటికే గుర్తించామని, అతడిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియో ఫుటేజీలను పూర్తిగా పరిశీలించామని, విచారణలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, జిల్లా అధ్యక్షుడు అరవ జయపాల్, జిల్లా కార్యదర్శి హరిబాబు, ట్రెజరర్ శ్రీనివాసులు, సభ్యురాలు మల్లెల వాణి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మనోహర్, హరిబాబు తదితర ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# 1వ వార్డ్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

## నూతన బోర్ పాయింట్ పరిశీలించిన వైఎస్ మనోహర్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



1వ వార్డ్ పెద్ద రంగాపురంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వైకాపా మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి మంగళవారం పర్యటించారు. గ్రామస్థులతో కలిసిఆయన నూతన బోర్ పాయింట్‌ను పరిశీలించారు. వైఎస్ మనోహర్ రెడ్డి, తాగునీటి కొరత నెలకొన్న ప్రాంతాలను స్వయంగా చూశారు. సమస్యను పరిష్కరించేందుకు నూతన బోర్ పాయింట్‌ను పరిశీలించి, వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు హాల్ గంగాధర్ రెడ్డి, పార్నపల్లి కిషోర్, రామ్ లక్ష్మణ్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జయరామి రెడ్డి, బలక్కగారి ప్రతాప్ రెడ్డి, రామనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఓటర్ల మ్యాపింగ్ గడువును ఈనెల 24 వరకు పొడిగించిన ప్రభుత్వం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రాష్ట్రంలో ఓటర్ల మ్యాపింగ్ గడువును భారత ఎన్నికల సంఘం ఈనెల 24వ తేదీ వరకు పొడిగించిందని శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. రేణిగుంట మండలం గాజుల మన్యంలో గత 30 సంవత్సరాలుగా స్థిరపడిన నేపాల్ దేశస్థుల ఓట్ల నమోదు ప్రక్రియలో సమస్యలు తలెత్తయి. దీనిపై సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తాసిల్దార్ శ్రవణ్ కుమార్ తో కలిసి మంగళవారం స్థానిక సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ నివసిస్తున్న నేపాల్ కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక బిఎల్వోలతో కలిసి వారి వద్ద ఉన్న వివిధ అడ్రస్ ప్రూఫ్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ముని చంద్రారెడ్డి ,వీఆర్వో విశ్వనాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# వివి కండ్రికలో భూ కబ్జాలను అరికట్టాలి.. దళితులు, గిరిజనులకు భూములు కేటాయించాలి: వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ డిమాండ్

## స్మశానానికి రెండెకరాల భూమి ఇవ్వాలని, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి రైల్వే కోడూరు

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం వివి కండ్రిక గ్రామంలో జరుగుతున్న భూ కబ్జాలను వెంటనే అరికట్టి, భూమిలేని దళితులు, గిరిజనులకు సాగుభూములు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి జిల్లా నాయకులు వందవాసి నాగరాజు, సీహెచ్ చంద్రశేఖర్ గ్రామంలో పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ దళితులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని సర్వే నంబర్ 130లో సుమారు 300 ఎకరాలు, సర్వే నంబర్ 142లో 50 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు అగ్రవర్ణ భూస్వాములు జేసీబీ యంత్రాలతో ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.





రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉపాధి విధానం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామంలో ఉపాధి హామీ పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీల జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. గ్రామ దళితుల స్మశానానికి కేటాయించిన సుమారు 20 సెంట్ల భూమి కూడా ఆక్రమణకు గురైందని, కనీసం రెండు ఎకరాల భూమిని స్మశానంగా కేటాయించాలని కోరారు. చెరువుకు వెళ్లే దారిని కూడా ఆక్రమించారని తెలిపారు. ఇప్పటికీ గ్రామంలో కుల వివక్ష కొనసాగుతోందని, అగ్రవర్ణాల ఇళ్లలో దోసిట్లో నీళ్లు పోసే వంటి వివక్షపూరిత ఆచారాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలైనా తమకు సొంతంగా కనీసం ఒక ఎకరం భూమి కూడా లేకపోవడమే ఈ వివక్షకు ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భూ కబ్జాలకు వ్యతిరేకంగా దళితులు, గిరిజనులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జస్టిస్ పున్నయ్య కమిషన్, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి ఆక్రమణకు గురైన దళితుల స్మశాన స్థలంతో పాటు ప్రభుత్వ భూములను పరిశీలించారు.

# ఎస్ఐఆర్ కు ఈనెల 24వతేదీ వరకు గడువు పొడిగింపు..

## - : జిల్లాలో ఎస్ఐఆర్ కింద అన్ కలెక్టబుల్ (మరణాలు, డబుల్స్, అడ్రస్ లు దొరకనివి, తదితర) వాటితో కలుపుకుని 20,38,497 (మొత్తం 100 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటైజ్డ్ చేయడం జరిగింది..

## - : జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమానికి సంబంధించి ఈనెల 24వ తేదీ వరకు గడువు పొడిగింపు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక విస్తృత సవరణ షెడ్యూల్‌ను సవరించిందని తెలిపారు. ఎస్ఐఆర్ - 2026 కార్యక్రమంలో భాగంగా 15.06.2026 నుండి 24.07.2026 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేయడం జరుగుతుందని, 24.07.2026 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ/పునః అమరిక, 31.07.2026న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం, 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిమ్ అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాలపరిమితి ఉందని, 31.07.2026 నుండి 28.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం చేయడం, 03.10.2026న చివరి ప్రచురణ ఉంటుందని తెలిపారు. సవరించిన షెడ్యూల్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని, రాజకీయ పార్టీలకు కూడా సవరించిన షెడ్యూల్ గురించి లిఖితపూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ - 2026 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 20,38,523 ఎన్యుమరేషన్ ఫారాలను అనగా పూర్తిగా 100 శాతం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జూన్ 15వ తేదీ నుంచి బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2,226 మంది బిఎల్ఓలు ఉండగా, అందులో అందరు బిఎల్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 20,38,523 ఓటర్లు ఉన్నారని, అందులో ఇప్పటివరకు పూర్తిగా 100 శాతం అనగా 20,38,523 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందన్నారు. అందులో మంగళవారం సాయంత్రం సాయంత్రం 6 గంటల వరకు 18,29,706 ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని (89.76 శాతం) డిజిటైజ్డ్ చేయగా, అన్ కలెక్టబుల్ కు సంబంధించి 2,08,791 (10.24 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు ఉండగా, మొత్తం అన్ కలెక్టబుల్ (మరణాలు, డబుల్స్, అడ్రస్ లు దొరకనివి, తదితర) వాటితో కలుపుకుని ఇప్పటివరకు జిల్లాలో 20,38,497 (100 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటైజ్డ్ చేయడం జరిగిందని తెలిపారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా 15.06.2026 నుండి 24.07.2026 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేసి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు జరుగుతుంది మరియు అందులో ఒక పూరించిన ఎన్యుమరేషన్ ఫారం తిరిగి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిఎల్ఏలు, రాజకీయ పార్టీలు సహకారాన్ని అందించాలన్నారు.

# 201 కుటుంబాల వందేళ్ల సమస్యకు పరిష్కారం

- పుల్లడిగుంట గ్రామ ప్రజలకు తీపి కబురు
- నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల స్థలాలకు పూర్తి హక్కులు
- శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కుంగుంది బాటలో పుల్లడిగుంట
- మున్ముందు మిగిలిన దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం: మంత్రి అనగాని

ప్రజాభూమి, ప్రతినిధి అమరావతి:

దీర్ఘకాలికంగా నిషేధిత జాబితాలో ఉండి హక్కులకు నోచుకొని గ్రామాలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. తాజాగా వందేళ్ల నుండి నిషేధిత జాబితాలో ఉండి హక్కులకు నోచుకొని పుల్లడిగుంట గ్రామ ప్రజలందరి సమస్యను తీర్చింది. ఈ గ్రామంలో ఉన్న 201 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లు అన్ని కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. వందేళ్ల క్రితమే ఈ గ్రామంలో ఇళ్లు నిర్మించుకున్నారు. ఎప్పటి నుండో గ్రామ పంచాయితీకి పన్నులు కడుతున్నారు. చాలా ఏళ్ల కాలం నుండి కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కార్నెపాడు రెవెన్యూ గ్రామానికి హెమ్లేట్ గా ఉన్న పుల్లడిగుంట ప్రజలు తమ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. తోపు పోరంబోకుగా వర్గీకరించబడ్డ తమ గ్రామం మొత్తం ఉన్న ప్రాంతాన్ని నిషేధిత జాబితా నుండి తొలగించి గ్రామ ప్రాంతంగా వర్గీకరించాలని కోరుతూ ఆ గ్రామ పంచాయితీ తీర్మానం చేసి పంపించింది. ఈ సమస్య తీవ్రతను గమనించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు అధికారులతో గ్రామ రికార్డులను పరిశీలించారు. వందేళ్ల నుండి అక్కడ ప్రజలు ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని, 8.51 ఎకరాల్లో ఇళ్లు, అంతర్గత రోడ్లు నిర్మించి ఉన్నాయని రీ సర్వేలో తేలిందని నిర్ధారించారు. ఈ ఇళ్లకు పక్కనే ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రామలయం, మజిద్ కూడా ఉంది. వీటితోపాటు ఎకరం 27 సెంట్లు ఖాళీ భూమి కూడా ఉంది. జిల్లా అధికారుల నుండి వచ్చిన నివేదిక ఆధారంగా తోపు పోరంబోకుగా ఉన్న భూమిని గ్రామ ప్రాంతంగా మార్చాలని, ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొనాలని, ఇళ్ల స్థలాలు ఉన్న 8.51 ఎకరాలను నిషధిత జాబితా నుండి తొలగించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. అదే విధంగా పక్కనే ఉన్న ఎకరం 27 సెంట్లను ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ, ఈ స్థలం తోపాటు ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రామలయం, మజీద్ స్థలాలను నిషేధిత జాబితాలో ఉంచాలని కోరుతూ రాష్ట్ర మంత్రి వర్గానికి ప్రతిపాదనలు పంపగా అనుమతి లభించింది. దీంతో పుల్లడిగుంట వందేళ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

మున్ముందు మరిన్ని దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలకు పరిష్కారం: మంత్రి అనగాని

దీర్ఘకాలికంగా పెడింగ్ లో ఉండి హక్కులకు నోచుకొని గ్రామలకు విముక్తి కల్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా శెట్టి పల్లి గ్రామంలో దశాబ్దాల కాలం నుండి హక్కుల్లేక ఇబ్బందులు పడుతున్న రెండు వేలమంది సమస్యను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగు నింపామన్నారు. అదే విధంగా బ్రిటీష్ అధికారుల చేసిన పొరపాటు కారణంగా 120 ఏళ్ల నుండి నిషేధిత జాబితాలో ఉన్న మండల కేంద్రమైన వట్టి చెరుకూరులోని 5వేల మంది ప్రజలకు వారి ఆస్తులపై హక్కులు కల్పించామన్నారు. ఆ తర్వాత కుప్పం నియోజకవర్గంలోకి కుంగుంది గ్రామంలో 61 ఏళ్ల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి 322 మంది పేదలకు డికేటీ పట్టాలను అందజేశామన్నారు. వ్యక్తులకు కాకుండా సమూహంగా ఒకే రకమైన సమస్య ఎదుర్కొంటున్న వారికి హక్కులు కల్పించేందుకు రెవెన్యూ శాఖ విశేషంగా కృషి చేస్తోందని, మున్ముందు ఇలాంటి సమస్యలున్న గ్రామాలకు విముక్తి కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించిన పుట్లూరు ఎస్సై సురేంద్రబాబు.

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలోనిపాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ సురేంద్రబాబు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళలపై జరిగే నేరాల నియంత్రణ, స్త్రీ రక్ష భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 సేవల వినియోగం, సైబర్ భద్రత, అలాగే బాల్య వివాహాల నిరోధం వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి ఘటనలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి భద్రమైన బాల్యం అందించాలనే సంకల్పమే మిషన్ వాత్సల్య పథకం

## -బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ

ప్రజాభూమి పోరుమామిళ్ల : మిషన్ వాత్సల్య అనేది కేవలం ఆర్థిక సహాయం అందించే పథకం మాత్రమే కాదు. ప్రతి చిన్నారికి రక్షణ, విద్య, ఆరోగ్యం, పోషణ, మానసిక భద్రత, కుటుంబ వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో రూపొందించిన సమగ్ర బాలల సంక్షేమ కార్యక్రమం. కుటుంబం నుంచి దూరమయ్యే పరిస్థితుల్లో ఉన్న పిల్లలను గుర్తించి, సాధ్యమైనంత వరకు కుటుంబంలోనే ఉంచుతూ అవసరమైన సహాయాన్ని అందించడం దీని ప్రధాన ఉద్దేశం అని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నారిసెట్టి సుప్రజ పేర్కొన్నారు. ఈ పథకం కింద సాధారణంగా కింది వర్గాల పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు.

- తల్లిదండ్రులు ఇద్దరూ లేని అనాథ పిల్లలు.
- తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన పిల్లలు.
- తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు.
- కుటుంబ పరిస్థితుల వల్ల ప్రత్యేక సంరక్షణ అవసరమైన పిల్లలు.
- ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర పరిస్థితుల వల్ల సంరక్షణ కోల్పోయిన పిల్లలు.
- సంబంధిత నిబంధనల ప్రకారం "సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలు"గా గుర్తించిన వారు.

ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన పిల్లలకు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు నెలకు రూ.4,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. సాధారణంగా ఈ మొత్తాన్ని ఆరు నెలలకు ఒకసారి రూ.24,000 చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. దీంతో సంవత్సరానికి మొత్తం రూ.48,000 వరకు లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

అర్హతకు అవసరమైన ముఖ్య నిబంధనలు



- పిల్లల వయస్సు 18 సంవత్సరాల లోపు ఉండాలి.
- ప్రభుత్వం నిర్ణయించిన ఆదాయ పరిమితుల్లో కుటుంబం ఉండాలి.
- సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.
- పరిశీలన అనంతరం అధికారులు అర్హతను నిర్ధారిస్తారు.

దరఖాస్తుకు అవసరమైన పత్రాలు

సాధారణంగా కింది పత్రాలు అవసరమవుతాయి.

- పిల్లల జనన ధ్రువీకరణ పత్రం
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- కుల ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే)
- ఆధార్ కార్డు
- రేషన్ కార్డు
- బ్యాంకు పాస్‌బుక్
- తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం లేదా అవసరమైన ఇతర ఆధారాలు
- సంబంధిత అధికారులు కోరిన ఇతర పత్రాలు.

అంగన్‌వాడీ కేంద్రం, ప్రాజెక్టు కార్యాలయం, జువూరా కార్యాలయం లేదా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు పత్రాలను పరిశీలించి అర్హులైన పిల్లలను ఎంపిక చేస్తారు.

# కడప పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి..!

- రూ.3,478 కోట్ల పెట్టుబడితో దాల్మియా సిమెంట్ లైన్--2 విస్తరణ...
- నేడు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన

ప్రజాభూమి ప్రతినిధి,కడప: వైఎస్సార్ కడప జిల్లాను ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా.. పారిశ్రామిక రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థలలో ఒకటైన దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ చేపడుతున్న లైన్--2 విస్తరణ ప్రాజెక్టుకు నేటి ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. జమ్మలమడుగు సమీపంలోని మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. కడప జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా తీర్చిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి ఫలితంగా.. జిల్లాలో యువత, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి. పరిశ్రమల కారిడార్ గా ఎదుగుతున్న కడప జిల్లాలో వేల సంఖ్యలో చిన్న, కుటీర పరిశ్రమలతో పాటు.. అనేక భారీ పరిశ్రమలు దేశ ఆర్థిక వృద్ధిరేటులో కీలకమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. జిల్లాలో సిమెంట్ పరిశ్రమ బలంగా ఎదుగుతోందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 16 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో పెద్ద సిమెంట్ యూనిట్లు పనిచేస్తుండగా, మరిన్ని విస్తరణ ప్రాజెక్టులు ప్రతిపాదిత దశలో ఉన్నాయి. ఈ విజయ పరంపరలో జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న దాల్మియా సిమెంట్ కర్మాగార యూనిట్‌కు రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యంతో రెండో భారీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనుంది. ఈ బృహత్తర శుభకార్యానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి,



నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శుభారంభం చేయనున్నారు. రూ.3,478 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12.6 మిలియన్ టన్నులకు పెరగనుంది. ఈ విస్తరణతో 354 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించగా, మొత్తం ప్రత్యక్ష ఉద్యోగాల సంఖ్య 954కు చేరుకోనుంది. ఈ ప్రాజెక్టుకు ఇటీవలే కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుంచి పర్యావరణ అనుమతి, అలాగే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి స్థాపన అనుమతి (సీటీఈ) లభించడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. కాగా దాల్మియా సిమెంట్స్ విస్తరణతో కడప జిల్లాలో పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం కానుంది. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు రవాణా, నిర్మాణం, గనుల తవ్వకం, యంత్రాల నిర్వహణ, సేవారంగం, చిన్నతరహా పరిశ్రమల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. స్థానిక యువతకు ఉపాధి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం, కొత్త పెట్టుబడులకు ప్రోత్సాహం లభించే ఈ ప్రాజెక్టు కడప పారిశ్రామికాభివృద్ధిలో మరో కీలక అధ్యాయంగా నిలవనుందని పారిశ్రామిక వర్గాలు, ఉద్యోగార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ పొడిగించిన గడువు సద్వినియోగం చేసుకోవాలి..!-జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్

**ఈనెల 24 వరకు బీఎల్ఓల ఇంటింటి సందర్శన, గణన పత్రాల సేకరణ**

ప్రజాభూమి ప్రతినిధి,కడప: రాష్ట్రంలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం ఈనెల 24 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని.. జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి అభ్యర్థన మేరకు భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియకు నిర్దేశించిన గడువులకు అనుగుణంగా ఇంటింటి సర్వే, గణన పత్రాల సేకరణ, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల పరిశీలన వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరి వివరాలు నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు ఎస్ఐఆర్ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇంకా గణన పత్రాలు సమర్పించని వారు, ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైన వారు జూలై 24లోపు తమ పరిధిలోని బీఎల్ఓలకు అవసరమైన పత్రాలు, వివరాలు అందజేసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, సిబ్బంది, ప్రజలు సమిష్టిగా సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.



# వియత్నాం బోటు ప్రమాద బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్..!

ప్రజాభూమి ప్రతినిధి,కడప: వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన ముడియం శ్రీధర్ భౌతికకాయం కడపకు చేరుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారి అకాల మరణం తీవ్ర విషాదకరమన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుడు శ్రీధర్ పనిచేసిన కంపెనీ తరపున అందించాల్సిన పరిహారం, సహాయ సహకారాలు, ఇతర అవసరమైన చర్యలు త్వరగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు గట్టి మనోధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట.. కడప ఆర్డీవో మురళి, కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

**- మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి**
**- ఈ-క్రావ్‌లో పంటల నమోదు పూర్తి చేసి బీమా ప్రీమియం చెల్లించాలని సూచన**

ప్రజాభూమి, వేంపల్లె

రైతులు ఈ-క్రావ్‌లో పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకొని, పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి సూచించారు. మంగళవారం టి.వెలమ వారిపల్లి, బక్కన్నగారిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. ఈ-క్రాప్‌లో పంటల నమోదు పూర్తి చేసి, బీమా ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన సందర్భంలో బీమా ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులను ఉపయోగించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏ హారిక, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




# పంట నమోదు తప్పనిసరి మండల వ్యవసాయ అధికారి అంగోత్ రమేష్

ప్రజాభూమి లింగాల

ఎల్నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వర్షాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి అంగోత్ రమేష్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే దాదాపు 40 శాతం తక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నా యన్నారు. ముఖ్యంగా జూన్ నుండి ఆగస్టు వరకు వర్షాల కొరత వేధించవచ్చని, అందువల్ల బోర్ల కింద సాగు చేసే రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ఉత్తమమని సూచించారు. రైతులు ఖచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకుని, ఆ నివేదికల ఆధారంగానే ఎరువుల యాజమాన్యం చేపట్టాలని కోరారు. అలాగే, ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు, భీమా సదుపాయాలు అందాలంటే సాగు చేసే ప్రతి రైతు కూడా పంట నమోదు (క్రాప్ బుకింగ్) తప్పనిసరిగా చేసుకోవాలని స్పష్టం చేశారు.




**మినుము పంట పరిశీలన -- తెగుళ్ల నివారణా చర్యలు**



కార్యక్రమంలో భాగంగా అధికారులు లోపాట్నూతల గ్రామానికి చెందిన రైతు విజయ్ కుమార్ రెడ్డి కి చెందిన మినుము పంటను పరిశీలించారు. పంటపై పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన వ్యవసాయ అధికారి రమేష్ నివారణకు పలు సూచనలు చేశారు. లీటర్ నీటికి 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ మరియు 10 గ్రాముల 19:19:19 ( ఎన్ పి కే ) కలిపి పంటపై పిచికారీ చేయాలని రైతుకు అవగాహన కల్పించారు.

ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం : ఈ సమావేశంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షభావ పరిస్థితులను తట్టుకోవడానికి ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో మేలైనదన్నారు. తక్కువ వర్షపాతంలోనూ పంటలు పండేలా ప్రత్యామ్నాయంగా "విత్తన గుళికల (సీడ్ పెల్లెట్స్)" తయారీ విధానాన్ని రైతు సేవ కేంద్రం ముందు రైతులకు లైవ్ డెమో ద్వారా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రాణి, యూనిట్ ఇన్చార్జ్ జయ నాయక్, ఐసిఆర్పి సిబ్బంది స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు పొడిగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

## - జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యులు దాసరి రవిశంకర్

ప్రజాభూమి, వేంపల్లె



ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువును ఈ నెల 24 వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందని జనసేన పార్టీ కడప పార్లమెంట్ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యులు దాసరి రవిశంకర్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. జూలై 24లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తవుతుందని, జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసి, ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ, ప్రజలందరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లను పరిశీలించుకుని, అవసరమైన సవరణలు, కొత్త ఓటరు నమోదుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవిశంకర్ కోరారు.

# ప్రభుత్వ భూముల కబ్జాపై కఠిన చర్యలు

## - తహసీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం: ప్రభుత్వ రెవెన్యూ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, జ్యోతి రెవెన్యూ పరిధిలోని సర్వే నం. 413/113లో ఉన్న 4 ఎకరాల 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టడంతో పాటు, సంబంధిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ రెవెన్యూ భూములు, డీకేటీ భూములు, అసైన్డ్ భూములు, ఇతర ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా అక్రమంగా ఆక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు రెవెన్యూ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

## ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా ప్రథమ ప్రాధాన్యత

## ప్రజాదర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల,



కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు, కార్యకర్తల సమస్యలను సావధానంగా విన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఘాటుగా విమర్శించారు.ఎంపీ నివాసానికి వచ్చిన పలువురు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు.. వాటన్నింటినీ విన్న ఎంపీ అవినాష్ రెడ్డి, కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంకొంత మంది సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ప్రజా సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది అని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హత లేదన్నారు.ప్రజాదర్బార్ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల దరఖాస్తుల ఆహ్వానం

## - జూలై 17లోపు బయోడేటా సమర్పించాలి

## - ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. వృక్షశాస్త్రం, గణితశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, చరిత్ర విభాగాల్లో చెరో ఒక అతిథి అధ్యాపక పోస్టును భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన తమ బయోడేటాను ఈ నెల 17వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు పీజీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్ లేదా స్లెట్ అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని గండి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

**- జనసేన పార్టీ యువ నాయకుడు రౌతు నాగేంద్ర ఆధ్వర్యంలో పూజలు**

ప్రజాభూమి, చక్రాయపేట



గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ యువ నాయకుడు రౌతు నాగేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి, పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుకుగా కొనసాగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని స్వామివారిని వేడుకున్నారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గండి క్షేత్రం ఆలయ పాలకమండలి సభ్యుడు శ్రీనివాసులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నేత జొన్నలగడ్డ బాబు తండ్రి నారాయణస్వామి మృతి

## - నివాళులర్పించిన బీటెక్ రవి



ప్రజాభూమి, లింగాల

లింగాల మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జొన్నలగడ్డ బాబు తండ్రి నారాయణస్వామి మృతి పట్ల పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) సంతాపం వ్యక్తం చేశారు. బీటెక్ రవి వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగు యువత కార్యదర్శి అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, తుమ్మలపల్లె ఎంపీటీసీ విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# అర్సేపల్లిలో వైభవంగా 'పొలం పిలుస్తోంది' ప్రారంభం

## ఎల్ నీనో తీవ్రతను సమర్ధంగా ఎదుర్కొంటాం

## ఏఎంసీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని

## రైతులకు ఉచితంగా వానపాముల ఎరువు, కంది విత్తనాల పంపిణీ

మచిలీపట్నం రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం మండలం అర్సేపల్లి రైతు సేవా కేంద్రం మీటింగ్ హాలులో మంగళవారం ఖరీఫ్ సీజన్ తొలి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మండల వ్యవసాయ అధికారి ఎం. రామ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మచిలీపట్నం ఏఎంసీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గోపు సత్యనారాయణ, పీఏసీఎస్ సొసైటీ ప్రెసిడెంట్, ఏఎంసీ సెక్రెటరీ భాస్కరరావు, ఏఎంసీ డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం సిద్ధంగా ఉంది – కుంచె దుర్గాప్రసాద్ నాని (ఏఎంసీ చైర్మన్)"ఈ సంవత్సరం ఎల్ నీనో తీవ్రతను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉంది. సాగు నీటి నిర్వహణ, ప్రత్యామ్నాయ ప్రణాళికలతో రైతాంగాన్ని ఆదుకుంటాం. వెదజల్లే పద్ధతిపై అవగాహన – గోపు సత్యనారాయణ (టీడీపీ జిల్లా కార్యదర్శి):"వరి సాగులో రైతులు సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా నేరుగా వెదజల్లే పద్ధతిని అలవర్చుకోవాలి. ఈ పద్ధతిలో పీఎండీఎస్ (PMDS) విత్తనాలను కలిపి చల్లుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు."రైతులకు ప్రోత్సాహకాలు:కార్యక్రమం ముగింపులో అర్హులైన రైతులకు వ్యవసాయ శాఖ తరపున కింది సహాయాన్ని ఉచితంగా అందజేశారువానపాముల ఎరువు కట్టలు (వర్మీ కంపోస్ట్) నాణ్యమైన కంది విత్తనాలుపాల్గొన్న సిబ్బందిఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పూజిత, కరుణ, రజనీ కుమార్, స్టాన్లీలతో పాటు నేచురల్ ఫార్మింగ్ (ప్రకృతి వ్యవసాయం) సిబ్బంది స్వామి, శ్రీలత తదితరులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

# బిదినంచెర్లలో చీని తోట దగ్ధం

## అగ్నికి ఆహుతైన చీని తోట..రైతు కన్నీరు ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి





ప్రజాభూమి,సింహాద్రిపురం,

సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామంలో అగ్నిప్రమాదం జరిగింది. రైతు ఎన్. నాగేశ్వర్ రెడ్డికి చెందిన 2 ఎకరాల చీని తోట మంగళవారం సాయం త్రం దగ్ధమైంది.ఈ ప్రమాదంలో సుమారు 9 సంవత్సరాల వయస్సు గల చీని చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే డ్రిప్ వ్యవస్థ, వాటర్ పైప్‌లై న్లు, ఎరువులు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.ఏళ్ల తరబ డి శ్రమించి పెంచుకున్న తోట ఒక్కసారిగా కాలి బూడిద కావడంతో రైతు నాగేశ్వర్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల పెట్టుబడి నీటిపాలైందని వాపోయారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేయాలని బిదినంచెర్ల గ్రామ రైతులు విజ్ఞప్తి చేస్తు న్నారు. బాధిత రైతుకు ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

# నెలవారీ ఆర్థిక నివేదికతో దేశంలోనే సరికొత్త పరిపాలనా విధానానికి శ్రీకారం :మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రం ఇప్పటి వరకు అమలు చేయని సరికొత్త పరిపాలనా విధానానికి నాంది పలికిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఆర్థిక నివేదికలు వార్షిక ప్రాతిపదికన మాత్రమే రూపొందించే ఆనవాయితీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతి నెలా "నెలవారీ ఆర్థిక నివేదిక రూపొందించే వినూత్న విధానాన్ని ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ నెలవారీ ఆర్థిక నివేదిక ద్వారా రాష్ట్రంలోని అన్ని శాఖల పనితీరు, ఆదాయ-వ్యయాలు, అభివృద్ధి సూచికలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, లక్ష్యాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించే అవకాశం లభిస్తుందని వివరించారు. ఇది కేవలం ఒక నివేదిక మాత్రమే కాకుండా, ప్రభుత్వ పరిపాలనకు దిశా నిర్దేశం చేసే ప్రామాణిక పత్రంగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అపారమైన పరిపాలనా అనుభవాన్ని, ఆర్థిక అవగాహనను, భవిష్యత్ దృష్టిని సమన్వయం చేసి ఈ విధానానికి రూపకల్పన చేశారని మంత్రి కొనియాడారు. రాష్ట్ర పరిపాలనను మరింత సమర్ధవంతంగా, పారదర్శకంగా, ఫలితాల ఆధారంగా తీర్చిదిద్దేందుకు ఈ నివేదిక కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత చురుకుగా మార్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS) వద్ద అందుబాటులో ఉన్న ప్రత్యక్ష సమాచారాన్ని, కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి డేటా ఆధారిత పరిపాలన అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు, మంత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రజల సమస్యలను రియల్ టైమ్‌లో గుర్తించి, వెంటనే పరిష్కరించే విధంగా ప్రతి శాఖ పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు.గత ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభం నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పరిపాలనా దక్షత, ఆర్థిక క్రమశిక్షణ, దూరదృష్టికే చెందు తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రం ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక సదుపా యాలు, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు.స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రం ప్రతి సంవత్సరం కనీసం 15 శాతం ఆర్థిక వృద్ధి (Growth Rate) నమోదు చేయడంతో పాటు, 20 నుంచి 25 శాతం వరకు ఆదాయ వృద్ధి (Revenue Growth) సాధించేలా అన్ని శాఖలు లక్ష్య బద్ధంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రతి నెలా నెలవారీ ఆర్థిక నివేదిక ఆధారంగా శాఖల పురోగతిని సమీక్షించి, తదు పరి నెల లక్ష్యాలను నిర్ణయిస్తూ పరిపాలనను ఫలితాల దిశగా నడిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేసి నట్లు చెప్పారు.ఈ విధానాల ద్వారా నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించడం, వ్యవ సా య రంగాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆదా యాలను పెంచడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.

# పాఠశాలల్లో క్రమశిక్షణ, పరిశుభ్రతపై రాజీ పడొద్దు





**జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశం**

**విద్యార్థులు, ఉపాధ్యాయుల ముఖ హాజరుపై నిరంతర నిఘా**

**రోజుకు 20 నిమిషాలు యోగాతో మెరుగైన ఫలితాలు**

**క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు చేపట్టాలి ..అధికారులకు ఆదేశం**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. స్థానిక సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ అధికారి యు.వి. సుబ్బారావుతో పాటు జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులతో (MEOs) కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా వాతావరణాన్ని మెరుగుపరిచేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

కలెక్టర్ ఆదేశాల్లోని ముఖ్యాంశాలు:పరిశుభ్రత - క్రమశిక్షణ: పాఠశాల ప్రాంగణాలను ఎల్లప్పుడూ పరిశుభ్రం గా ఉంచాలి. విద్యార్థులందరూ తప్ప ని సరిగా నిర్దేశిత యూనిఫాం ధరించేలా చూడా లి. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన హెయిర్‌కట్‌తో పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.హాజరు పర్యవేక్షణ: విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల ముఖ హాజరును (Facial Attendance) ప్రతిరోజూ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. పాఠశాలల్లో సమయపాలన పాటించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.మానసిక వికాసానికి యోగా: ప్రతిరోజు విద్యార్థులతో 20 నిమిషాల పాటు యోగా చేయించడం ద్వారా వారి అభ్యాసనా సామర్థ్యం, ఏకాగ్రత మరింత మెరుగుపడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.క్షేత్ర స్థాయి తనిఖీలు: మండల విద్యాశాఖ అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం సందర్శించాలి. క్షేత్రస్థాయిలో పైన పేర్కొన్న అంశాల అమలు తీరును పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్య అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో సానుకూల విద్యా వాతావరణాన్ని కల్పించడంలో అధికారులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు మరియు అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో రాజకీయ పార్టీలు, బి.ఎల్.ఏలు మరింత సహకరించాలి

– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో, మిగిలిన కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని ఓటర్ల జాబితాను మరింత ప్రామాణికంగా తీర్చిదిద్దేందుకు రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (బి.ఎల్.ఏలు), బూత్ లెవల్ అధికారులు (బి.ఎల్.ఓలు) సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజి కోరారు.ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పురోగతిపై మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లా డారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు "అన్-కలెక్టిబుల్", "అన్-ట్రేస్డ్", "షిఫ్టెడ్"గా గుర్తించిన ప్రతి ఓటరును మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, బి.ఎల్.ఓలు వ్యక్తిగతంగా సంప్రదించి వివరాలు నిర్ధారించాలని సూచిం చారు. బి.ఎల్.ఓ సూపర్వైజర్లు కూడా ప్రతి బి.ఎల్.ఓతో సమీక్ష నిర్వహించి, ఓటరు జాబితాలో నమోదైన చిరునామా వాస్తవమైందో లేదో ధృవీకరించాలని ఆదేశించారు.జిల్లాలో ప్రస్తుతం 1.39 లక్షల మంది అన్-కలెక్టిబుల్‌గా నమోదయ్యారని, వీరిలో ఇప్పటికే మరణించిన ఓటర్ల వివరాలు తొలగింపు ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన వారిని గుర్తించి మరో 20 నుంచి 30 వేల మంది వివరాలను సేకరించగలిగితే అది గొప్ప విజయమవుతుందన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వలసలు ఎక్కువగా ఉండటం వల్ల ఓటర్లను గుర్తించడం సవాలుగా మారుతోందని, ఈ దశలో రాజకీయ పార్టీల బి.ఎల్.ఏల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు అద్భుతంగా పనిచేశారని కలెక్టర్ ప్రశంసించారు.

ముఖ్యంగా పామర్రు నియోజకవర్గంలో నో-మ్యాపింగ్ కేసులు గణనీయంగా తగ్గించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2002 నాటి పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంటే అనుసంధానం సులభమవుతుందని, పట్టణ ప్రాంతాల్లో అయితే సంబంధిత పోలింగ్ స్టేషన్ వివరాలు అందిస్తే మ్యాపింగ్ పూర్తి చేయడం సులభమవుతుందని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల భౌగోళిక పరిధికి అనుగుణంగా ఓటర్లను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మచిలీపట్నం, పెడన, ఉయ్యూరు, తాడిగడప, గుడివాడ మున్సిపాలిటీల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఒకే భౌగోళిక ప్రాంతానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణకు ముందే సర్దుబాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి బి.ఎల్.ఏ తమ పరిధిలో ఉన్న ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి బి.ఎల్.ఓలకు అందించాలని కోరారు.తదుపరి పది రోజుల్లో మూడు ప్రధాన పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అన్-కలెక్టిబుల్ కేసుల పునఃపరిశీలన, నో-మ్యాపింగ్ కేసుల తగ్గింపు, పోలింగ్ స్టేషన్ల భౌగోళిక పరిధికి అనుగుణంగా ఓటర్ల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.జిల్లాలోని ప్రతి బి.ఎల్.ఓ తక్కువ సమయంలో ఎంతో కష్టపడి పనిచేశారని కలెక్టర్ అభినందించారు. మిగిలిన ప్రక్రియలో కూడా రాజకీయ పార్టీలు, బి.ఎల్.ఏలు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపగలమని విశ్వాసం వ్యక్తం చేశారు.సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



# 22(ఏ) నుంచి విముక్తికి విశేష కృషి..

**ఇప్పటికే 72 కేసుల్లో 282 ఎకరాలకు విముక్తి కల్పించాం**

**- పట్టాదారుల కేసులను పారదర్శకతతో పరిశీలిస్తున్నాం**

**- స్పెషల్ డ్రైవ్‌తో కేసుల పరిష్కారం వేగవంతం**

**- రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా కృషిచేస్తున్నాం**

- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

నిషేధిత భూముల (22-ఏ) జాబితాలో పొరపాటున నమోదైన భూములకు సంబంధించి పట్టాదారులకు సత్వర న్యాయం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా, వేగవంతంగా పరిశీలిస్తూ 22(ఏ) కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. అర్హులైన ఏ ఒక్క భూ యజమాని కూడా అనవసరంగా ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణలు నిర్వహించి, చట్టబద్ధంగా అర్హత ఉన్న భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ యాజమాన్య హక్కులను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో 22(ఏ) కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే 72 కేసులను పరిష్కరించి 282 ఎకరాల భూమికి 22(ఏ) జాబితా నుంచి విముక్తి కల్పించడం జరిగిందన్నారు. 2024లో నాలుగు కేసులకు సంబంధించి 8.95 ఎకరాలు, 2025లో 19 కేసులకు సంబంధించి 105.55 ఎకరాలు, 2026లో ఇప్పటివరకు 49 కేసులకు సంబంధించి 167.91 ఎకరాలకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. అర్జీలను పరిష్కరించి రిజిస్ట్రేషన్‌కు వీలుకల్పించిన దరఖాస్తుల్లో అయిదు నుంచి 15 ఏళ్లపాటు సైతం అపరిష్కృతంగా ఉన్నవి కూడా ఉన్నాయన్నారు. ఇలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక కేసులు ప్రస్తుతం పరిష్కారమవుతుండటంతో భూ యజమానులకు ఎంతో ఊరట లభిస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు.



లబ్ధిదారులకు నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు పత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ (ఫైల్ ఫోటో)

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పెడనలో సర్వమత ప్రార్థనలు



పెడన/ ప్రజాభూమి ప్రతినిధి

ముంబైలో శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం అక్కడ వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కాంక్షిస్తూ పెడన నియోజకవర్గంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని, ప్రజాసేవలో మునుపటిలా చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాలు చేపట్టారు.శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు ఎంపీ వల్లభనేని బాలసౌరి సూచనల మేరకు, స్థానిక నాయకుడు గరికపాటి శివ ఆధ్వర్యంలో పెడన పట్టణంలోని ప్రసిద్ధ గంగా పార్వతి సమేత అగస్త్రీశ్వర స్వామి శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. లోకకల్యాణం కోరుతూ, పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని స్వామివారికి రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.బాబు సుభాని జండా వద్ద ప్రత్యేక దువాశివాలయంలో పూజల అనంతరం, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ పెడన బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న ప్రముఖ బాబు సుభాని జండా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ సర్వమతాల వారు ఆయన ఆరోగ్యం కోసం ఏకతాటిపైకి రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.పాల్గొన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు:ఈ సేవా కార్యక్రమాల్లో జనసేన మరియు కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు:గరికపాటి శివ (కార్యక్రమ నిర్వాహకుడు)నల్లమోతు రఘురాంఓసా వెంకయ్యమట్టా శివ పావని వరుదు రామకృష్ణజెకెఎండి రఫీఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న పవన్ కళ్యాణ్ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో ప్రజా క్షేత్రంలోకి అడుగుపెడతారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వం రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677

# పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వినతిపత్రం

- వర్షాకాలం ప్రారంభమవడంతో పారిశుధ్యం వీధిలైట్లు ఏర్పాటు చేయాలి...
- రైతులకు విత్తనాలు, ఎరువులు ఆఫ్లైన్లోనే ఇవ్వాలి.
- ములకనపల్లి, కుందులూరు పంచాయతీల సమస్యల పరిష్కారానికి సి.పి.యం వినతి



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండల పరిధిలోని ములకనపల్లి, కుందులూరు గ్రామ పంచాయతీల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సి.పి.యం నాయకులు ములకనపల్లి జోన్ కమిటీ ప్రతినిధులు స్థానిక ములకనపల్లి సచివాలయ సెక్రటరీకి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులు, గిరిజనుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. వీధిలైట్ల ఏర్పాటు, వర్షాకాలం ప్రారంభమవడంతో గ్రామాల్లో కరెంట్ లేక చీకటి అలుముకుంటోందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేకపోవడంతో విష పురుగులు, దోమల భయంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని తెలిపారు. తక్షణమే అన్ని గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి వెలుతురు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పారిశుధ్య పరిరక్షణ ?వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని కోరారు. తక్షణమే పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి బోర్లు, బోర్ ప్లేట్ల నిర్మాణం గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి తాగునీటి బోర్లు బాగు చేయడంతో పాటు, వాటి చుట్టూ మురికి నీరు చేరకుండా పటిష్టమైన బోర్ ప్లేట్లు నిర్మించాలని కోరారు. అలాగే పాడైపోయిన మోటార్లను రిపేర్ చేసి పైప్‌లైన్ల ద్వారా సురక్షితమైన తాగునీటిని పునరుద్ధరించాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఆఫ్లైన్లోనే ఇవ్వాలి ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు వరి విత్తనాలు, ఎరువులను ఆన్‌లైన్ పద్ధతిలో కాకుండా ఆఫ్లైన్ విధానంలో నేరుగా అందించాలని డిమాండ్ చేశారు. సాంకేతిక ఇబ్బందుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు, దళారీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. జల్లివారిగూడెం, కుంజవారిగూడెం, టేకులూరు, కుందులూరు, తెల్లవారిగూడెం గ్రామాలకు1 ఫేస్ లైన్ ఇచ్చి కెఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి.అర్హులైన లబ్ధిదారులందరికీ 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి.వీరపాపనకుంట, గొల్లగూడెం నుండి ములకనపల్లి వరకు నిలిచిపోయిన బి.టి. రోడ్ పనులు. కారంగూడెం జంక్షన్ నుండి ఏ.జి. కోడేరు వరకు తక్షణమే బి.టి. రోడ్ పనులు ప్రారంభించాలన్నారు. అధికారులు స్పందించి ఈ ప్రధాన సమస్యలతో పాటు పెండింగ్ రోడ్డు పనులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, గిరిజనుల పోడు భూముల పట్టాల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సి.పి.యం నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూనె నాగేశ్వరరావు, కుంజ రాజయ్య, బంగారు ప్రసాద్, మోసం శేఖర్, కారం సుమన్, ముత్యాలరావు, జోగారావు, ముత్తయ్య, దుర్గారావు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల ఏర్పాట్లపై ఎస్పీ, జేసితో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

- పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు ముందస్తు కార్యాచరణ
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి





ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కొవ్వూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, కొవ్వూరు ఆర్డీవో కె ఆనంద రావు, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ రెడ్డి, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీ డి. దేవకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా దొమ్మేరు శివారులోని ప్రైవేట్ భూములు, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే, గ్రీన్ ఫీల్డ్ టోల్ గేట్, దేవరపల్లి డైమండ్ జంక్షన్, ప్రక్కిలంక ఘాట్, పైడిమట్ట గ్రామం, తాళ్లపూడి, కుమారదేవం తదితర ప్రాంతాల్లో పుష్కర్ నగర్లు, వాహన పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, భక్తుల రాకపోకలకు అనువైన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఏర్పాటును ముందస్తుగా శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధంగా రూపొందిస్తున్నామని తెలిపారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి, మరుగుదొడ్లు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసే సమయంలో వరద ముప్పు, భద్రత, రవాణా సౌలభ్యం, అత్యవసర సేవలు చేరుకునే అవకాశం వంటి అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేసి, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం పుష్కర స్నాన ఘట్టాలను సందర్శించిన అధికారులు ఘాట్ల వద్ద నీటి లోతు, ప్రవాహ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, ఘాట్ల విస్తరణ అవసరం, బ్యారికేడింగ్, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక ప్రజలు, మత్స్యకారులు, గ్రామ పెద్దల నుంచి గత పుష్కరాల అనుభవాలు, నీటి మట్టం మార్పులు, ప్రమాదకర ప్రాంతాలపై సమగ్ర వివరాలు సేకరించి వాటి ఆధారంగా కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఘాట్ల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధంగా వైద్య, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయ ప్రణాళిక సిద్ధం చేయాలి.రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళిక రూపొందించాలి.స్థానిక సంస్థలు, గ్రామస్థుల సహకారంతో అవసరమైన సమాచారం సేకరించి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించాలన్నారు.జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ వ్యవస్థ, అత్యవసర స్పందన బృందాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఘాట్ వద్ద భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పని చేస్తామని చెప్పారు.జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులకు పలు సూచనలు చేశారు.పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. పార్కింగ్ స్థలాలకు స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలి.ఈ పరిశీలనలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీవరం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి. శ్రీవరం బాధ్యతలు స్వీకరించారు. మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె తాజా బదిలీల్లో భాగంగా రావులపాలెం కళాశాలకు నియమితులయ్యారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి. శ్రీనివాసరావు బదిలీపై ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. శ్రీవరం మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల విద్యా, వ్యక్తిత్వ వికాసానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు కళాశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొత్త ప్రిన్సిపాల్‌కు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్. అరుణ్‌కుమార్, అధ్యాపకులు చినబాబు, రాజేంద్ర, శ్రీనివాస్, దుర్గాదేవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## పలు గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఇంటిటీ ఫీవర్ సర్వేలు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రేఖపల్లి ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు ఇంటింటి జ్వరాల సర్వేలను నిర్వహించారు. రేకపల్లి పీహెచ్సీ పరిధిలోని సోడే పహాడ్, దర్భలంక, సున్నం మక్కా, వెంకంపాలెం గ్రామాల్లో డాక్టర్ నీలు ఫర్, డాక్టర్ పృథ్వీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేసి, కేసులను గుర్తించి వారికి ఆర్డిటి టెస్టులను చేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు డెంగు మలేరియా వైరల్ జ్వరాలు తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. యధావిధిగా ఉమ్మడివరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహణ, ఓడోమస్ ఆయిట్మెంట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ భద్రకాళి, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని నేడు మహా పాదయాత్ర.

రామచంద్రపురం నుండి ద్రాక్షారామం వరకు.

మాణిక్యంబ సమేత శ్రీభీమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

జనసేన పార్టీ అధినేత , రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి త్వరగా వచ్చి పరిపాలన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుకుంటూ రామచంద్రపురం పార్టీ కార్యాలయం నుండి ద్రాక్షారామం భీమేశ్వరాలయం వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈమేరకు మహా పాదయాత్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నుంచి ద్రాక్షారామం భీమేశ్వరస్వామి ఆలయం వరకు మహా పాదయాత్ర నిర్వహించి అనంతరం ద్రాక్షారామం శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈకార్యాక్రమానికి నియోజకవర్గం జనసేన పార్టీ తరపున వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, ప్రజప్రతినిధులు, నాయకులు,పూర్వపు వాలంటీర్లు (సాధక్),వీరమహిళలు, జనసైనికులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీ తలుపులమ్మ లోవ క్షేత్ర సమగ్ర అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష....

ప్లాస్టిక్ నిషేధం, భక్తుల వసతులపై ప్రత్యేక దృష్టి.. ఆషాఢ మాస ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం...



ప్రజాభూమి ప్రతినిధి-తుని

కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం (లోవ) ఈఓలు, జిల్లా అటవీ శాఖాధికారిలతో కలిసి గౌరవ జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన మంగళవారం ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోవ దేవస్థానాన్ని పర్యావరణహిత ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు, భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తీసుకోవలసిన పలు కీలక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో లోవ దేవస్థాన పరిధిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులలో పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. పవిత్రమైన ఆలయ పరిసరాల్లో జూదం, నాటుసారా విక్రయాల వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినమైన నిషేధాన్ని అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా దేవస్థానానికి వచ్చే భక్తుల నుండి కొందరు వ్యాపారులు అధిక ధరలు వసూలు చేయకుండా నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.రాబోయే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ రోడ్డు, ఆలయ పరిసరాలలో పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, తగిన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో నిరంతరాయంగా శుద్ధ త్రాగునీటి సరఫరా మరియు మెరుగైన శానిటేషన్ (పారిశుధ్య) వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. అటవీ శాఖ సమన్వయంతో ఆలయ పరిసరాల్లో నగరవనం, నమోవనం, వృక్ష ప్రసాదం వంటి హరితాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, లోవ ప్రాంతాన్ని పచ్చదనంతో కూడిన ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చాలని నిర్ణయించారు.ఇదిలా ఉండగా, త్వరలో ప్రారంభం కానున్న పవిత్ర ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా దేవస్థాన ఈఓలు గౌరవ జిల్లా కలెక్టర్ గారిని, జిల్లా అటవీ శాఖాధికారి (ఐఖీూ) గారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. దేవాదాయ, అటవీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భక్తుల భాగస్వామ్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు

## గుడిమెల్లి జయరాజుకి పరామర్శ

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాజకీయ అనుభవం కలిగిన గుడిమల్లి జయరాజు మనవడు సాహిత్ బాబు గత రెండు రోజుల క్రితం విజయవాడ గుణదల పుణ్యక్షేత్రంలో ఏసుప్రభువును దర్శించుకుని మెట్లపై నుంచి దిగివస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో గాయాలపాలయ్యారు.ఈ విషయం తెలుసుకున్న గోపవరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు పి ఏ సి ఎస్ సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి గణేష్ ఈరోజు సాహిత్ బాబు నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# కుల ఆహంకారంతో వైసిపి విష రాజకీయాలు

- బీసీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- చిర్ల జగ్గిరెడ్డిపై మంత్రి సుభాష్ ఫైర్.




ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ని విమర్శించే క్రమంలో "బుడ బుక్కలోడు" అనే పదాన్ని పదే పదే ఉపయోగిస్తూ సంచార జాతులకు చెందిన బీసీ వర్గాలను అవమానించడం అత్యంత దురదృష్టకరమని ఆయన మండిపడ్డారు.బీసీలను కించపరిచేలా మాట్లాడటం వైసీపీ నాయకుల అసలు మనస్తత్వానికి నిదర్శనమని, కుల అహంకారంతో వెనుకబడిన వర్గాలను అవహేళన చేసే రాజకీయాలను ప్రజలు ఎన్నడూ క్షమించరని హెచ్చరించారు. బీసీలు అంటే అంత చులకనా వెనుకబడిన వర్గాలపై ఇంత వివక్ష ఎందుకు అంటూ జగ్గిరెడ్డిని ప్రశ్నించారు. కోనసీమ జిల్లాలో కుల విద్వేషాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై చట్టప్రకారమే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలను, అన్ని మతాలను సమాన దృష్టితో చూడాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉంటుందని, కానీ వైసీపీకి అలాంటి సంస్కారం లేదని విమర్శించారు. అందుకే ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చారని అన్నారు.గతంలో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఇప్పుడు అదే బీసీ సమాజాన్ని అవమానించడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. కేసులు ఎదుర్కోవడం, బూతులు మాట్లాడటం, సమాజంలో చిచ్చు పెట్టడం వైసీపీ నాయకులకు కొత్త కాదని, ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**బీసీలను అవమానిస్తే సహించం - గుత్తుల సాయి**

బీసీలను "బుడ బుక్కలోడు" అంటూ పదేపదే అవమానించడం క్షమించరాని తప్పని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి అన్నారు. బీసీ వర్గాలను హీనంగా చూపించే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, జగ్గిరెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంటే, వైసీపీ మాత్రం వాస్తవాలను వక్రీకరిస్తూ విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. ముమ్మిడివరం చెయ్యేరు చెరువు అభివృద్ధికి ప్రభుత్వం రూ.17.74 కోట్లు మంజూరు చేసినప్పటికీ, నిధులు ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేయ డం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు.

**క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం - పెంద్ర రమేష్.**

బీసీలను అవమానించిన జగ్గిరెడ్డి వెంటనే బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని వెనుకబడిన తరగతుల రాష్ట్ర కన్వీనర్ పెంద్ర రమేష్ హెచ్చరించారు.సంచార జాతుల్లోని కళాకారులను అవమానించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సముచిత గౌరవం, అవకాశాలు లభించాయని అన్నారు.బీసీ నాయకులుగా చెప్పుకునే మాజీ ఎంపీ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ లు ఈ అంశంపై పక్కన ఉండి మౌనం పాటించడం కూడా బీసీ సమాజాన్ని అవమానించి నట్లేనని, వారిద్దరూ కూడా బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పళ్ళం రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాపు ఉద్యమకారుడు మాజీ మంత్రి ముద్రగడ మృతిపై పలువురు సంతాపం





ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకే కాకుండా యావత్ రాష్ట్రం తన వైపు తిప్పుకునేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు ముద్రగడ పద్మనాభం మృతి యావత్ రాష్ట్రానికే తీరనిలోటని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. ఏ పని తలపెట్టిన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని తను అనుకున్నదే న్యాయమని దాని కోసం ఎంత దూరమైనా ఎంత చాగానికి అయిన తెగించి ముందుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు ముద్రగడ పద్మనాభం చివరి దశలో కొన్ని అనివార్య కారణాలవల్ల ఆయనకు ఒక మచ్చని తెచ్చిపెట్టింది లేకుంటే రాష్ట్రంలో కాపుల్లో ముఖ్యమంత్రి హోదా చేసే అర్హత ఆయనకు ఉండేది కానీ ఆయన తీసుకున్న కొన్ని తొందరపాటు నిర్ణయాల వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తుకే కాకుండా కుటుంబానికి కూడా తీరనిలోటని ఏది ఏమైనా ముద్రగడ మరణం రాష్ట్ర రాష్ట్రానికి కాపు జాతికి తీరనిలోటని ఆయన అభిమానులు రాజకీయ నాయకులు పలువురు అభిప్రాయపడ్డారు.

## షార్ట్ సర్క్యూట్ తో పామయిల్ తోట దగ్ధం



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన అక్కినేని ప్రసాదు మరియు రమా పద్మజాల పామాయిల్ తోటలో లెవెన్ కె.వి లైన్ వైరు తెగిపడి మంటలు చెలరేగి 10 ఎకరాలకు చెందిన పామాయిల్ తోటలో నాలుగైదు ఎకరాల వరకు ఒక 100 మొక్కలు మరియు డ్రిప్పుకు సంబంధించిన బిందు సేద్య పరికరములు అన్ని కాలిపోయి పది లక్షల వరకు ఆస్తి నష్టం సంబంధించింది.పరిసర ప్రాంత రైతులు స్వచ్ఛందంగా కొంత వరకు మంటలను ఆర్పి ఫైర్ ఇంజన్ వారికీ ఫోన్ చేయగా వారు వచ్చి ఇంకా మరింత నష్టం జరగకుండా మంటలను ఆర్పినారు.. సమాచారం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బందికి తెలియపరచి మాజీ సర్పంచ్ అక్కినేని చందు మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు సుంకర బాబి సంఘటన స్థలంకి చేరుకుని పరిశీలించడం జరిగింది.

## పవర్‌పేట ఆర్వోబీతో ఏలూరు అభివృద్ధికి కొత్త ఊపు

–ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పవర్‌పేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణాన్ని చేపడుతున్నట్లు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.ఆర్వోబీ నిర్మాణం వల్ల వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన వారికి నష్టపరిహారం అందిస్తామని, ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయడంతో వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారంపై ఆదేశాలు ఇచ్చారు.అనంతరం పవర్‌పేట స్టేషన్ రోడ్డులోని వ్యాపారులతో సమావేశమై వారి సందేహాలకు సమాధానమిచ్చారు.నగర భవిష్యత్ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం మరియు కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగానే ఆర్వోబీ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొంటూ నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## పాఠశాలల్లో ప్రతిరోజూ యోగ సాధన నిర్వహించాలి

–యోగ ఆడియో, వీడియోను ఆవిష్కరించిన కలెక్టర్ డీకే బాలాజి



ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం ప్రార్థనా సమావేశం సందర్భంగా విద్యార్థులతో యోగ సాధన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు యోగాభ్యాసం సులభంగా నేర్పేందుకు రూపొందించిన 18 నిమిషాల యోగ ఆడియో, వీడియోను మంగళవారం పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 200 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు యోగ శిక్షణ ఇచ్చామని, వారు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామం నేర్పించనున్నారని తెలిపారు. యోగ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. యోగ కార్యక్రమాల అమలుపై డీవైఈవోలు, ఎంఈవోలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.యోగ మాస్టర్ ముదిగొండ శాస్త్రి మార్గదర్శకత్వంలో రూపొందిన ఈ ఆడియో, వీడియోలో యోగ మాస్టర్ ప్రసన్న యోగాసనాలు, ప్రాణాయామ విధానాలను వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

- 2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు
- 95 వేల నుంచి భారీగా పెరిగిన పంపిణీ లక్ష్యం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో చదువుతున్న 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వారిలో 2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని వెల్లడించారు. జూలై 15 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 18 ఏళ్ల విద్యార్థులందరినీ పరీక్షించనున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా దీన్ని అమలు చేస్తాయన్నారు. కళ్లద్దాలు పంపిణీకి సుమారు రూ. 7 కోట్ల వరకు వ్యయమవుతుందని తెలిపారు.

**పథకం అమలు సంతృప్తికరంగా ఉన్నందున...**

గతేడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 95 వేల ఉచిత కళ్లద్దాల పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దాన్ని 2.50 లక్షలకు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, ఆమోదం కోసం కృషి చేశామని వెల్లడించారు.

రాష్ట్రంలో కంటి అద్దాల పంపిణీ సంతృప్తికరంగా ఉండడంతో కేంద్ర ఆమోదం తెలిపిందని చెప్పారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తామన్నారు. తదుపరి వైద్యం అవసరమైన వారిని ప్రభుత్వ నేత్ర వైద్యశాలలు, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వం గుర్తించిన స్వచ్ఛంద సంస్థల ఆసుపత్రులకు పంపించి చికిత్స చేయిస్తామని తెలిపారు. చిన్న వయస్సులోనే కంటిచూపు సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే విద్యార్థుల చదువు, ఏకాగ్రత, మానసిక వికాసం మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. దృష్టిలోపం కారణంగా విద్యార్థులు చదువులో వెనుకబడకుండా చూడడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. కంటి పరీక్షలు ప్రతి విద్యార్థికి జరిగేలా జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి సహకరించాలని కోరారు. నివారించగల అంధత్వాన్ని అరికట్టి, ప్రతి విద్యార్థికీ మెరుగైన కంటిచూపు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# అబద్ధాల పునాదులపై పుట్టిందే... గొడ్డలి పార్టీ

- మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు
- వైసీపీ హయాంలో 277 మంది మత్స్యకారులు మృతిచెందినా ఒక్కరిని కూడా పరామర్శించలేదు
- రూ.10 లక్షల సాయాన్ని 'ముష్టి' అనడం జగన్ అవినీతి మనస్తత్వానికి నిదర్శనం
- 10 నాటికల్ మైల్స్‌ను 10 కిలోమీటర్లుగా చెప్పడం జగన్ అజ్ఞానానికి ప్రతీక
- అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేసే పార్టీ వైసీపీ అని, అలాంటి పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ పర్యటనను జగన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని విమర్శించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన జగన్‌రెడ్డి మరోసారి నిరాశపరిచారని పేర్కొన్నారు. విశాఖ సముద్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటన బాధాకరమని మంత్రి తెలిపారు. అయితే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలు ప్రారంభించిందన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని వివరించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ఢీకొని గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని అన్నారు. విశాఖ తీరంలో ప్రమాదం జరిగిన ప్రదేశం 10 నాటికల్ మైల్స్ దూరంలో ఉండగా, దానిని 10 కిలోమీటర్లలోపే జరిగిందని జగన్ రెడ్డి చెప్పడం ఆయనకు ప్రాథమిక అవగాహన కూడా లేదనే విషయాన్ని బయటపెడుతోందన్నారు. నాటికల్ మైల్స్, కిలోమీటర్ల మధ్య తేడా తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా సముద్రంలో వేటకు వెళ్లిన 277 మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మత్స్యకారులపై ప్రేమ చూపించడం రాజకీయ నాటకమేనని విమర్శించారు. విశాఖ ఘటనలో బాధితుల ఆచూకీపై స్పష్టత రాక ముందే కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించిందన్నారు. ఆ సహాయాన్ని కూడా 'ముష్టి'గా అభివర్ణించడం ప్రజల బాధలను అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రతి మత్స్యకార పడవకు ట్రాన్స్‌పాండర్లు అమర్చి, అత్యవసర పరిస్థితుల్లో అలారం బటన్ నొక్కగానే ప్రభుత్వానికి సమాచారం చేరే విధంగా ఆధునిక వ్యవస్థను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రమాదం జరిగే సమయంలో పడవలో ఉన్న వ్యక్తులు ట్రాన్స్‌పాండర్ స్విచ్ నొక్కకపోవడం వలన ఆచూకి లభించలేదని తెలిపారు. ఘటన జరిగిన రోజు తనకు కంటి శస్త్రచికిత్స జరగటంతో స్వయంగా వెళ్లలేకపోయినా, వెంటనే మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను పంపించి పరిస్థితిని పర్యవేక్షించామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో మత్స్యకార భరోసా పథకం కింద రూ.531 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.511 కోట్లు మత్స్యకారులకు అందచేసామని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త బోట్లు, వలలు, తెప్పల పంపిణీ కార్యక్రమాలను పునఃప్రారంభించామని వెల్లడించారు.మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగినప్పటికీ, సీసీ కెమెరా దృశ్యాలతో నిజాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ప్రమాదాలు ఆకశ్మాత్తుగా జరుగుతాయి, కానీ ప్రమాదం జరిగిన వెంటనే బాధితున్ని వెంటనే హస్పిటల్ కు తరలించకుండా, తన కొడుకును కాపాడుకునేందుకు వేరే వ్యక్తి యాక్సిడెంట్ చేసేనట్లు చిత్రికరించేందుకు ప్రయత్నం చేసిన మాజీ మంత్రి కుటీల మనస్తత్వం ఏంటో బయటపడిందని అన్నారు. సమయానికి బాధితున్ని హస్పిటల్ కు తరలించి ఉంటే అతను బ్రతికే అవకాశం ఉండేదని, చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని, ఈ వ్యవహారంలోనూ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌రెడ్డితో ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు. ప్రత్యక్షంగా అయినా, ఆన్‌లైన్‌లో అయినా ప్రజల ముందే వాస్తవాలు వెల్లడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అసత్య ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక ఫలించవని, ప్రజలు ఇప్పటికే వైసీపీ నిజస్వరూపాన్ని గుర్తించారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# ఈ నెల 24వ తేదీ వరకు సర్ గడువు పొడిగింపు

- బీఎల్‌వోల ఇంటింటి సందర్శనకు మరింత సమయం
- కార్యక్రమంలో మరింత పారదర్శకత, కచ్చితత్వానికి వీలు
- జిల్లాలో 99.46 శాతం మేర డిజిటైజేషన్ ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కీలకమైన బీఎల్‌వోల ఇంటింటి సందర్శనకు ఈసీఐ ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించడం జరిగిందని.. కార్యక్రమంలో మరింత పారదర్శకత, కచ్చితత్వానికి ఇది దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు సవరించిన షెడ్యూల్ ప్రకారం కార్యకలాపాలను నిబద్ధతతో పూర్తిచేయాలని ఆదేశించారు. ఓటర్లు, రాజకీయ పక్షాలు, బీఎల్ఏలు కూడా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ ఉంటుందని.. అప్పటి నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలకు వీలుంటుందన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు నోటీసు దశ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని వివరించారు. చివరిగా అక్టోబర్ 3వ తేదీన తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా విశిష్టత స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమన్వయంతో పూర్తిచేసి ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములు అయ్యారని.. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనలో మరింత కీలకంగా వ్యవహరించాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. డేటాను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 17,13,445 మంది ఓటర్లకుగాను 17,04,186 మంది (99.46 శాతం) ఓటర్లకు సంబంధించిన సమాచారం డిజిటైజేషన్ పూర్తయిందని వివరించారు. తిరువూరులో 2,07,673 (99.50 శాతం), విజయవాడ పశ్చిమలో 2,56,849 (99.95 శాతం), విజయవాడ మధ్యలో 2,77,099 (99.74 శాతం), విజయవాడ తూర్పులో 2,68,844 (99.67 శాతం), మైలవరంలో 2,84,317 (99.70 శాతం), నందిగామలో 2,03,243 (97.96 శాతం), జగ్గయ్యపేటలో 2,06,161 (99.33 శాతం) డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

## జిల్లాలో 99.95 శాతం ఓటరు వివరాల డిజిటలైజేషన్ పూర్తి

**వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యం – జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్**

ప్రజాభూమి ప్రతినిధి–చిత్తూరు

జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని, ఓటరు వివరాల డిజిటలైజేషన్ ఇప్పటికే 99.95 శాతానికి చేరుకుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సమావేశపు మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు వరకు డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లకు గాను 13,39,675 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 99.97 శాతం పంపిణీ పూర్తయిందన్నారు.

# జిల్లాలో మామిడి పంట పండించిన ప్రతి రైతు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- ప్రభుత్వం అందించే సబ్సిడీ అర్హులైన ప్రతి రైతుకు అందేలా చర్యలు చేపట్టాలి
- ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- ప్రతి రైతుకు ఎలాంటి కొరత లేకుండా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి–చిత్తూరు

జిల్లాలో మామిడి పంట పండించిన ప్రతి రైతు పంటకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులతో మామిడి కాయల సేకరణ పురోగతి, ప్రభుత్వం అందించే సబ్సిడీ, అర్హులైన రైతుల గుర్తింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఒక్కో అర్హత గల రైతుకు అందించే సబ్సిడీ పారదర్శకంగా, నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. ఇందుకోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం (=ాఖ) సిబ్బంది సంయుక్త బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామంలో మామిడి పంట పండించిన రైతులను గుర్తించాలని సూచించారు.మామిడి పంటకు సంబంధించిన ప్రతి నమోదును ఈ–క్రాప్ వివరాలతో సరిపోల్చి, అవసరమైన చోట భౌతిక పరిశీలన నిర్వహించాలని తెలిపారు. కేవలం ఈ–క్రాప్ నమోదుపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో పంట వాస్తవంగా ఉందా లేదా అనే అంశాన్ని కూడా నిర్ధారించాలని చెప్పారు. ఈ–క్రాప్‌లో నమోదు లేకపోయినా భౌతికంగా మామిడి పంట ఉన్నట్లయితే సంబంధిత నిబంధనల ప్రకారం ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసి అర్హత కల్పించాలని సూచించారు. అలాగే ఈ–క్రాప్‌లో నమోదు ఉండి క్షేత్రస్థాయిలో కూడా పంట ఉన్న రైతులను అర్హులుగా పరిగణించాలని తెలిపారు. ఈ–క్రాప్‌లో రైతు పేరు నమోదై ఉండి రైతు మరణించిన సందర్భాల్లో, వారి కుటుంబ సభ్యులు పంటను విక్రయించి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ శాఖ ధ్రువీకరణ, ఆధార్ తదితర ఆధారాలను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హత నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు.

మామిడి పంట పండించిన ఒక్క రైతు కూడా ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించాలని, అర్హులైన రైతులందరికీ సబ్సిడీ అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.అదేవిధంగా జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రైతులకు అవసరమైన ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.